veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | గురువారం 15.10.2026

సంపుటి : 9 | సంచిక : 123

www. veluturu.com



12

## మహాచండీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

- మహాశక్తి ఆలయంలో పసుపు కొమ్ములతో చండీదేవి అలంకరణ
- ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

### రైల్వే ఉద్యోగులకు

## దసరా ధమాకా..!

### 78 రోజుల బోనస్ ప్రకటించిన కేంద్రం



**న్యూ ఢిల్లీ, వెలుతురు:**

దసరా పండుగల వేళ రైల్వే ఉద్యోగులు ఆత్రుతగా ఎదురుచూసే శుభవార్త రానే వచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 11.40 లక్షల మంది రైల్వే సిబ్బందికి కేంద్ర ప్రభుత్వం భారీ తీపి కబురు అందించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్.. అర్హులైన రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనంతో సమానమైన బోనస్‌ను ఆమోదించింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం మొత్తం రూ.2,009.61 కోట్లు విడుదల చేయనుంది. ఈ పండుగ బోనస్ ద్వారా మొత్తం 11,40,770 మంది నాన్-గెజిటెడ్ రైల్వే ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. అర్హత కలిగిన ప్రతి ఉద్యోగికి గరిష్టంగా రూ. 17,951 బోనస్ రూపంలో అందనుంది. రైల్వే శాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 'గ్రూప్ సీ' సిబ్బందికి ఈ బోనస్ లభిస్తుంది. ట్రాక్ మెయింటెనెర్లు, లోకో పైలట్లు, ట్రైన్ మేనేజర్లు (గార్డులు), స్టేషన్ మాస్టర్లు, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, టెక్నీషియన్ హెల్పర్లు, పాయింట్స్‌మెన్, మినిస్టీరియల్ సిబ్బంది, ఇతర గ్రూప్ 'సీ' ఉద్యోగులు ఈ బోనస్ పొందనున్నారు. రైల్వే సిబ్బంది కనబరిచిన అద్భుత పనితీరుకు గుర్తింపుగా ఈ బోనస్‌ను ఆమోదించినట్లు కేంద్ర కేబినెట్ తెలిపింది. ఈ ప్రోత్సాహకం రాబోయే రోజుల్లో రైల్వే సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.




### మనకు ఏ రాష్ట్రంతోనూ పోటీ లేదు..

# చైనా, జపాన్‌తోనే పోటీ

## 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

**సమాఖ్యల అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ప్రారంభించిన ఆయన సమావేశంలో ప్రసంగించారు. సమైఖ్య అనే పదం చాలా బలమైనదని, ఈ అధునాతన యుగంలో అది అత్యంత అవసరమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, కొత్త తరానికి నూతన వాణిజ్య చట్టాలపై అవగాహన కల్పించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదగడంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.**



- దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి పెంచడమే లక్ష్యం
- తెలంగాణను మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం
- సమాఖ్య బిజినెస్ సమ్మిట్-2026ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయాలని వ్యాఖ్య

**హైదరాబాద్, వెలుతురు:**

అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపించటంలో మన దేశ యువత ఎలోన్ మస్క్ తో పోటీ పడుతోందని, గ్లోబల్‌గా వస్తున్న మార్పులకు అనుగుణంగా అందరూ పని చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త తరానికి తమ ఆలోచనలు అందించే ప్రయత్నం అభినందనీయమని అన్నారు. ఈ తరం జనరేషన్‌కి లెగసీ, సక్సెస్ స్టోరీలను తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వందేళ్ళ స్వతంత్ర ప్రయాణంలో ఇప్పుడు మనం ఎక్కడికి చేరుకున్నాం అనేది సమీక్ష చేసుకోవాలని, 2047 అనేది చాలా కీలకమైన సమయమని వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ లో కూడా ప్రధాని మోడీకి ఈ అంశంపై సూచన చేశామని, వారు కూడా రాష్ట్రాల సహకారం కోరుతున్నారని తెలిపారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉంటాయని, ఆ తర్వాత కేవలం అభివృద్ధి మీదనే తమ ఫోకస్ ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హెల్త్ పాలసీ తెచ్చి పారిశ్రామిక రంగాన్ని పెంచే పనిలో ఉన్నామని, ఓఆర్ఆర్ రావడం వల్ల చాలా ఏరియాలకు మంచి యాక్సెస్ వచ్చిందని చెప్పారు. యువ పారిశ్రామిక వేత్తలను ఆహ్వానిస్తున్నామని, - మిగతా 2 లో..



## జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..

### ముగ్గురు భారతీయుల సజీవ దహనం

### మరో ఐదుగురికి తీవ్ర గాయాలు

**బోచువమ్, వెలుతురు:**

జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బోచుమ్ నగరంలోని ఓ భవనంలో అగ్నిప్రమాదం జరగ్గా ఈ ప్రమాదంలో ముగ్గురు భారతీయులు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. బోచుమ్ నగరంలోని ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకు న్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. బోచుమ్ నగరంలోని ఓ భవ నంలో మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకు న్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అదే భవనంలో ముగ్గురి డెడ్ బాడీలను గుర్తించారు. మరణించినవారిలో ఒకరు 26ఏళ్ల యువకుడు కాగా మరో ఇద్దరు 25, 27ఏళ్ల వయసున్న యువతులుగా నిర్ధారించారు. చనిపోయినవారంతా భారతీయులేనని సమాచారం. అయితే గాయపడింది కూడా భారతీయులేనా లేదంటే స్థానికులా అనే వివరాలు ఇంకా తెలియలేదు. ప్రాథమిక విచారణ అనంతరం ఆ భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య చేశాడనే అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి




### మూడేళ్లలో రూ.1,64,431 కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ

- ఈ లెక్కలపై ఎలాంటి చర్చకైనా, సవాల్‌కైనా సిద్ధం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు..
- జిల్లా వనరుల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు
- అచ్చంపేటను ప్రధాన జంక్షన్‌గా తీర్చిదిద్దుతాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

## పంటలు ఎండొద్దు..

### రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయండి

- వచ్చే 20 రోజులు అత్యంత కీలకం..
- విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సహించేది లేదు
- విద్యుత్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం..
- నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరిక

2 లో



### పేదల సామాజిక భద్రతకు

## మరింత భరోసా..

### దివ్యాంగుల సంక్షేమానికి పెరిగిన ఆసరా



- 53,428 కోట్లతో రానున్న ఐదేళ్లపాటు 'ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజన'కు కేంద్ర కేబినెట్ ఆమోదం
- 18 ఏళ్ల కనీస వయోపరిమితి తొలగింపు.. పుట్టినప్పటి నుంచే అర్హులైన దివ్యాంగులకు పెన్షన్
- దివ్యాంగుల కేంద్ర పెన్షన్ సహాయం 25% పెంపు
- పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పట్ల మోదీ ప్రభుత్వ నిబద్ధతకు ఈ సంస్కరణలే నిదర్శనం
- జి.కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

2




# ముక్కోణపు సమరం!

### హామీల అమలు.. ఆర్థిక సవాళ్ల మధ్య అధికార కాంగ్రెస్

### ప్రభుత్వ వైఫల్యాలే అస్త్రంగా బీఆర్ఎస్ పోరుబాట

### ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు బీజేపీ వ్యూహాలు

### స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా మూడు పార్టీల ఎత్తులు పైఎత్తులు

తెలంగాణ రాజకీయాల్లో ముక్కోణపు పోరు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్, కోల్పోయిన పట్టును తిరిగి సాధించేందుకు బీఆర్ఎస్, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు బీజేపీ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి. ఓవైపు పాలనాపరమైన సవాళ్లు, ఎన్నికల హామీల అమలు అధికార కాంగ్రెస్‌కు పరీక్షగా మారగా.. మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యలే ప్రధాన అస్త్రాలుగా మూడు పార్టీలు రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బలాన్ని నిరూపించుకునేందుకు ఎవరికి వారు సన్నద్ధమవుతున్నారు.

- హైదరాబాద్, వెలుతురు

11

## కాప్రా చెరువు అభివృద్ధిలో హైడ్రా

- వలస పక్షులకు ఆవాసంగా మార్చేందుకు చర్యలు
- స్వచ్ఛందంగా చెరువు అభివృద్ధికి భూములిచ్చిన రైతులు

12

## కమిషన్ల కోసమే సింగరేణిని దోచుకుంటున్నారు

- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- వాటాలు తేలకపోవడం వల్లే నైని టెండర్లు రద్దు
- సైట్ విజిట్ సర్టిఫికెట్ పేరుతో రూ.10,000 కోట్ల కుంభకోణం
- సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి

12



# పెట్టుబడులకు పూర్తి భరోసా

- తెలంగాణలో ప్రభుత్వ విధానాలు స్థిరంగా కొనసాగుతాయి.. పెట్టుబడులు సురక్షితం
- రాబోయే రోజుల్లో తయారీ రంగం విస్తరణపై ప్రత్యేక దృష్టి
- తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యానికి బ్రిటన్ ప్రతినిధుల ఆసక్తి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**

తెలంగాణలో పెట్టుబడులకు పూర్తి భద్రత ఉంటుందని, ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కొనసాగుతుందని ముఖ్యమంత్రి శ ఎ. రేవంత్ రెడ్డి బ్రిటన్ వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కొన్నేళ్లలో తయారీ రంగాన్ని భారీగా విస్తరించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని చెప్పారు.

బుధవారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో బ్రిటన్‌లోని యార్క్‌షైర్ ప్రాంతానికి చెందిన మేయర్ల నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్, యార్క్ అండ్ నార్త్ యార్క్‌షైర్ మేయర్ డేవిడ్ స్కైత్, వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ ఈ బృందానికి నాయకత్వం వహించారు.

ఇటీవల భారత్–బ్రిటన్ మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో తెలంగాణతో వాణిజ్యం, పెట్టుబడులు, ఆవిష్కరణలు, విద్య, సాంస్కృతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై ఈ సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో అత్యంత యువ రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అనతికాలంలోనే ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. తెలంగాణ ఇప్పుడు కేవలం దేశంలోని ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోటీ పడుతోందని చెప్పారు.

డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026కు బ్రిటన్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళిక 'తెలంగాణ రైజింగ్--2047' గురించి ముఖ్యమంత్రి వివరించారు. 2025 డిసెంబర్‌లో ఆవిష్కరించిన ఈ విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అంతర్జాతీయ నాయకులు, ప్రముఖ ఆర్థికవేత్తలు, సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తల సూచనలతో ఈ అభివృద్ధి ప్రణాళిక రూపొందిందని తెలిపారు. కృత్రిమ మేధ (AI) విస్తరిస్తున్న నేపథ్యంలో యువతకు ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ప్రముఖ కంపెనీల ప్రత్యక్ష భాగస్వామ్యంతో యువతకు శిక్షణ ఇచ్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను త్వరలో ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. మూసీ నది పునరుజ్జీవం ద్వారా హైదరాబాద్‌లో రివర్‌ఫ్రంట్ ఎకానమీ, నైట్ ఎకానమీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికను వివరించారు.

ఈ సందర్భంగా బ్రిటన్ ప్రతినిధులు తెలంగాణతో అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, వైద్య ఆరోగ్యం, డిజిటల్ టెక్నాలజీ, రక్షణ, ఏరోస్పేస్, టెక్నికల్ టెక్స్‌టైల్స్, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన రంగాల్లో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్యాన్ని ప్రత్యక్ష వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడులు, విద్యా సంస్థల మధ్య సహకారంగా మార్చేందుకు త్వరలో మరోసారి తెలంగాణలో పర్యటించాలని భావిస్తున్నట్లు తెలిపారు.

సౌత్ యార్క్‌షైర్ మేయర్ ఆలివర్ కాపార్డ్ మాట్లాడుతూ, యార్క్‌షైర్ ప్రాంతంలో వివిధ రంగాలకు చెందిన సుమారు 1.50 లక్షల వ్యాపార సంస్థలు ఉన్నాయని తెలిపారు. వెస్ట్ యార్క్‌షైర్ మేయర్ ట్రేసీ బ్రాబిన్ మాట్లాడుతూ, యార్క్‌షైర్, తెలంగాణ మధ్య అనేక సారూప్యతలు ఉన్నాయని, రెండు ప్రాంతాలు సోదర భావంతో కలిసి పనిచేసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

అంతకుముందు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు బ్రిటన్ ప్రతినిధి బృందానికి స్వాగతం పలికారు. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సందర్శించాలని ఆహ్వానించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, క్లీన్ ఎనర్జీ, నాలెడ్జ్ ఆధారిత ఆర్థికాభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించిందని వివరించారు. ఉత్తర ఇంగ్లండ్ ప్రాంతానికి ఉన్న పారిశ్రామిక, సాంకేతిక సామర్థ్యాలతో తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలకు మంచి అనుసంధానం ఉందన్నారు.

ఇటీవల ముఖ్యమంత్రి నేతృత్వంలోని బృందం బ్రిటన్‌లో పర్యటించి ప్రముఖ విశ్వవిద్యాలయాలు, వ్యాపార సంస్థలతో భాగస్వామ్యాలు కుదుర్చుకున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలకు తెలంగాణ కేంద్రంగా ఎదిగే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి UK-India CETA & Regional Synergies పేరుతో యూకే–ఇండియా బిజినెస్ కౌన్సిల్ (UKIBC) రూపొందించిన నివేదికను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో యూకే–ఇండియా బిజినెస్ కౌన్సిల్ సీఈవో కిషోర్ జయరామన్, హైదరాబాద్ బ్రిటిష్ డిప్యూటీ హైకమిషన్ ప్రతినిధులు, కె. రామ కృష్ణారావు,ముఖ్యమంత్రి సలహాదారు సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పేదల సామాజిక భద్రతకు
# మరింత భరోసా..

- దివ్యాంగుల సంక్షేమానికి పెరిగిన ఆసరా
- జి.కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**



దేశంలోని పేద కుటుంబాలకు సామాజిక భద్రత కల్పించేందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (చీూఖూా) కార్యక్రమాన్ని పునర్వ్యవస్థీకరించి, 'ప్రధానమంత్రి సామాజిక సహాయత యోజన'గా 2026-27 నుంచి 2030-31 వరకు ఐదేళ్లపాటు రూ.53,428 కోట్ల వ్యయంతో కొనసాగించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాను. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు చెందిన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఈ పథకం అండగా నిలుస్తుంది. ముఖ్యంగా దివ్యాంగుల పెన్షన్ అర్హతలను సడలించడం, సహాయ మొత్తాన్ని పెంచడం, మరింతమందిని పథకం పరిధిలోకి తీసుకురావడం.. సామాజిక భద్రతను విస్తరించే దిశగా మోదీ ప్రభుత్వం తీసుకున్న కీలకమైన నిర్ణయం. దీంతో ప్రస్తుతం 3 కోట్లున్న వివిధ సామాజిక పథకాల లబ్ధిదారుల సంఖ్య.. ఇప్పుడు 3.2 కోట్ల మంది లబ్ధిదారులకు పెరగనుంది. ఇది కాకుండా.. నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ (NSAP) పేరును 'ప్రధానమంత్రి సామాజిక్ సహాయతా యోజన'గా.. జాతీయ వృద్ధాప్య పింఛన్ పథకాన్ని 'ప్రధానమంత్రి విధవస్త పెన్షన్ యోజన'గా.. జాతీయ వితంతు పెన్షన్ పథకాన్ని 'ప్రధానమంత్రి విధవా పెన్షన్ యోజన'గా, జాతీయ దివ్యాంగుల పెన్షన్ పథకాన్ని.. 'ప్రధానమంత్రి దివ్యాంగ్‌జన్ పెన్షన్ యోజన'గా జాతీయ కుటుంబ సహాయ పథకం (NFBS)ను 'ప్రధానమంత్రి పరివార్ లాభ్ యోజన'గా మార్చడంపైనా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

### దివ్యాంగులకు పెన్షన్‌లో భారీ సంస్కరణ

దివ్యాంగుల హక్కుల చట్టం–2016కు అనుగుణంగా పెన్షన్ అర్హతలను విస్తరించడం సంతోషకరం. ఇప్పటివరకు కనీసం 80% వైకల్యం ఉన్నవారికి వర్తించిన పెన్షన్‌ను, ఇకపై 40% లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారికి కూడా వర్తించేలా మార్పులు జరిగాయి. దీంతోపాటుగా.. దివ్యాంగుల పెన్షన్ 25% పెంచడం శుభపరిణామం.

వైకల్యంతో పుట్టిన చిన్నారి సంరక్షణ బాధ్యత మొదటి రోజు నుంచే కుటుంబంపై ఉంటుంది. అందుకే పెన్షన్ కోసం 18 ఏళ్లు వచ్చే వరకు వేచి ఉండాల్సిన నిబంధనను తొలగించాం. చిన్నారికి 18 ఏళ్లు వచ్చే వరకు ఈ సహాయాన్ని తల్లిదండ్రుల ద్వారా అందుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా.. ప్రస్తుతం 8.33గా ఉన్న దివ్యాంగుల పెన్షన్ లబ్ధిదారుల సంఖ్య 27.48 లక్షలకు పెరగనుంది. (దాదాపు 3.3 రెట్లు). దీనివల్ల ప్రస్తుతం రూ.290 కోట్ల వార్షిక వ్యయం అవుతుండగా.. ఇకపై ఇది రూ.1,268 కోట్లకు పెరగనుంది. తెలంగాణలోనూ ప్రస్తుతం కేంద్రప్రభుత్వ సామాజిక భద్రత పథకాల లబ్ధిదారుల సంఖ్య 7.28 లక్షలు కాగా.. తాజా మార్పులతో ఇది మరింతగా పెరగనుంది.

# పంటలు ఎండొద్దు..
## రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయండి

- వచ్చే 20 రోజులు అత్యంత కీలకం..
- విద్యుత్ సరఫరాలో అంతరాయాలను సహించేది లేదు
- విద్యుత్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం..
- నిర్లక్ష్యం చేస్తే ఐఏఎస్‌లను సస్పెండ్ చేస్తామని హెచ్చరిక

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:**

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల పంటలు ఎండిపోకుండా రేయింబవళ్లు విద్యుత్ సరఫరా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంటలు చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వచ్చే 20 రోజులు పంటలకు అత్యంత కీలకమని, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యుత్ కొరత కారణంగా రైతులు పంట నష్టపోకూడదని హెచ్చరించారు. వ్యవసాయానికి విద్యుత్ అవసరం ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సరఫరా పెంచాలని సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరాపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలవారీగా ప్రస్తుత పరిస్థితులను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేలా చూడాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు ఎందుకు రావడం లేదని అధికారులను నిలదీశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నప్పటికీ ఉత్పత్తిని పెంచేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నైనీ, మహానది నుంచి బొగ్గు సరఫరాకు లింకేజీ ఏర్పాట్లు చేసినా యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ఆరా తీశారు. అవసరమైతే విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్, జెన్‌కో సీఎండీ.. సంబంధిత విభాగపు ఐఏఎస్ లను సస్పెండ్ చేస్తానని మండిపడ్డారు. విద్యుత్ అంతరాయాలకు రోజుకో కారణం చెప్పవద్దని హెచ్చరించారు.

### ఎల్‌నినో కోవిడ్ లాంటి విపత్తు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కోవిడ్ తరహా విపత్తుగా పరిగణించి అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పుడు సాధారణ సమస్యగా కనిపిస్తున్న పరిస్థితులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే తీవ్ర సంక్షోభంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

### తాగునీరు, పశుగ్రాసానికి ఇబ్బందులు రాకుండా చర్యలు

వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తాగునీటి సరఫరా సజావుగా సాగేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణ రంగంతో పాటు ఇతర అవసరాలకు మురుగునీటి శుద్ధి కేంద్రాల్లో (ఎస్టీపీలు) శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో పశువులు ఇబ్బంది పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

### ప్రతి మండలానికి ప్రత్యేక పర్యవేక్షణ అధికారులు

ఎల్‌నినో ప్రభావాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ప్రతి మండలానికి గ్రూప్–1, గ్రూప్–2 స్థాయి అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా మండలాల్లో వర్షాభావ పరిస్థితులు, విద్యుత్, తాగునీటి సరఫరా, పంటలు, పశుగ్రాసం వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించే బాధ్యతలను వారికి అప్పగించాలని సూచించారు.

# చైనా, జపాన్‌తోనే పోటీ

మొదటిపేజీ తరువాయి:

ఇండివిద్యువల్ కంటే కమ్యూనిటీనే మనకు పెద్ద స్ట్రెంగ్త్ అవుతుందని, కమ్యూనిటీకే రాజకీయాలు ముడిపడి ఉంటాయని వివరించారు. తమకు అమరావతి తోనో లేదా ఇతర రాష్ట్రాలతోనో పోటీ లేదని, తాము నేరుగా చైనా, జపాన్ వంటి దేశాలతో పోటీ పడుతున్నామని ప్రకటించారు. మన్మోహన్ సింగ్ తెచ్చిన ఆర్థిక విధానాలతోనే దేశంలో పారిశ్రామిక అభివృద్ధి సాధ్యమైందని, మన వాళ్లు కంపెనీలకు యజమానులు అయినప్పుడే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఆకాంక్షించారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉన్న కంపెనీలు, దేశాలే ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్నాయని, అందుకే తెలంగాణలో మహిళలను విశేషంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. వారిని కేవలం ఆర్టీసీ ప్రయాణానికే పరిమితం చేయకుండా బస్సులకే యజమానులను చేశామని, పెట్రోల్ బంక్‌లు, విద్యుత్ ప్లాంట్‌లు కూడా ఇస్తున్నామని వెల్లడించారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి పాలసీ పెరాలసిస్ లేదని, పారిశ్రామిక వేత్తలకు ఉపయోగపడే విధానాలను తాము మార్చడం లేదని, పెట్టుబడులకు పూర్తి భరోసా ఇస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### తెలంగాణను మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నాం

2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ అని మూడు భాగాలుగా విభజించి అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఉద్ఘాటించారు. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని క్యూర్ – (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఇక్కడ ఐటీ, సేవా రంగాలు, అత్యాధునిక టెక్నాలజీ, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని ప్యూర్ (పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ)గా అభివృద్ధి చేసుకుంటున్నామని వివరించారు.

# సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి

- మూడేళ్లలో రూ.1,64,431 కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ
- ఈ లెక్కలపై ఎలాంటి చర్చకైనా, సవాల్‌కైనా సిద్ధం
- రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు..
- జిల్లా వనరుల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు
- అచ్చంపేటను ప్రధాన జంక్షన్‌గా తీర్చిదిద్దుతాం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**అచ్చంపేట, వెలుతురు:**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందని కుటుంబం లేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గత మూడేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.1,64,431కోట్లను నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేశామని వెల్లడించారు. ఈ లెక్కలపై ఎవరితోనైనా చర్చించేందుకు, ఎలాంటి సవాల్‌నైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రతి రూపాయిని వారి అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

అచ్చంపేట నియోజకవర్గంలో 74.82 కోట్ల వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మన్ననూరులో 220/33 కెవి సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం పక్కనే ఏర్పాటుచేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని, జిల్లాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులు, నదులు, ఖనిజ సంపద, మానవ వనరుల ఆధారంగా ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగుతామని చెప్పారు. అచ్చంపేట ప్రాంతాన్ని ప్రధాన రవాణా కూడలిగా అభివృద్ధి చేయడంతోపాటు, పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు.

### ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉండగా, కోటి ఆరు లక్షల కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనాలు అందుతున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. పేదల ఆహార భద్రతకు ప్రాధాన్యమిస్తూ ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో సన్నబియ్యం ధర రూ.60 నుంచి రూ.70 వరకు ఉన్నప్పటికీ, పేదలకు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. దాదాపు కోటి ఆరు లక్షల కుటుంబాలకు రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని చెప్పారు. 43 లక్షల కుటుంబాలకు చేయూత పింఛన్లు అందిస్తున్నామని, 71.40 లక్షల మంది రైతులకు రైతు భరోసా కింద ఎకరానికి ప్రతి సీజన్‌లో రూ.6 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని వివరించారు.

రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని తెలిపారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాల ద్వారా అర్హులైన ప్రజలకు ప్రయోజనాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సుమారు 76 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించామని చెప్పారు. ఏడు లక్షల మంది పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో, నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా ప్రతి కుటుంబానికీ వర్తించేలా ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని వెల్లడించారు.

### రహదారులకు రూ.90 వేల కోట్లు

తెలంగాణను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో భారీగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి రూ.90 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, క్లస్టర్ డెవలప్‌మెంట్ వంటి ప్రాజెక్టులపై దృష్టి సారించామని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి, వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు.

### అచ్చంపేట అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

అచ్చంపేట నియోజకవర్గంతో తనకు 1980 నుంచి విడదీయలేని అనుబంధం ఉందని భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. తన సోదరుడు స్వర్గీయ మల్లు అనంతరాములు ఈ ప్రాంతం నుంచి పార్లమెంటుకు పోటీ చేసిన రోజుల నుంచి ఇక్కడి గ్రామాలతో తనకు పరిచయం ఉందని చెప్పారు. విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పర్యటించానని, ప్రజల సమస్యలను దగ్గరగా చూశానని తెలిపారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు ప్రధానంగా విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం విద్యుత్ శాఖ తన వద్ద ఉండటంతో సమస్యల పరి ష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఇప్పటికే 1,219 కొత్త డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 403 కిలోమీటర్ల మేర కొత్త విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేశామని, 5 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని వివరించారు.

### ఎకో టూరిజంతో స్థానికులకు ఉపాధి

అచ్చంపేట ప్రాంతంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్లు, కృష్ణానదిపై వంతెనలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందుతున్నాయని తెలిపారు. వీటి ద్వారా అచ్చంపేటను ప్రధాన రవాణా కూడలిగా తీర్చిదిద్దే అవకాశం ఉందన్నారు.

మన్ననూరు, నల్లమల అటవీ ప్రాంతాలకు ఉన్న సహజ సౌందర్యం, వన్యప్రాణుల సంపదను పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు. ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక గిరిజన కుటుంబాలు, రైతులు, నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. పర్యాటకులు ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు స్థానికంగా వసతి, ఆతిథ్యం,రవాణా, ఇతర సేవల ద్వారా కుటుంబాలకు ఆదాయం లభిస్తుందని పేర్కొన్నారు.

### ప్రజల సమస్యలే ప్రభుత్వ ప్రాధాన్యాలు

గతంలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో పర్యటించిన రోజులను భట్టి విక్రమార్క గుర్తు చేసుకున్నారు. 2023 మే 31న లింగాల మండలం అంబటపల్లి నుంచి ప్రారంభమైన పాదయాత్రలో భాగంగా నియోజకవర్గంలోని సుమారు 42 గ్రామాల్లో 130 కిలోమీటర్ల మేర నడిచామని తెలిపారు.



# మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రజాపాలన

- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్
- గాంధీ భవన్‌లో బతుకమ్మ సంబరాలు

**హైదరాబాద్, (గాంధీభవన్)వెలుతురు:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన సతీమణితో కలిసి పాల్గొన్నారు. బతుకమ్మ పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. పెద్దలు ఆశీర్వదిస్తూ అందించే 'బతుకు అమ్మా' అనే దీవెనలోనే బతుకమ్మ పండుగ గొప్పతనం ఇమిడి ఉందని అన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటిచెబుతుందని తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజాపాలన సాగిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి, ఆర్థిక స్వావలంబన, సామాజిక సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల సంక్షేమం, అభివృద్ధి కేంద్రంగా ప్రభుత్వ విధానాలు కొనసాగుతున్నాయని అన్నారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, తెలంగాణ ప్రజలందరికీ సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గాంధీ భవన్ లో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. మహిళలు బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తూ సంబరాల్లో పాల్గొన్నారు.

## పండుగల సాయన్న ఆశయాలను

# ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

- కులాలకు అతీతంగా పేదల కోసం పోరాడిన గొప్ప ప్రజానాయకుడు పండుగల సాయన్న
- మహనీయుల విగ్రహాలకు దండలు వేయడమే కాదు.. వారి ఆశయాలను ఆచరించాలి
- ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా బీసీ-డీ వర్గీకరణ కోసం కృషి చేస్తాం
- తెలంగాణలో కులగణన సామాజిక న్యాయం దిశగా కీలక అడుగు
- పండుగల సాయన్న విగ్రహావిష్కరణ సభలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి





**మహబూబ్‌నగర్, వెలుతురు అక్టోబర్ 14:** తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. నవాబ్ పేట మండల కేంద్రంలో పండుగల సాయన్న విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ. ...పండుగల సాయన్న ఒక కులానికో, ఒక వర్గానికో పరిమితమైన నాయకుడు కాదని, సమాజంలోని పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని పేర్కొన్నారు. పేదల ఆకలి బాధలను అర్థం చేసుకొని, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడమే పండుగల సాయన్న గొప్పతనమని తెలిపారు. ఎవరి కులం ఏమిటి, ఏ వర్గానికి చెందినవారు అనే తేడాలు చూడకుండా, అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ సహాయం చేసిన మహనీయుడని కొనియా డారు. పండుగల సాయన్న వంటి ప్రజానాయ కులను ఒక కులానికే పరిమితం చేయడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ వంటి పోరాట యోధులు కూడా సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడారని గుర్తుచేశారు. వీరందరి జీవితాలు సమాజంలోని అణగారిన వర్గాలకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి, జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం తోనే మన బాధ్యత పూర్తికాదని మంత్రి అన్నారు. వారు చూపిన మార్గంలో నడుస్తూ, వారి ధైర్యాన్ని, సేవా భావాన్ని, సమానత్వ స్ఫూర్తిని మన జీవితాల్లో ఆచరించినప్పుడే విగ్రహాల ఏర్పాటుకు నిజమైన అర్థం ఉంటుందని పేర్కొన్నారు. నిజాం పాలనలో పేదల పక్షాన నిలబడి, అన్యాయాన్ని ఎదిరించిన పండుగల సాయన్న స్ఫూర్తిని యువత అలవర్చుకో వాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించే ధైర్యం కలిగి ఉండాలని, పేదలు, నిరుపేదలు, అణగారిన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. మనిషి జీవి తంలో సమాజానికి ఎంత మేలు చేశామన్నదే ముఖ్యమని, మనం జీవించినంత కాలం ఇతరులకు ఉపయోగపడేలా పనిచేయాలని హితవు పలికారు. పండుగల సాయన్నకు నివాళు లర్పించడమంటే ఆ యన చూపిన మార్గంలో నడుస్తూ పేదల సంక్షేమం కోసం కృషి చేయడమేనని స్పష్టం చేశారు.

**ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా బీసీ-డీ వర్గీకరణ కోసం కృషి చేస్తాం**

ముదిరాజ్ సమాజానికి న్యాయం జరిగేలా, వారి చిరకాల ఆకాంక్ష అయిన బీసీ-డీ వర్గీకరణ అంశంపై కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. ముదిరాజ్ సమాజానికి న్యాయం జరగడంతో పాటు, ఇప్పటికే బీసీ-డీ వర్గంలో ఉన్న ఇతర కులాల హక్కులు, సంక్షేమ ప్రయోజనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంద న్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని పేర్కొ న్నారు. పండుగల సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన పెద్దలకు, నిర్వాహకులకు, నవాబుపేట మండలంలోని ముదిరాజ్ సంఘాలకు, సహకార సంఘాల ప్రతినిధులకు మంత్రి వాకిటి శ్రీహరి హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## పెట్రో ఉత్పత్తుల కొరత

# తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రానికి ఎంపీ వద్దిరాజు సూచన
- పండుగల వేళ వంటగ్యాస్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 14 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న అనిశ్చిత పరిస్థితుల దృష్ట్యా దేశంలో క్రూడాయిల్, వంటగ్యాస్ ఉత్ప త్తులకు కొరత తలెత్తకుండా తగు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం పార్లమెంట్ ప్రాంగణంలోని అనెక్స్ హాలులో బుధవారం సమావేశమైంది. సంఘం ఛైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంపీ రవిచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశ్చిమాసియాలో కొనసాగుతు న్న ఆందోళకర, ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా పెట్రోలియం, డీజిల్, వంటగ్యాస్ సరఫరాలకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి సలహాలిచ్చారు. విజయదశమి, దీపావళి పండుగలు సమీపిస్తున్నం దున వంటగ్యాస్ కొరత చోటుచేసుకోకుండా విని యోగదారులకు సత్వరమే సేవలందించాల్సిందిగా ఎంపీ రవిచంద్ర కోరారు. వృధాలు, వ్యర్థాలను పూర్తిగా అరికట్టాల్సిందిగా, అగ్ని ప్రమాదాలు సంభవించ కుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవా ల్సిందిగా అధికారులకు ఎంపీ రవిచంద్ర పలు సూచనలు చేశారు, సలహాలిచ్చారు. సంఘం ఛైర్మన్‌గా తిరిగి నియమితులైన సునీల్ దత్తాత్రే తర్కరే కు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, చమురు సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌ను విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

**సైబరాబాద్, వెలుతురు అక్టోబర్ 14 :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధి మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఎండిఎంఏ డ్రగ్‌ను విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను మాదాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మాదాపూర్ ఎస్హెచ్ఓ వెల్లడించిన వివరాలు ప్రకారం... బుధవారం మధ్యాహ్నం సుమారు 3 గంటలకు మాదాపూర్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ పిఎస్ పరిధి సిద్ధి వినాయక నగర్‌లోని రాజ్ టవర్స్ సమీపంలో మనకు ద్రవ్యాలను విక్రయిస్తున్నారన్న సమాచారం అందింది. దీంతో పక్కా ప్రాణాలకు అను సిద్ధం చేసుకున్న పోలీసులు ఆకస్మికంగా దాడిని నిర్వహించి ఎండిఎంఏ డ్రగ్‌ను విక్రయిస్తున్న మరియు కొనుగోలు చేస్తున్న వినియోగదారులపై సోదాలు నిర్వహించడంతోపాటు ఘటనకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సర్కిల్ ఇన్స్పెక్టర్ వివరించారు. కాగా ఆయన తెలిపిన నిందితుల వివరాల ప్రకారం... బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన కట్ల మాధవ్ అలియాస్ టోనీ(25), మాదాపూర్ ప్రాంతానికి చెందిన డ్రగ్ పెడలర్ నామాల సిద్ధార్థ్(25) మరియు బంజర హిల్స్ ప్రాంతానికే చెందిన డ్రగ్ వినియోగదారుడైన ఎరుగు లోకేష్(26) ను అదుపులోకి తీసుకొని సోదాలు నిర్వహించగా వారి వద్దనుండి 1 గ్రాము ఎండిఎంఏ డ్రగ్స్‌ను 6 వేల రూపాయలకు కొనుగోలుచేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చి,ఏ2 సిద్ధార్థ్‌కు 10 వేల రూపాయలకు విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో నిందితుడు అంగీకరించినట్లు సిఐ తెలియజేశారు. కాగా ఈ డ్రగ్స్ సరఫరా వ్యవహారం సిద్ధార్థ్ ద్వారా లోకేష్‌తో పాటు ఇతరులకు డ్రగ్స్ సరఫరా జరుగుతున్నట్లు అనుమానిస్తున్నామన్నారు. డ్రగ్ తోపాటు వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మీడియాకు తెలిపారు.

దీంతో ముగ్గురు వ్యక్తులపై క్రైమ్ నెంబర్ 1605/2026 ను ఎన్డిపిఎస్ చట్టం ప్రకారం నమోదుచేసి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచామని, డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఇతర వ్యక్తులను గుర్తించేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సీఐ వెల్లడించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు మరియు సరఫరాకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని మాదాపూర్ పోలీసులు సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.

# గ్లోబల్ రైజింగ్ సమ్మిట్‌కు తరలిరండి

- 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వాములు కండి
- 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ -2026'లో మంత్రి శ్రీధర్ బాబు





**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:** 'తెలంగాణ రైజింగ్ – 2047' విజన్‌కు అనుగుణంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రాష్ట్ర ప్రభుత్వం అత్యం త ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2026'లో పాల్గొనాలని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... 'రైజింగ్ తెలంగాణ' లక్ష్య సాధనలో భాగస్వామ్యం కావాలని ఆహ్వానించారు. సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ -- 2026'కు ఆయన గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, నూతన పరిశ్రమలకు ప్రోత్సాహం, వ్యాపారాలకు అనుకూల వాతావరణం కల్పించడంపై దృష్టి సారించామన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో తెలం గాణ మరింత కీలక పాత్ర పోషించేలా పరిశ్రమలు, నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలకు ప్రాధాన్యమిస్తు న్నామన్నారు. హైదరాబాద్‌లో ఐటీ, సాంకేతిక రంగా లను మరింత అభివృద్ధి చేయడంతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ తయారీ రంగం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ఏర్పాటును ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్‌తో పాటు ఏఐ, ఏరోస్పేస్, రక్షణ రంగం, అధునాతన తయారీ లాంటి రంగాలకు ప్రాధాన్యమిస్తున్నామ న్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు, పరిశ్రమ లను విస్తరించేందుకు తెలంగాణ గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ ను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు కోరారు.

## కేటీఆర్ చీకటి బాగోతాలు

# వరుసగా బయటపెడుతూనే ఉంటా

- కంపెనీలను బెదిరించి దండుకుంటున్నారని బల్మూర్ వెంకట్ ఆరోపణ
- డెక్కన్ సరాయ్ హోటల్ రోజువారీ ఆదాయం రూ.75 లక్షలు ఎలా వస్తోంది?
- ఆరోపణలపై ఎక్కడైనా చర్చకు సిద్ధం.. దమ్ముంటే సమాధానం చెప్పాలి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14 :** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేటీఆర్ ఓ వసూల్ రాజా అని, బహుళజాతి కంపెనీలను బెదిరించి దండుకుంటున్నారని ఆరోపించారు. కేటీఆర్ నయా దందా, చీకటి బాగోతాలను వరు సగా బయటపెడుతూనే ఉంటానని స్పష్టం చేశారు. తాను చేసిన ఆరోపణలపై ఇప్పటివరకు కేటీఆర్ ప్రజలకు సమాధానం చెప్పలేదని విమర్శించారు. కేటీఆర్ మరో చీకటి కోణాన్ని బయటపెడుతు న్నానని, తదుపరి సిరిసిల్ల బాగోతాన్ని వెల్లడిస్తానని ప్రకటించారు. తాను బయటపెట్టే విషయాలతో కేటీఆర్‌కు తలనొప్పి వస్తుందని, అందుకే ఆయనకు జండూబామ్ పంపిస్తు న్నానని ఎద్దేవా చేశారు. కేటీఆర్ తనను విమర్శించినా, విమర్శించకపోయినా ఆయన వ్యవహారాలను బయటపెడుతూనే ఉంటాన న్నారు.

**కేటీఆర్ నయా దందా ఇదే..**

కేటీఆర్ బృందం కంపెనీలను లక్ష్యంగా చేసుకుని వసూళ్ల దందాకు పాల్పడుతోందని బల్మూర్ వెంకట్ ఆరోపించారు. ఉదయం 11 గంటలకు ఓ బృందం ట్వీట్ చేస్తుందని, మధ్యాహ్నం 12 గంటలకు మరో బృందం విలేకరుల సమావేశం నిర్వహిస్తుందని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వారికి సంబంధించిన సామాజిక మాధ్యమాల బృందం సదరు సంస్థ వద్ద హడావుడి చేస్తుందని ఆరోపించారు. రాత్రి 7 గంటలకు కేటీఆర్ ప్రధాన బృందంలోని సభ్యులు ఆ సంస్థ యజమానులతో చర్చలు జరుపుతారని పేర్కొన్నారు. అప్పటికీ వ్యవహారం పరిష్కారం కాకపోతే రాత్రి 8 గంటలకు నార్సింగిలో కేటీఆర్ నివసిస్తున్న విలాసవంతమైన భవంతిలో కంపెనీ యజమానులతో చర్చించి సెటిల్‌మెంట్ చేసుకుంటారని ఆరోపించారు. ఇదే కేటీఆర్ నయా దందా అని విమర్శించారు.

**రూ.5 కోట్ల నుంచి రూ.175 కోట్లకు ఎలా పెరిగింది?**

డెక్కన్ సరాయ్ హోటల్ ఆదాయం భారీగా ఎలా పెరిగిందో తనకు ఇప్పటికీ అర్థం కావడం లేదని బల్మూర్ వెంకట్ అన్నారు. రూ.5 కోట్ల వాటా విలువ ఉన్న హోటల్ పదేళ్లలో రూ.175 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. దీనిపై తాను ఆరా తీయగా విస్తుపోయే విషయాలు బయటకు వచ్చాయని పేర్కొన్నారు. కేటీఆర్ హోటల్‌కు ఒక్కరోజు ఆదాయమే రూ.75 లక్షలని ఆరోపించారు. ఐటీ మంత్రిగా, షాడో ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో బహుళజాతి కంపెనీలను బెదిరించి, తన హోటల్ నుంచే ఆయా సంస్థలకు ఆహారం సరఫరా చేయడంతోపాటు విందులు, సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేలా ఒప్పందాలు చేయించుకున్నమాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయా లేదా అని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు బహుళజాతి కంపెనీలను బెదిరించి కేటీఆర్ కొత్త తరహా దందాకు తెరలేపారని ఆరోపించారు.

**ఆరోపణలపై సమాధానం చెప్పాలి....**

డ్రగ్స్‌కు సంబంధించిన ఆధారాలు బయటపడకుండా ఉండేందుకే కేటీఆర్ హెయిర్ ట్రీట్‌మెంట్ చేయించుకు న్నారని తాను గతంలో ఆరోపించిన విషయాన్ని బల్మూర్ వెంకట్ ప్రస్తావించారు. తాను విలేకరుల సమావేశం నిర్వహించిన మూడు గంటల తర్వాత కేటీఆర్ వంటగదిలో ఉన్న ఫొటోను విడుదల చేశారని, ఆ ఫొటోలోనూ ఆయన ముఖం వాపు వచ్చినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. తాను కేటీఆర్ వ్యక్తిగత విషయాలు అడగడం లేదన్నారు. కాయ కచోరి తనకు కాదని, కేటీఆర్‌కే అవసరమని, ఆయనకే పంపించాలని ఎద్దేవా చేశారు. కేటీఆర్ బంధువు సంకేత్ ఇంట్లో ఏం చేస్తారో, బయట ఏం చేశారో తనకు తెలుసని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సామాజిక మాధ్యమాల ద్వారా తనపై తప్పుడు వార్తలను ఎలా ప్రచారం చేస్తున్నారో కూడా తెలుసన్నారు. కేటీఆర్, ఆయన బృందం చేస్తున్న వసూళ్ల దందా, చీకటి వ్యవహారాలను బయటపెడు తూనే ఉంటానని స్పష్టం చేశారు. తదుపరి కేటీఆర్ సిరిసిల్ల చీకటి బాగోతాన్ని వెల్లడిస్తానన్నారు. తాను చేసిన ఆరోపణలపై ఎక్కడైనా చర్చకు సిద్ధమని, దమ్ముంటే కేటీఆర్ వాటిపై స్పందించి ప్రజలకు సమాధానం చెప్పాలని బల్మూర్ వెంకట్ సవాల్ విసిరారు.

# సంగారెడ్డి అభివృద్ధికి మరో ముందడుగు

- 31, 11వ వార్డుల్లో రూ.80 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 14 :** సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 31వ, 11వ వార్డుల్లో సుమారు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ ప్రారంభించారు. ముఖ్య అతిథి నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణంలోని అన్ని వార్డులు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని అన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పను లు చేపడుతున్నామని, ప్రజల అవసరాలను గుర్తించి పనిచేస్తున్న మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్‌తో పాటు పాలకవర్గాన్ని అభినందించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ, సంగారెడ్డి పట్టణంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు సతీశ్ రెడ్డి, దశరథ్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, నాయకులు కూన సంతోష్, తులసిరామ్, శ్రీశైలం, అన్వర్, రామ చందర్ గౌడ్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎండుతున్నపొలం - రైతన్నలగోస



వర్షాలు లేవు, చెరువులు ఎండె,
రైతన్న గుండె నీరై ఇంకె!

పేదోడి కూడు కరువాయె,
బిందెడు నీళ్ళకు పరుగాయె!

ఇలాంటి వేళ ఏం చేయాలి?
ఒకరికొకరు అండగా నిలవాలి!

కన్నీరు తుడిచే చేయి కావాలి,
కరువును తరిమే దారి చూడాలి!

కానీ రోడ్డు మీద చూడు,
నినాదాలు, బ్యానర్లు, హోరు!

ఆగిపోయే రైళ్ళ పరుగులు , ఖాళీ అయ్యే
ప్రభుత్వ ఖజానా,
మండే ఎండకు తోడు,
మనమే మంట పెడుతున్నామా?

ధర్నాల వల్ల పొలం తడవదు,
దీక్షల వల్ల కడుపు నిండదు!

రోడ్డు ఆపితే బస్సు ఆగుతుంది,
బస్సు ఆగితే పేదోడి పని ఆగుతుంది!

మధ్య తరగతి మనిషికి మరో దెబ్బ,
రోజు కూలీకి కూడు లేని శాపం!

మీ పలుకుబడి కి , మీ పంతానికి,
బలి ఎప్పుడూ సామాన్యుడేనా?

కోర్టులు ఉన్నాయి న్యాయానికి,
చట్టాలు ఉన్నాయి తీర్పుకి!

రోడ్డు మీద రచ్చ ఎందుకు?

రైతు కన్నీళ్లు, పేదల గుబులు మిగలినికా!

వద్దు ఈ మంటలాట,
కావాలి నీటి చెలిమెలాట!

చెయ్యి చెయ్యి కలుపుదాం,
కరువును మనమే తరిమేద్దాం!

యుద్ధాలు ఆపుదాం , చెలిమి చేద్దాం !

సామరస్య జీవనం సాగిద్దాం , జన జీవనమై
బ్రతుకుదాం !!

**రచన**
**నాగేందర్ లావుడి**
**నర్సింగ్ ఆఫీసర్(పబ్లిక్ అడ్మినిస్ట్రేటర్),**
**ఫాక్ట్ అనలైజర్**
**9949469679**

# భారత ఆర్థిక పునాది... గ్రామీణ మహిళల కృషి

- సహనానికి ప్రతీక సాధికారతకు చిహ్నం
- అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం అక్టోబర్ 15

**ప్రతి సంవత్సరం అక్టోబర్ 15వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రపంచ ఆహార భద్రత, పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ ఆర్థికాభివృద్ధి వంటి రంగాలలో గ్రామీణ మహిళలు పోషిస్తున్న కీలకమైన పాత్రను గుర్తించి వారికి గౌరవం తెలపడం. గ్రామీణ మహిళలు ప్రపంచ సమాజం నిర్మాణానికి కనిపించని స్థంభాలు. వారి కష్టపడి చేసిన శ్రమ, సహన శక్తి, అంకితభావం వల్లే అనేక కుటుంబాలు, సమాజాలు, దేశాల ఆర్థిక వ్యవస్థలు బలపడుతున్నాయి. ఈ దినోత్సవ ఆలోచన 1995లో బీజింగ్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి నాల్గవ మహిళా సమ్మేళనంలో పుట్టింది. అక్కడ గ్రామీణ మహిళల శ్రమకు తగిన గుర్తింపు లభించడం లేదని, వారిపై సామాజిక--ఆర్థిక వివక్ష కొనసాగుతోందని గమనించిన పౌర సమాజ సంస్థలు "గ్రామీణ మహిళల కోసం ప్రత్యేక దినోత్సవం" ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాయి. ఆ ఆలోచనను ఐక్యరాజ్య సమితి సమర్థించి, 2007 డిసెంబర్ 18న తీర్మానం 62/136 ద్వారా అక్టోబర్ 15ను అధికారికంగా "అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం"గా ప్రకటించింది.**



2008 నుండి ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం జరుపు కుంటున్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 22 శాతం గ్రామీణ మహిళలే. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వ్యవసాయ రంగంలో పనిచేస్తున్న శ్రామిక శక్తిలో సుమారు 40 శాతం మహిళలే ఉన్నారు. యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఫీూూ) అంచనాల ప్రకారం ప్రపంచ ఆహార ఉత్పత్తిలో మహిళల వాటా సుమారు 43 శాతం. వారు విత్తనం వేసే దశ నుంచి పంటను మార్కెట్‌కు చేరవేసే వరకు ప్రతి దశలోనూ కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. భారతదేశ పరిస్థితిని పరిశీలిస్తే, గ్రామీణ మహిళల జీవన గాథ అనేది శ్రమ, సహనము, అంకిత భావము యొక్క ప్రతిరూపం. దేశ జనాభాలో సగానికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నవారు, వారిలో సుమారు 80 శాతం మహిళలు వ్యవసాయం, పశుపోషణ, గృహ పరిశ్రమలు, కూలి పనుల్లో నిమగ్నమై ఉన్నారు. భారత వ్యవసాయ రంగంలో మహిళల ప్రత్యక్ష శ్రామిక భాగస్వామ్యం 65 నుంచి 70 శాతం వరకు ఉంటుందని అంచనా. అయినప్పటికీ భూమి యాజమాన్యం విషయంలో మహిళల హక్కులు చాలా తక్కువ. దేశవ్యాప్తంగా రైతు కుటుంబాల్లో భూమి యాజమాన్యం ఉన్న మహిళల శాతం కేవలం 13 శాతం మాత్రమే. అంటే, భూమిపై శ్రమించే మహిళకు యాజమాన్య హక్కు లేకపోవడం, ఆమె సామాజిక--ఆర్థిక స్థితిని బలహీన పరుస్తోంది. 1990ల చివర్లో ప్రారంభమైన స్వయం సహాయక బృందాల ఉద్యమం గ్రామీణ మహిళల జీవితంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రారంభమైన ఐఔజ=ూ పథకం ఆధారంగా ఏర్పడిన ఈ బృందాలు దేశ వ్యాప్తంగా మహిళల సాధికారతకు దారి తీశాయి. ప్రస్తుతం నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ (2024) గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా 80 లక్షలకు పైగా స్వయం సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. వీటిలో 1.2 కోట్లకు పైగా మహిళలు సభ్యులుగా ఉన్నారు. ఈ బృందాల ద్వారా 14 కోట్లకు పైగా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రతి బృందం సగటున రూ. 1.5 లక్షల వరకు లావాదేవీలు నిర్వహిస్తోంది. ఈ బృందాల ద్వారా మహిళల్లో పొదుపు, ఆర్థిక అవగాహన, చిన్న వ్యాపార నిర్వహణా నైపుణ్యాలు, సమూహ శక్తి పెంపొందాయి. ఈ స్వయం సహాయక బృందాలు గ్రామీణ మహిళల జీవితానికి కొత్త దిశను చూపిన సామాజిక ఆర్థిక విప్లవం అని చెప్పవచ్చు. అయినప్పటికీ గ్రామీణ మహిళల ఎదుగుదల ఇంకా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. భూమి యాజమాన్యం లోపం, తక్కువ వేతనాలు, విద్యా--ఆరోగ్య సదుపాయాల కొరత, సాంకేతిక పరిజ్ఞానానికి దూరంగా ఉండడం, సామాజిక బంధనాలు, కుటుంబ ఆర్థిక నియంత్రణ వ్యవస్థల్లో ప్రాతినిధ్యం లేకపోవడం వంటి అంశాలు వారి పురోగతికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. కుటుంబం లోనూ సమాజంలోనూ నిర్ణయాధికార వ్యవస్థల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం అత్యవసరమైంది. వాతావరణ మార్పులు కూడా గ్రామీణ మహిళల జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వర్షాభావం, భూసార క్షీణత, నీటి కొరత, వనరుల తగ్గుదల వంటి పరిస్థితుల్లో కూడా వారు కుటుంబ స్థిరత్వాన్ని కాపాడుతూ వ్యవసాయం, పశుపోషణ, నీటి సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వారు సహజ వనరుల సంరక్షకులు, పర్యావరణ రక్షకులు, జీవన ధార యొక్క కాపాడు వారిగా నిలుస్తున్నారు. ప్రతి సంవత్సరం యునైటెడ్ నేషన్స్, వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ దినోత్సవాన్ని ఒక నిర్దిష్ట అంశంతో నిర్వహిస్తాయి. 2025 సంవత్సరానికి ఐక్యరాజ్య సమితి ప్రతిపాదించిన థీమ్..."సుస్థిర భవిష్యత్తు కోసం గ్రామీణ మహిళల శక్తి". ఈ అంశం ద్వారా మహిళల పర్యావరణ అవగాహన, సుస్థిర వ్యవసాయ విధానాలు, నీటి వనరుల సంరక్షణ, వాతావరణ మార్పులకు ప్రతిఘటన వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నివేదిక ప్రకారం మహిళలకు పురుషులతో సమాన అవకాశాలు కల్పిస్తే ప్రపంచ ఆహార లోపం 17 శాతం వరకు తగ్గవచ్చని అంచనా. ఇది మహిళల సాధికారత ఎంతమాత్రం ఆర్థికమే కాకుండా ప్రపంచ ఆహార భద్రతకు కూడా దోహద పడుతుందో స్పష్టంగా తెలియ జేస్తుంది. గ్రామీణ మహిళల శక్తివంతీకరణ అంటే కేవలం లింగ సమానత్వం కోసం చేసే పోరాటం కాదు; అది ప్రపంచ పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక స్వావలంబన దిశగా తీసుకెళ్లే సార్వత్రిక ఉద్యమం. గ్రామీణ మహిళ ఒక నిశ్శబ్ద విప్లవ కారిణి. ఆమె చేతుల్లోనే కుటుంబ స్థిరత్వం, సమాజ అభివృద్ధి, దేశ సమృద్ధి నిక్షిప్తమై ఉంది. ఆమె శ్రమతో పంట పండుతుంది, ఆమె సహనంతో కుటుంబం నిలుస్తుంది, ఆమె జ్ఞానంతో సమాజం ముందుకు సాగుతుంది. "అంతర్జాతీయ గ్రామీణ మహిళల దినోత్సవం" మనకు గుర్తు చేస్తుంది --- ఆమెను గౌరవించడం అంటే దేశాన్ని గౌరవించడం, ఆమెను శక్తివంతం చేయడం అంటే ప్రపంచాన్ని సుస్థిరంగా మార్చడం.

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్**
**9440595494**

# మూడు ఏళ్లు దాటినా బీసీ రిజర్వేషన్లపై

# కాంగ్రెస్ చిత్తశుద్ధి ఏది..?



భారతదేశంలో కులం ఒక సామాజిక వాస్తవికత. కులాన్ని విస్మరించి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం అంటే సమస్య మూలాలను విస్మరించడమే. శతాబ్దాలుగా కొనసాగిన కుల ఆధారిత వివక్ష, సామాజిక అసమానతలు, విద్యా--ఉపాధి అవకాశాల్లో వెనుకబాటుతనం కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేశాయి. అందుకే భారత రాజ్యాంగం సమానత్వాన్ని కేవలం చట్టం ముందు అందరూ సమానమే అనే స్థాయిలో ఆపకుండా, చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక అవకాశాలు కల్పించే సామాజిక న్యాయ దృక్పథాన్ని స్వీకరించింది. రాజ్యాంగ పీఠికలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లక్ష్యం నుంచి ఆర్టికల్ 14, 15, 16లలోని సమానత్వ సూత్రాల వరకు, ఆదేశిక సూత్రాల్లోని సంక్షేమ భావన వరకు ఇదే తాత్విక పునాది కనిపిస్తుంది. కేశవానంద భారతి తీర్పు ద్వారా రాజ్యాంగ మౌలిక నిర్మాణ సిద్ధాంతం స్థిరపడినప్పటికీ, సామాజిక న్యాయం భారత ప్రజాస్వామ్యానికి అంతర్భాగమనే సత్యం దాని కంటే చాలా లోతైనది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పరస్పరం విడదీయరాని విలువలు. సమాజంలో ఒక వర్గానికి అవకాశాల తలుపులు మూసివేసి, మరో వర్గానికి మాత్రమే అవి తెరిచి ఉంచితే రాజ్యాంగ సమానత్వం కాగితాలకే పరిమితమవుతుంది. ఇలాంటి చారిత్రక నేపథ్యంలో బీసీల రిజర్వేషన్ల ప్రశ్నను చూడాలి. బీసీలు ఏదో ఒక ప్రత్యేక కులానికి చెందిన చిన్న వర్గం కాదు. దేశంలోని అనేక వెనుకబడిన కులాలు, సంప్రదాయ వృత్తిదారులు, చేతివృత్తులపై ఆధారపడి జీవించిన సమూహాలు ఇందులో ఉన్నాయి. వారి ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఒక్కరోజులో ఏర్పడింది కాదు. సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవించిన కులాలకు ఆధునిక ఆర్థిక వ్యవస్థలో సరైన ప్రత్యామ్నాయాలు కల్పించకపోవడం, విద్యా అవకాశాల కొరత, భూమి--ఆస్తుల అసమాన పంపిణీ, ఉపాధి అవకాశాల్లో పరిమితులు, రాజకీయ ప్రాతినిధ్యం లేకపోవడం, ఇవన్నీ కలిసే బీసీల వెనుకబాటుతనాన్ని నిర్మించాయి. మండల్ కమిషన్ సిఫారసుల అనంతరం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చినా, దాని పూర్తి ప్రయోజనం ఇంకా బీసీలందరికీ అందలేదు. కేంద్ర ప్రభుత్వమే వెల్లడించిన 2022 జనవరి 1 నాటి గణాంకాల ప్రకారం 75 మంత్రిత్వ శాఖలు, విభాగాల సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుంటే మొత్తం ఉద్యోగుల్లో ఓబీసీల ప్రాతినిధ్యం 21.98 శాతం మాత్రమే. గ్రూప్-బీలో అది 18.07 శాతం, గ్రూప్-డీలో 17.46 శాతం, గ్రూప్-ఏలో 22.69 శాతంగా ఉంది. అంటే రిజర్వేషన్ ప్రకటించడమే సామాజిక న్యాయం సాధించినట్టు కాదు. రిజర్వేషన్ ఎంత అమలవుతోంది? ఖాళీలెన్ని ఉన్నాయి? బ్యాక్‌లాగ్ పోస్టులెన్ని? ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత? విద్యా సంస్థల్లో ప్రవేశాలు ఎంత? పదోన్నతుల్లో పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికినప్పుడే అసలు సామాజిక న్యాయం ఎంత దూరంలో ఉందో అర్థమవుతుంది. తెలంగాణ పరిస్థితి మరింత స్పష్టంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రకారం బీసీల జనాభా 56.33 శాతంగా నమోదైంది. అదే సర్వేలో ఎస్సీలు 17.43 శాతం, ఎస్టీలు 10.45 శాతంగా నమోదయ్యారు. ఈ గణాంకాలు బీసీల రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం గురించి కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. జనాభాలో సగానికి పైగా ఉన్న వర్గానికి విద్య, ఉద్యోగాలు, రాజకీయ అధికారంలో తగిన వాటా ఉందా అన్నదే ఇప్పుడు తెలంగాణ సమాజం ముందు ఉన్న అసలు ప్రశ్న. కామారెడ్డి డిక్లరేషన్ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కుల సర్వే నిర్వహించడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం శాసనపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది. 2025 మార్చిలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ఆమోదించాయి. అనంతరం అవి గవర్నర్ ద్వారా రాష్ట్రపతి ఆమోదానికి పంపబడ్డాయి. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. బిల్లులు ఆమోదించడం ఒక దశ మాత్రమే. వాటిని చట్టబద్ధంగా, శాశ్వతంగా అమలు చేయడానికి కేంద్రంపై ఎంతటి రాజకీయ ఒత్తిడి తీసుకొస్తున్నారు? రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను ఎంతవరకు నిర్వర్తిస్తోంది? బీసీలకు ఇచ్చిన హామీని ఎన్నికల వాగ్దానంగా కాకుండా రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయ కార్యక్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందా? 2025 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ పోరాటాన్ని బీసీల సామాజిక న్యాయ పోరాటంగా ప్రచారం చేసింది. కానీ బీసీ సమాజం అడిగే ప్రశ్న మాత్రం ఒక్కటే---ఢిల్లీలో ధర్నా చేయడం మాత్రమే సరిపోతుందా? బిల్లుల ఆమోదం కోసం అన్ని పార్టీలను కలుపుకుని నిరంతర రాజకీయ, న్యాయ, పార్లమెంటరీ పోరాటం ఎందుకు కొనసాగించకూడదు? మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటడంపై న్యాయపరమైన వివాదం ఏర్పడింది. తెలంగాణ హైకోర్టు 2025 అక్టోబరులో 42 శాతం బీసీ రిజర్వేషన్లతో మొత్తం రిజర్వేషన్లు 67 శాతానికి చేరుతున్నాయని పేర్కొంటూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత రిజర్వేషన్ విధానాన్నే అనుసరించాలని మధ్యంతర ఆదేశాలు ఇచ్చింది. ఇదే అంశం రాష్ట్ర ప్రభుత్వానికి ఒక కీలక పాఠాన్ని చెబుతోంది. బీసీ రిజర్వేషన్లను కేవలం రాజకీయ నినాదంగా కాకుండా బలమైన రాజ్యాంగ, చట్టపరమైన పునాదులతో ముందుకు తీసుకెళ్లాలి. సమగ్ర కుల గణాంకాలు, సామాజిక--విద్యా వెనుకబాటుతనం, ప్రాతినిధ్య లోపం, స్థానిక సంస్థల్లో బీసీల వాస్తవ పరిస్థితి వంటి అంశాలపై శాస్త్రీయ ఆధారాలతో న్యాయస్థానాల్లో వాదించాలి. న్యాయపరమైన సవాళ్లను ముందుగానే అంచనా వేసి పటిష్టమైన చట్టపరమైన వ్యూహాన్ని రూపొందించాలి. అయితే ఇక్కడ మరో పెద్ద ప్రశ్న ఉంది. బీసీ రిజర్వేషన్లను కేవలం స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రమే పరిమితం చేయాలా? అసలు సమస్య విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అభివృద్ధి అన్నింటినీ కలిపి చూడాల్సిన అవసరం ఉంది. గ్రామ పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు బీసీల రాజకీయ ప్రాతినిధ్యం ఎలా ఉండాలి? ఉన్నత విద్యలో వారి ప్రవేశాలు ఎలా పెరగాలి? ప్రభుత్వ ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను ఎలా భర్తీ చేయాలి? బీసీ యువతకు పోటీ పరీక్షల శిక్షణ, హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృత్తి నైపుణ్య శిక్షణ ఎలా అందాలి? సంప్రదాయ చేతివృత్తులను ఆధునిక మార్కెట్లతో ఎలా అనుసంధానం చేయాలి? ఇవన్నీ బీసీ విధానంలో భాగం కావాలి. ముఖ్యంగా బ్యాక్‌లాగ్ ఖాళీల అంశాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకూడదు. రిజర్వేషన్ ఉన్నప్పటికీ ఏళ్ల తరబడి ఖాళీలు భర్తీ కాకపోతే ఆ రిజర్వేషన్ అర్థరహితమవుతుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీజ ప్రాతినిధ్యం 27 శాతం కోటాకు చేరకపోవడం కూడా ఈ సమస్య తీవ్రతను చూపుతోంది. అయితే ఏ సంఖ్యను అయినా ఖచ్చితమైన "బ్యాక్‌లాగ్"గా ప్రకటించే ముందు శాఖలవారీగా, కేడర్‌వారీగా ఖాళీలను అధికారికంగా ఆడిట్ చేసి ప్రజలకు వెల్లడించాలి. అదే పారదర్శకత. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కూడా అంతే ముఖ్యమైనది. చట్టసభల్లో బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ లేకపోవడం వల్ల వారి జనాభా శాతానికి తగిన రాజకీయ స్వరం ప్రతిసారీ ప్రతిఫలించకపోవచ్చు. స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం పెరగడం ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు ఉపయోగపడుతుంది. కానీ స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర శాసనసభ, పార్లమెంటు వరకు బీసీల నిర్ణయాత్మక పాత్ర పెరగాల్సిందే. ఇక్కడ కాంగ్రెస్ మాత్రమే కాదు, బీజేపీతో పాటు దేశంలోని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు ఒకే ప్రశ్న వర్తిస్తుంది. బీసీలు ఎన్నికల సమయంలో ఓటు బ్యాంకులా కనిపించి, అధికారంలోకి వచ్చిన తర్వాత విధాన నిర్ణయాల్లో వారి ప్రాతినిధ్యం ఎందుకు తగ్గిపోవాలి? ఎన్నికల ప్రచారంలో బీసీల గురించి మాట్లాడటం సులభం. కానీ బడ్జెట్‌లో నిధులు కేటాయించడం, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయడం, విద్యా అవకాశాలు పెంచడం, కుల గణాంకాలను విధానాల్లో ఉపయోగించడం, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం, ఇవే అసలు చిత్తశుద్ధికి పరీక్షలు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం--రాష్ట్రం పరస్పరం నిందించుకోవడం కూడా ఇక ఆపాలి. కేంద్రం రాష్ట్రంపై, రాష్ట్రం కేంద్రంపై బాధ్యత నెట్టుకుంటే నష్టపోయేది బీసీ యువతే. రాష్ట్రానికి ఉన్న అధికారాలతో చేయాల్సినవి వెంటనే చేయాలి. కేంద్ర అనుమతి లేదా రాజ్యాంగపరమైన ప్రక్రియ అవసరమైన అంశాలపై నిరంతర ఒత్తిడి కొనసాగించాలి. పార్లమెంటులో తెలంగాణకు చెందిన అన్ని పార్టీల ఎంపీలను ఒకే వేదికపైకి తీసుకురావాలి. న్యాయ నిపుణులు, రాజ్యాంగ నిపుణులు, బీసీ సంఘాలతో కలిసి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించాలి. సామాజిక న్యాయం అనేది ఎవరి మీదో యుద్ధం కాదు. అది చారిత్రక అసమానతలను తగ్గించే ప్రజాస్వామ్య ప్రక్రియ. బీసీలకు న్యాయం చేయడం అంటే ఇతర వర్గాల హక్కులను హరించడం కాదు. సమాజంలో అవకాశాలు సమానంగా పంచబడేలా వ్యవస్థను సరిదిద్దడం. "మెరిట్" అనే పదాన్ని సామాజిక నేపథ్యం నుంచి వేరు చేసి చూడటం కూడా సరికాదు. రాజ్యాంగం సమాన అవకాశాలతో పాటు సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక చర్యలను గుర్తించింది. మూడు సంవత్సరాల రాజకీయ ప్రయాణం పూర్తయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం తన బీసీ హామీలను తూకం వేసుకోవాల్సిన సమయం ఇది. కుల సర్వే చేయడం ఒక చారిత్రక అడుగు. 42 శాతం రిజర్వేషన్ల కోసం బిల్లులు తీసుకురావడం మరో అడుగు. కానీ ప్రజలకు కావాల్సింది ప్రకటనలు కాదు, ఫలితాలు. బీసీ యువకుడికి ఉద్యోగం రావాలి. బీసీ విద్యార్థికి ఉన్నత విద్య అందాలి. బీసీ మహిళకు ఆర్థిక స్వావలంబన రావాలి. బీసీ చేతివృత్తిదారుడి వృత్తికి మార్కెట్ రావాలి. బీసీ ప్రజలకు రాజకీయ నిర్ణయాల్లో తగిన స్థానం రావాలి. అప్పుడే సామాజిక న్యాయం అనే మాటకు అర్థం ఉంటుంది. తెలంగాణ బీసీ సమాజం ఇప్పుడు ప్రశ్నిస్తోంది, కుల సర్వేలో తమ జనాభా వెల్లడైన తర్వాత కూడా జనాభా దామాషా ప్రాతినిధ్యంపై ఎందుకు స్పష్టమైన విధానం ఉండకూడదు? 42 శాతం రిజర్వేషన్ హామీ ఇచ్చిన తర్వాత దాని అమలుకు కాలపట్టిక ఎందుకు ఉండకూడదు? బ్యాక్‌లాగ్ ఖాళీలపై ప్రత్యేక శ్వేతపత్రం ఎందుకు విడుదల చేయకూడదు? బీసీ సంక్షేమానికి కేటాయించిన నిధులు ఎంత? ఖర్చు చేసినది ఎంత? ప్రయోజనం పొందిన కుటుంబాలెన్ని? ఈ వివరాలు ప్రజల ముందుంచడానికి ప్రభుత్వం ఎందుకు వెనుకాడాలి? ప్రజాస్వామ్యంలో ఓటు ఒకరోజు ఆయుధం కాదు. అది ఐదేళ్లకు ఒకసారి ప్రజలు ఇచ్చే తీర్పు. బీసీలను ఓటు బ్యాంకులుగా చూసే రాజకీయాలకు ముగింపు పలకాల్సిన బాధ్యత బీసీ సమాజానిదే. అయితే ఆ తీర్పు ఏ పార్టీకి అనుకూలంగా ఉండాలి అనే దానికంటే, ఏ పార్టీ సామాజిక న్యాయాన్ని నిజాయితీగా అమలు చేస్తుందో దాని ఆధారంగా ఉండాలి. కాంగ్రెస్ అయినా, బీజేపీ అయినా, మరే ఇతర రాజకీయ పార్టీ అయినా---బీసీలకు హామీలు ఇవ్వడం కాదు, హక్కులు అమలు చేయడం ముఖ్యం. సామాజిక న్యాయం సభల్లో చేసే ప్రసంగాల్లో కాదు, ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో, విద్యా సంస్థల ప్రవేశాల్లో, బడ్జెట్ కేటాయింపుల్లో, రాజకీయ ప్రాతినిధ్యంలో, బ్యాక్‌లాగ్ భర్తీలో కనిపించాలి. తెలంగాణలో బీసీల జనాభా సగానికి పైగా ఉన్నదని కుల సర్వే గణాంకాలు చెబుతున్న వేళ, వారి హక్కుల ప్రశ్నను ఇక వాయిదా వేయడం సాధ్యం కాదు. 42 శాతం రిజర్వేషన్ల అంశం ఒక ఎన్నికల హామీగా మొదలై ఉంటే, ఇప్పుడు అది రాజ్యాంగబద్ధమైన సామాజిక న్యాయ డిమాండ్‌గా మారింది. ఈ డిమాండ్‌ను చట్టపరంగా, రాజకీయంగా, ప్రజాస్వామ్య బద్ధంగా సాధించే బాధ్యత ప్రభుత్వానిదే. బీసీలకు న్యాయం చేయడం దయ కాదు. అది రాజ్యాంగం నిర్దేశించిన సమానత్వ లక్ష్యాన్ని ఆచరణలో పెట్టడం. బీసీలను ఓటు వేసే చేతులుగా మాత్రమే చూసే రాజకీయాలకు కాలం చెల్లింది. ఇక వారు తమ హక్కులను ప్రశ్నించే పౌరులుగా, తమ ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేసే ప్రజలుగా, తమ భవిష్యత్తును నిర్ణయించే శక్తిగా ఎదగాల్సిన సమయం వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకుంటుందా? లేక బీసీ రిజర్వేషన్ల అంశం మరో ఎన్నికల హామీగానే మిగిలి పోతుందా? రాబోయే కాలమే సమాధానం చెప్పాలి. కానీ ఒక విషయం మాత్రం స్ప ష్టం, బీసీలను మోసం చేయాలని చూస్తున్న పార్టీలను రేపు వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్, బిజెపిని బొంద పెట్టడం ఖాయం..



**-మన్నారం నాగరాజు**
**సామాజిక,రాజకీయ విశ్లేషకులు**

**"ఆ రోజుల్లో అమ్మమ్మ ఇంట్లో పుట్టేవాళ్లం,**

# తరచూ అమ్మమ్మ ఇంటికి వెళ్లేవాళ్లం

ఇప్పుడు ఆసుపత్రిలో పుడుతున్నాం, జీవితంలో ఎన్నోసార్లు ఆసుపత్రుల చుట్టూనే తిరుగుతు న్నాం..." ఈ మాటల్లో చిన్ననాటి జ్ఞాపకాలతో పాటు, మన జీవితంలో సౌకర్యాలు పెరుగుతు న్నా... ఆప్యాయంగా సేదతీరే చోటులు తగ్గిపోతు న్నాయనే ఆవేదన కనిపిస్తుంది. అమ్మమ్మ ఇల్లు అంటే ఒక ఇల్లు మాత్రమే కాదు. చిన్నప్పుడు మన కోసం ఎదురుచూసే మనుషులు ఉన్న చోటు. మనకు ఇష్టమైన వంట చేసి పెట్టే చేతులు, మన అల్లరిని ఓపికగా భరించే మనసు, మన కథలను ఆసక్తిగా వినే చెవులు ఉన్న చోటు. అక్కడికి వెళ్లాలంటే ప్రత్యేకమైన కారణం అవసరం ఉండేది కాదు. సెలవులు వచ్చాయన్నా, అమ్మమ్మ గుర్తొచ్చిందన్నా వెళ్లిపోయేవాళ్లం. అక్కడ మన విలువను మార్కులతోనో, సంపాదనతోనో, హోదాతోనో కొలిచేవారు కాదు. "నా మనవడు వచ్చాడు... నా మనవరాలు వచ్చింది" అనే ఆనందమే ఉండేది. మన రాకతో ఆ ఇంటికి సందడి వచ్చేది; ఆ ఇంటికి వెళ్లడంతో మన మనసుకు హాయిగా ఉండేది. అందుకే అమ్మమ్మ ఇంటి జ్ఞాపకం వయసు పెరిగినా మనలో చిన్నపిల్లవాడిని మేల్కొలుపుతుంది. కాలంతో పాటు ప్రసవాలు వైద్యపర్యవేక్షణలో జరిగే సౌకర్యాలు పెరిగాయి. ఆసుపత్రులు మన జీవితంలో అవసరమైన సేవలు అందిస్తున్నాయి. ఈ మార్పును గుర్తిస్తూ, మీ మాటలు మరో ప్రశ్నను మన ముందుంచుతున్నాయి---మన శరీరాన్ని చూసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం... మన మనసును ఆప్యాయంగా పలకరించే బంధాలకు ఎంత సమయం ఇస్తున్నాం? ఇప్పుడు చదువు, ఉద్యోగం, సంపాదన, పిల్లల భవిష్యత్తు, కుటుంబ బాధ్యతల మధ్య రోజులు గడిచిపోతున్నాయి. "ఈ పని అయిపోయాక వెళ్దాం... వచ్చే నెలలో కలుద్దాం..." అంటూ మనవాళ్లను కలవడాన్ని వాయిదా వేస్తున్నాం. ఒకప్పుడు సెలవు దొరికితే అమ్మమ్మ ఇంటికి వెళ్లాలని అనిపించేది. ఇప్పుడు సెలవు దొరికినా పూర్తి చేయాల్సిన పనులే గుర్తుకొస్తున్నాయి. "ఎప్పుడూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాం" అనే మాటలో జీవితమంతా ఆందోళనల మధ్య గడిచిపోతుందనే భావం కూడా ఉంది. ఒకసారి మన కోసం, మరొకసారి ఇంట్లో పెద్దవారి కోసం, ఇంకొకసారి పిల్లల కోసం పరుగులు తీస్తుంటాం. ఈ బాధ్యతల మధ్య మనకు విశ్రాంతి కావాలనే విషయాన్ని కూడా మర్చిపోతుంటాం. అమ్మమ్మ ఇంట్లో "అన్నం తిన్నావా?" అని అడిగే స్వరంలో ప్రేమ ఉండేది. "ఎందుకు దిగులుగా ఉన్నావు?" అని అడిగే మాటలో మన కోసం సమయం ఉండేది. అలాంటి పలకరింపులు ఈరోజూ మనకు అవసరమే. వైద్యసేవలతో పాటు, కష్టంలో తోడుగా నిలబడే మనుషులు ఉండటం జీవితానికి ధైర్యాన్ని ఇస్తుంది. అందుకే ఈ మాటలను చదివి గతాన్ని గుర్తుచేసుకోవడంతో పాటు, ఈరోజు మన బంధాలను కూడా పలకరించాలి. అమ్మమ్మ, తాతయ్య ఉంటే సమయం కేటాయించి కలవాలి. తల్లిదండ్రులతో కాసేపు కూర్చోవాలి. పిల్లలకు పెద్దల కథలు వినే అవకాశం ఇవ్వాలి. అనారోగ్యం వచ్చినప్పుడు చేసే పరామర్శతో పాటు, సాధారణ రోజుల్లో చేసే చిన్న పలకరింపుకూ ఎంతో విలువ ఉంది. పాత రోజులు యథాతథంగా తిరిగి రావు. కానీ ఆ రోజుల్లోని ప్రేమను మన ఇళ్లలో మళ్లీ పెంచుకోవచ్చు. కలిసి భోజనం చేయడానికి కొంత సమయం, పెద్దల మాట వినడానికి కొంత ఓపిక, మనవాళ్లను కలవడానికి కొంత తీరిక మనమే కేటాయించవచ్చు. మన పిల్లలకు మన ఇల్లు కూడా రేపటి "అమ్మమ్మ ఇంటి జ్ఞాపకం" కావాలి. అక్కడ తమ కోసం ఎదురుచూసే ప్రేమ ఉందని వారికి అనిపించాలి. వయసు పెరిగిన తర్వాత కూడా గుర్తు చేసుకొని చిరునవ్వు నవ్వే ఆప్యాయతను ఈరోజే వారికి అందించాలి.



**-మీ నక్క యాదగిరి**

## జిల్లాల విభజన

# ప్రజల సౌలభ్యం కోసం !

**భూముల ధరలకు రెక్కలు కాంట్రాక్టర్లకు పండగ పదవుల పంపకానికి కొత్త చిరునామా**

**ప్రజల దూరం తగ్గిందో లేదో ఎవరు అడుగుతారు ?**

**పలుకుబడి పెరిగింది పెట్టుబడికి విలువ పెరిగింది రాజకీయ పునాదులకు మరో అంతస్తు చేరింది**

**ఖజానా ఖర్చు ప్రజలది ప్రచారంలో ఘనత నాయకులది**

**జిల్లాలు ప్రజలకోసమే ఏర్పడ్డాయా ? ప్రజల పేరుతో ఎవరి ప్రయోజనాలు ఏర్పడ్డాయి ?**




**సమాధానం చెప్పాల్సిన వారే శిలాఫలకాలపై చిరునవ్వులు చిందిస్తుంటే , జనస్వామ్యం ఎవరిని ప్రశ్నించాలి ?**



**-మండాది గోపీనాథ్**
**ముక్కుడు దేవులపల్లి సెల్ ;**
**9885045344**

# 24 డివిజన్ల పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ నూతన కమిటీల ప్రారంభోత్సవం

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 14:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సమన్వయ కమిటీకి అనుసంధానంగా, సీఎం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 24 డివిజన్లకు నూతనంగా ఏర్పాటు చేసిన పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ కమిటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు కె. దీపక్ జాన్, మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రభుత్వ సమన్వయకర్తకల్లోజి రవికుమార్




హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు నూతన కమిటీల సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు సమాజంలో ఐక్యత, సేవాభావం, శాంతి, సోదరభావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో, సమాజ సంక్షేమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ చైర్మన్ మరియు అధ్యక్షులు రెవరెండ్ గోడి శేఖర్, కార్యదర్శి బిషప్ ఎం.ఎస్. సామ్యూల్ పీటర్, కోశాధికారి రెవరెండ్ దయానిధి, ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు, సంయుక్త కార్యదర్శి సి. హెచ్. బెల్తాజర్ రాజు, న్యాయ సలహాదారు ప్రదీప్ శ్యామ్, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాస్టర్ జి. రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని 24 డివిజన్ల నూతన ఫెలోషిప్ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, ఐజజ కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నియోజక వర్గంలోని పాస్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## మానవ సేవయే మాధవ సేవ : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్.

**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 14:** బుధవారం 130 – సుభాష్ నగర్ కి చెందిన డాక్టర్ నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్సు సేవను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అత్యవసర సమయంలో ఆపదలో ఉన్న నిరుపేదలకు అంబులెన్స్ సర్వీస్ ను అందిస్తూ డాక్టర్ నరేందర్ గౌడ్ చేస్తున్న సేవలు అభినంద నీయమని, అభాగ్యులకు, నిరుపేదలకు చేసే సేవ మాధవ సేవతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ ప్రెసిడెంట్ పోలె శ్రీకాంత్, సుభాష్ నగర్ వాసులు లోచారం వెంకట రమణ, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మి నారాయణ, అడపా శేషు, విష్ణువర్ధన్, శివతేజ, గుబ్బల తేజ, పాల్గొన్నారు.

# ఆరుట్లలో మృతుల కుటుంబాలకు మాజీ ఎంపీ పరామర్శ

**మంచాల వెలుతురు అక్టోబర్ 14:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కొత్తపల్లి కళ్ళమ్మ పూజారి సత్యనారాయణ ముదిరాజ్ మరణ వార్త తెలుసుకున్న భువనగిరి పార్లమెంట్ మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకుమార్ వారి నివాసాలకు చేరుకొని మృతదేహాలపై పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు సందర్భంగా భువనగిరి పార్లమెంట్ మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ పూజారి సత్యనారాయణ ముదిరాజ్ కూతురికి ఉద్యోగ అవకాశం కల్పిస్తాను అని హామీ ఇచ్చారు ఈకార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకుడు గోగి రెడ్డి లచ్చిరెడ్డి బిజెపి నాయకులు వింజమూరి వెంకట్ రెడ్డి మంచాల మండలం బిజెపి పార్టీమం డల అధ్యక్షుడు ఆరుట్ల ఉపసర్పంచ్



నూకం రాజు ముదిరాజ్ మంచాల సహకార సంఘం డైరె క్టర్ కొంగర జనార్ధన్ రెడ్డి నాయకులు పొట్టి రాములు పాండాల జంగయ్యగౌడ్.



మందమోహన్ రెడ్డి వివిధ పార్టీల నాయకులు గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## తిప్పాయిగూడలో ఎమ్మెల్యే సహకారంతో నాలుగు ఐమాక్స్ వీధిలైట్లు ఏర్పాటు

- ప్రారంభించిన గ్రామసర్పంచ్ జెనిగే హంసమ్మ కొమురయ్య యాదవ్
- గ్రామాలను పూర్తిస్థాయిలో అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన లక్ష్యం
- మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి



**మంచాల వెలుతురు అక్టోబర్ 14:** మంచాల మండలం తిప్పాయిగూడ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంప ట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో నాలుగు ఐమాక్స్ వీధిలైట్లు మంజూరు మం జూరు తిప్పాయిగుడ గ్రామంలో ప్రధాన వీధుల్లో హైమాక్స్ వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రారం భించిన గ్రామసర్పంచ్ జెనిగే హంసమ్మ కొమురయ్య యాదవ్ ఈకార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన కాంగ్రెస్ పార్టీ మంచాల మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి మాట్లాడుతూమం చాల్ మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధికోసం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి గారు గ్రామాల అభివృద్ధి కోసం సిసి రోడ్డు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వీధిలైట్లు ఐమాక్స్ వీధిలై ట్లు గ్రామపంచాయతీ భవనాలు ఇంకాఎన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తూమం చాల మండలం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తూ అభివృద్ధిపను లకు శంకుస్థాపనలు చేస్తు పనులు మొదలు పెట్టిస్తున్న ఒకడైనమిక్ ప్రియతమ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు అని అన్నారు మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో మంచాల మండలం పూర్తిస్థాయిలో అన్ని వసతులతో అభివృద్ధి చేయించి ఒక ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం అని అన్నారు అర్హులైన పేద కుటుంబాల వారందరికీ. వృద్ధాప్త పింఛన్లు ఇందిర మ్మ ఇండ్లు ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి ఒక్క సంక్షేమ పథకం ప్రతిపేద కుటుంబానికి అందేలా కృషి చేస్తాం అనిఅన్నారు ఈకార్యక్రమంలోకాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిల్లాపురం గాలయ్య వీరేశంగౌడ్ గజ్జిఐలయ్య యాదవ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కాం గ్రెస్ పార్టీ నాయకులు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు



## చైతన్యపురిలో పీఎంజే జ్యువెలర్స్ నూతన స్టోర్ ప్రారంభం

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:** హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురిలో పీఎంజే జ్యువెలర్స్ నూతన ఆభరణాల విక్రయ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. పీఎంజే జ్యువెలర్స్ తెలంగాణ విభాగం అధిపతి దీపక్, చైతన్యపురి స్టోర్ నిర్వాహకుడు మధన్ కుమార్, వినియోగదారుల సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ నూతన స్టోర్‌తో తెలంగాణతో పాటు నాలుగు రాష్ట్రాల్లో పీఎంజే జ్యువెలర్స్ విక్రయ కేంద్రాల సంఖ్య 47కు చేరింది. నూతనంగా ఏర్పాటు చేసిన ఈ స్టోర్‌లో సంప్రదాయ హస్తకళా నైపుణ్యానికి ఆధునిక రూపకల్పనను జోడిస్తూ రూపొందించిన వివిధ రకాల బంగారు, వజ్రాభరణాలను అందుబాటులో ఉంచారు. ఆలయ ఆభరణాలు, పురాతన శైలిలో రూపొందించిన హారాలు, వడ్డాణాలు, పెళ్లి ఆభరణాలు, వజ్రాభరణాలు, రంగురాళ్లతో చేసిన ప్రత్యేక ఆభరణాలతో పాటు రోజువారీ వినియోగానికి అనువైన హారాలు, చెవిపోగులు, ఉంగరాల విస్తృత శ్రేణిని వినియోగదారులు కొనుగోలు చేయవచ్చు. ఈ సందర్భంగా పీఎంజే జ్యువెలర్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కిరణ్ షిండే మాట్లాడుతూ, ఆరు దశాబ్దాలకు పైగా వినియోగదారుల నమ్మకాన్ని పొందిన తమ సంస్థ సంప్రదాయ కళానైపుణ్యాన్ని, నాణ్యతను కొనసాగిస్తూ ఆధునిక అభిరుచులకు అనుగుణంగా ఆభరణాలను అందిస్తోందన్నారు. చైతన్యపురిలో నూతన విక్రయ కేంద్రాన్ని ప్రారంభించడం ద్వారా దిల్‌సుఖ్‌నగర్, పరిసర ప్రాంతాల కుటుంబాలకు మరింత మెరుగైన సేవలు అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారులకు నాణ్యత, పారదర్శకతతో కూడిన కొనుగోలు అనుభవాన్ని అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# ఆరోగ్య పథకాల అమలులో జాప్యం చేస్తే వేటు తప్పదు!

- విధుల్లో అలసత్వం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవు
- డీఎంహెచ్ఓ డాక్టర్ కె. ఆనంద్ హెచ్చరిక

**మేడ్చల్ జిల్లా వెలుతురు అక్టోబర్ 14:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ జిల్లాలో అమలవుతున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాతా శిశు ఆరోగ్యం, గర్భిణుల సంరక్షణ, ప్రసవ సేవలు, శిశు ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, క్షయ వ్యాధి (టీబీ) నోటిఫికేషన్, అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపు, చికిత్స తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించారు. గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించడం, హైరిస్క్ గర్భిణులను నిరంతరం పర్యవేక్షించడం, నిర్ణీత గడువులో ఫాలో-అప్‌లు పూర్తి చేయడం, ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ఆన్‌లైన్ రికార్డులు, నివేదికలను ఎప్పటికప్పుడు నవీకరించడం తప్పనిసరిగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ, గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా, చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించడం, టీకాలకు దూరమైన పిల్లలను గుర్తించి వారికి టీకాలు వేయించడం, తల్లి మరియు శిశు ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని నిరంతరం పర్యవేక్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని





తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి సకాలంలో టీబీ నోటిఫికేషన్ చేయడంతో పాటు, ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటు తదితర అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, గుర్తింపు, చికిత్స మరియు ఫాలో-అప్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (గ్రాజం), పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (UPHCs) ప్రజలకు అందించే వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని డాక్టర్ కె. ఆనంద్ స్పష్టం చేశారు. ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్య పరీక్షలు, తగిన చికిత్స, అవసరమైన మందులు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆన్‌లైన్ అప్‌డేషన్లు, నివేదికల సమర్పణపై ప్రతిరోజూ తాను స్వయంగా నిశితంగా పర్యవేక్షిస్తానని డాక్టర్ కె. ఆనంద్ తెలిపారు. రోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం, వైద్య సేవల్లో అలసత్వం ప్రదర్శించడం, విధుల నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. పనితీరు సరిగా లేని అధికారులు లేదా సిబ్బంది రోగుల సంరక్షణలో నిర్లక్ష్యం వహించినట్లు తేలితే, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైతే వారి సేవలను నిలిపివేయడానికి లేదా విధుల నుంచి తప్పించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశించారు.

## ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా 'డ్యాన్సింగ్ విత్ జాయ్' పుస్తక ఆవిష్కరణ

### ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి ఆనంద శంకర్ జయంత్ రచన

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14 :** ప్రముఖ శాస్త్రీయ నృత్యకారిణి ఆనంద శంకర్ జయంత్ రచించిన 'డ్యాన్సింగ్ విత్ జాయ్' పుస్తకాన్ని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. గరుడ ప్రకాశన్ ప్రచురించిన ఈ పుస్తకంలో కళ, జీవితం, క్యాన్సర్‌పై ఆమె సాధించిన విజయాన్ని పొందుపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకం కేవలం నృత్యం గురించి మాత్రమే కాదన్నారు. పట్టుదల, కఠోర శ్రమ, దృఢ సంకల్పం ద్వారా లభించే అసాధారణ బలానికి సంబంధించిన ఒక శక్తివంతమైన కథనమని అభివర్ణించారు. డాక్టర్ ఆనంద శంకర్ జయంత్ క్యాన్సర్‌పై సాగించిన పోరాట ప్రయాణాన్ని ఈ పుస్తకంలో వివరించిన తీరును ప్రస్తావిస్తూ ఇది కేవలం క్యాన్సర్‌కు సంబంధించిన పుస్తకం మాత్రమే కాదని, క్యాన్సర్‌ను దాటిన జీవన ప్రయాణమని పేర్కొన్నారు. మనసులో ప్రగాఢంగా నాటుకున్న అభిరుచి జీవితంలోని అత్యంత క్లిష్ట సమయాల్లో ఒక ఆలంబనగా నిలవడమే కాకుండా, కష్టాలను సైతం ఆత్మపరిశీలనకు ఒక అవకాశంగా మార్చుకోవడానికి దోహదపడుతుందని వ్యాఖ్యానించారు. డాన్సర్లోని 'డీ' అక్షరం రచయిత్రికి 'క్యాన్సర్' లోని 'సీ'ని అధిగమించడానికి తోడ్పడిందన్నారు. ఎన్నో ఏళ్ల క్రమశిక్షణ, అభ్యాసం, అంకితభావంతో నేర్చుకున్న నృత్యం జీవితంలో ఎదురైన అతి పెద్ద సవాలును ధైర్యంగా ఎదుర్కోవడంలో డాక్టర్ ఆనందకు మూలస్తంభంగా నిలిచిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, అసంక్రమిత వ్యాధుల నివారణ వంటి పథకాల ద్వారా ఆరోగ్య సంరక్షణ, అవగాహన, ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్షలను భారత్ బలోపేతం చేస్తుందన్నారు. వివిధ రాష్ట్రాల్లో క్యాన్సర్ సంరక్షణ సదుపాయాల ద్వారా ప్రత్యేక చికిత్సతో రోగులకు మరింత చేరువైందన్నారు. ఇందులో భాగంగా 700 పైగా జిల్లా క్లినిక్‌లు, 500 డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు 19 రాష్ట్ర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లు, 20 తృతీయ స్థాయి క్యాన్సర్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు అనుమతులు లభించాయని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద అర్హత కలిగిన కుటుంబాలకు ఏడాదికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తున్నామన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నుంచి బాలికలకు రక్షణ కల్పించేందుకు 2026 ఫిబ్రవరిలో ప్రారంభించిన దేశవ్యాప్త హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 1.2 కోట్ల మంది బాలికలకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 50 లక్షల




మందికి పైగా బాలికలకు టీకాలు వేసినట్లు చెప్పారు. డాక్టర్ ఆనంద అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. గెలుపోటములు ఒకే నాణేనికి రెండు ముఖాలని, ప్రతి ఎదురుదెబ్బ కూడా కొత్త విషయాలు నేర్చుకోవడానికి, పునరాలోచన చేసుకోవడానికి, మరింత దృఢ సంకల్పంతో ముందుకు సాగడానికి ఒక అవకాశం కల్పిస్తుందని తెలిపారు. క్యాన్సర్‌తో పాటు ఇతర సవాళ్లను ఎదుర్కొంటున్న వారు ధైర్యాన్ని కోల్పోవద్దని, మనోధైర్యం సానుకూల దృక్పథం ఎంతో కీలకమన్నారు. అవగాహన, ముందస్తు నిర్ధారణ, సకాలంలో చికిత్స ప్రాణాలను కాపాడగలవని స్పష్టం చేశారు. క్యాన్సర్ రోగులకు అండగా నిలవడంలో కుటుంబాలు, స్వచ్ఛంద సేవకులు పోషిస్తున్న పాత్రను కొనియాడారు. రోగి జీవితంలోని అత్యంత క్లిష్టమైన దశల్లో కుటుంబ సభ్యులు ఎన్నో వ్యక్తిగత, ఆర్థిక త్యాగాలు చేస్తూ వారికి అవసరమైన మానసిక బలాన్ని, ప్రోత్సాహాన్ని అందిస్తారన్నారు. ప్రతిభ అనేది దేవుడిచ్చిన వరమే అయినా, నిరంతర అభ్యాసం, సాధన, అంకితభావం ద్వారా మాత్రమే దానిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లగలమని అన్నారు. అభిరుచి అనేది విలాసం కాదని, అది బలానికి మూలమన్నారు. సాధారణ సమయాల్లో పెంపొందించుకున్న నైపుణ్యాలు, ఆసక్తులు అసాధారణ సవాళ్లు ఎదురైనప్పుడు అమూల్యమైన వనరులుగా మారుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద శంకర్ జయంత్‌ను అభినందిస్తూ యువత తమలోని ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకోవడానికి, లెక్కలేనన్ని జీవితాలను స్పృశించడానికి 'డ్యాన్సింగ్ విత్ జాయ్' స్ఫూర్తినిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవితం ఎలాంటి సవాలును విసిరినా, దానిని ధైర్యం, ఔచిత్యం, ఆనందంతో ఎదుర్కోవడం సాధ్యమేనని ఈ పుస్తకం గుర్తు చేస్తోందన్నారు. ఈ పుస్తకం అమెజాన్లో అందుబాటులో ఉంది. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ సంధ్యా పురేచా, ఇందిరా గాంధీ జాతీయ కళా కేంద్రం మెంబర్ సెక్రటరీ డాక్టర్ సచ్చిదానంద్ జోషి, ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పీ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరం విజయవంతం

- అభినందించిన జిల్లా కలెక్టర్
- వైద్య నిపుణులతో ప్రత్యేక పరీక్షలు
- ఉచితంగా మందుల పంపిణీ

**సంగారెడ్డి వెలుతురు అక్టోబర్ 14:** జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యుల కోసం సంగారెడ్డిలో బుధ వారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయ్యింది. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొని.... అభినందించారు. నిత్యం పని వత్తిడి లో ఉండే జర్నలిస్టులు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, కుటుంబాన్ని మంచిగా చూసుకోవాలని సూచించారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. సంగారెడ్డి సన్రైజ్ హాస్పిటల్, రథ సారధి దినపత్రిక సహకారంతో శిబిరం జరిగింది. ఌఖఔజీ –×జీఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ మాట్లాడుతూ తమ యూనియన్ రాష్ట్ర శాఖ గతంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించింది అన్నారు అదే స్ఫూర్తితో సంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల సంక్షేమం కోసం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. TUWJ- IJU జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం స్ఫూర్తితో సంగారెడ్డి జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమానికి వికాసానికి అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ ఎంతో గొప్ప ఆలోచనతో ఈ శిబిరాన్ని నిర్వహించింది అని అన్నారు. వారికి సన్ రైజ్ హాస్పిటల్, రథసారధి పత్రిక వారు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో జర్నలిస్టులు నిత్యం అనేక వత్తులకు గురవుతున్నారని అన్నారు. అందువల్ల తరచుగా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, తద్వారా తగిన మందులు చికిత్స చేయించుకోవాలని పేర్కొన్నారు. స్మాల్ అండ్ మీడియం అధ్యక్షుడు మహమ్మద్ సిద్దిఖ్ మాట్లాడుతూ జర్నలిస్టుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపారు జర్నలిస్టులతో పాటు కుటుంబ సభ్యులు కూడా పాల్గొనడం ద్వారా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిసిందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చౌహాన్ మాట్లాడుతూ నిర్వాహకులతో పాటు ప్రతి ఒక్కరు సహకరించడం ద్వారా ఈ కార్యక్రమం విజయవంతం అయ్యిందని తెలిపారు. స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్,



టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో, సన్‌రైజ్ ఆసుపత్రి, రథసారథి తెలుగు దినపత్రిక సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రుమాండ్ల అనీల్ కుమార్ మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు శిబిరంలో సన్‌రైజ్ ఆసుపత్రికి చెందిన గుండె వైద్యులు, మధుమేహం, ఎముకలు, మెదడు, నాడీ సంబంధిత వ్యాధులు, చిన్నపిల్లలు, మహిళలకు, సాధారణ వైద్య విభాగాల నిపుణులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సలహాలు అందించారని చెప్పారు. వివిధ రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతో పాటు అందుబాటులో ఉన్న మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్, చిన్న, పెద్ద దినపత్రికలు, కేబుల్ మీడియా, సామాజిక మాధ్యమాల ప్రతినిధులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. డి పి ఆర్ ఓ విజయలక్ష్మి అడిషనల్ డిపిఆర్ఓ ఏడుకొండలు, టి ఎన్ జీ ఓ సంఘం సంఘం జిల్లా అధ్యక్షుడు జావిద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఇతర నేతలు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, యాదవ రెడ్డి పాల్గొని నిర్వాహకులను అభినందించారు. సన్ రైజ్ హాస్పిటల్ అధినేత స్వామి గౌడ్, రథసారధి ఎండి సంతోష్ గౌడ్ తో పాటు సాక్షి సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ బాల ప్రసాద్, ఆంధ్రప్రభ సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ రాజు, జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, TUWJ IJU జిల్లా ఉపాధ్యక్షుడు మతీన్ , మల్లేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విల్సన్, ఎలక్ట్రాన్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, కోశాధికారి సిద్ధూ జైన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి లక్ష్మణ్ ఉపాధ్యక్షుడు నజీర్, ఌఖఔజీ ×జీఖ నేతలు హిమాయత్, ఇర్ఫాన్, రాజేశ్వర్ , దినేష్ నాయక్, శ్రీకాంత్, మ హేష్ గౌడ్, కొండాపూర్ రమేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## భీమా భవన్‌లో వైభవంగా 'దుర్గామాత పూజ - బతుకమ్మ' వేడుకలు

- అభిడ్స్‌లోని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ కార్యాలయంలో ఘనంగా వేడుకలు
- హాజరైన ఉద్యోగ సంఘాల ముఖ్య నాయకులు
- వరుసగా 7వ సంవత్సరం విజయవంతంగా నిర్వహణ



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:** అబిడ్స్‌లోని 'భీమా భవన్' వద్ద గల డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ (ిడూా) డిపార్ట్‌మెంట్‌లో ిడూా గెజిటెడ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'దుర్గామాత పూజ – బతుకమ్మ' వేడుకలు అత్యంత వైభవంగా, ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టిడఎ డిపార్ట్‌మెంట్ ఉద్యోగులందరూ పెద్ద ఎత్తున హాజరై వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో టిడఎ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ పార్వతి గారు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస్, కార్యదర్శి శ్యామ్, తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ (ిNGO) అధ్యక్షులు మారం జగదీష్ కార్యదర్శి ముజీబ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరితో పాటు హైదరాబాద్ సిటీ టీజీవో అధ్యక్షులు గండూరి వెంకట్, కార్యదర్శి నిరంజన్, హైదరాబాద్ TNGO అధ్యక్షులు శ్రీకాంత్ కూడా హాజరై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. కమిటీ కృషికి ప్రశంసలు ఈ వేడుకలనుిడూా గెజిటెడ్ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి లావణ్య, ట్రెజరర్ యాదగిరి, ఉపాధ్యక్షులు ఐ. శ్రీనివాస్, పేరయ్య, రవీందర్, ప్రసన్న, లలిత, హేమ, వసుంధర, రూప్ సింగ్, వెంకటేశ్వర్లు వారి బృందం ఎంతో సమర్థవంతంగా సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. భీమా భవన్‌లో వరుసగా ఇది 7వ సంవత్సరం విజయోత్సవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం అని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## చౌటుప్పల్ పురపాలక సంఘంలో బతుకమ్మ సంబరాలు





**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 14:** చౌటుప్పల్ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్‌ను ఆదర్శ పురపాలక సంఘంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ తెలిపారు. బుధవారం రాత్రిచౌటుప్పల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో చౌటుప్పల్ గాంధీ పార్కులో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ సారథ్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పట్టణంలోని మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలను విజయవంతం చేశారు. పట్టణంలోని వివిధ వార్డుల నుంచి కౌన్సిలర్లు, మహిళలు బతుకమ్మలను తీసుకురాగా, రామాలయం నుంచి గాంధీ పార్క్‌వరకు బతుకమ్మలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గాంధీ పార్క్‌లో మహిళలందరూ ఒకచోట చేరి సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో సందడిగా సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి.

### పట్టణ ప్రజలకు చైర్‌పర్సన్ బతుకమ్మ శుభాకాంక్షలు

ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీమతి మొగుదాల పావని రమేష్ గౌడ్ గారు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, ఐకమత్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. చౌటుప్పల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, పరిశుభ్రత, పచ్చదనం, మౌలిక సదుపాయాల కల్పనలో ఆదర్శంగా నిలిచే పురపాలక సంఘంగా తీర్చిదిద్దేందుకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు.

### పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం. వెంకటేశ్వర నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు: శ్రీ కొండనం రాకేష్ రెడ్డి, శ్రీమతి పోలేపల్లి లక్ష్మి ముత్తయ్య, శ్రీమతి పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, శ్రీ ఉదరి యాదయ్య, శ్రీ కొయ్యడ శేఖర్, శ్రీమతి ఆలె శ్రీలత చిరంజీవి, శ్రీమతి కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, శ్రీ బద్రి గాలయ్య, శ్రీమతి దేప రమ్య రాజు, శ్రీ పాక చిరంజీవి, శ్రీమతి భత్తుల వాణి విప్లవ కుమార్, శ్రీమతి ఉడుగు జ్యోతి రమేష్, శ్రీమతి గడ్డం ఇందిరా రాజరత్నం, శ్రీమతి బత్తుల జయమ్మ దాసు, శ్రీమతి చింతల ఉమామహేశ్వరి సాయిలు, శ్రీ బుడ్డ సురేష్, శ్రీ పిల్లలమర్రి మధుసూదన్, శ్రీ హన్సు మహమ్మద్, కో ఆప్షన్ సభ్యులుకో–ఆప్షన్ సభ్యులు శ్రీ పస్తం గంగారాములు, శ్రీమతి సందగళ్ల విజయ సతీష్, శ్రీ మహమ్మద్ బాబా షరీఫ్, శ్రీమతి షేక్ నబీబి జానీ బాబా తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్.ఓ. అంజయ్య, సానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్ ,కార్యాలయ మహిళా సిబ్బంది అకౌంటెంట్ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ దీప, వార్డు అధికారులు వినీల, కళ్యాణి, ప్రవళిక, సునీత తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు , వార్డు అధికారులు, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది, మహిళా పారిశుధ్య కార్మికులు, మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్లు (RPs), స్వయం సహాయక సంఘాల మొదటి, రెండవ నాయకులు, సంఘ సభ్యులు, పట్టణ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ

**యాదగిరిగుట్ట పిహెచ్సిలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ పండుగ**



**యాదగిరిగుట్ట, అక్టోబర్ 14 వెలుతురు**
తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మనోహర్ యాదగిరిగుట్ట పీహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట పీహెచ్సీలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ పండుగను నిర్వహించారు . ఈ కార్యక్రమానికి యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగను 9 రోజులపాటు తెలంగాణ అంతటా ఘనంగా నిర్వహించు కుంటారని అన్నారు. రోజుకో రకంగా తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ పండుగను నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. బతుకమ్మ పండుగలో భాగంగా యాదగిరి గుట్ట పిహెచ్సి లో కూడా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని ఆధ్వర్యంలో ఇంత పెద్ద ఎత్తున కన్నుల పండువగా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని మాట్లాడుతూ గుట్ట పిహెచ్సిలో పెద్ద ఎత్తున బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలకు సహకరించిన సిబ్బందికి ధన్యవాదాలు తెలియజేసు న్నామని అన్నారు. ఈ సందర్భంగా పి. హెచ్. సి మహిళా సిబ్బందితో కలిసి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలతో పిహెచ్సిలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎం పావని, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, పిహెచ్సి అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులపై గ్రామపంచాయతీల పేర్లు ముద్రించాలి





**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 14:**
చౌటుప్పల్ మండలంలో కొన్ని రోజుల నుండి స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ పంపిణీ చేస్తున్నారని, మండలంలో 26 గ్రామపంచాయతీలలో 12 గ్రామపంచాయతీలు రెవెన్యూ గ్రామాలుగా ఉన్నాయి. మిగతా 14 గ్రామపంచాయతీల పేర్లు లేకుండానే రెవిన్యూ విలేజిల పేర్ల మీదనే స్మార్ట్ రేషన్ కార్డు పంపిణీ చేస్తున్నారు కాబట్టి గ్రామపంచాయతీల పేరుతో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేయవలసిందిగా శ్రీ అనురాగ్ జయంతి కలెక్టర్ యాదాద్రి భువనగిరి , శ్రీ వి శేఖర్ రెడ్డి ఆర్డిఓ చౌటుప్పల్ , శ్రీమతి వీరాభాయ్ తహసీల్దార్ చౌటుప్పల్ లను కలిసి సర్పంచులు , సుర్వి మల్లేష్ గౌడ్ , గిర్కంటి నిరంజన్ గౌడ్ , కైరంకొండ స్వప్న అశోక్ , నందగిరి వెంకటేశం గౌడ్ , తంగేళ్ల వెంకటేశం , గంజి వనజ కృష్ణ, వివిధ గ్రామపంచాయతీల సర్పంచులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వినతి పత్రం పరిశీలించి త్వరలో స్మార్ట్ రేషన్ కార్డులపై గ్రామపంచాయతీల గ్రామాల పేర్లు వచ్చేలా ఏర్పాటు చేస్తామని అధికారులు తెలియజేయడం జరిగింది.

## మండల కేంద్రానికి నిధులు మంజూరు చేయండి

**స్థానికులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేత**



**నూతనకల్ అక్టోబర్ 14 ( వెలుతురు )**
నూతనకల్ మండల కేంద్రం అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని నూతనకల్ గ్రామ కాంగ్రెస్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు హైదరాబాద్ లో ఎమ్మెల్యే మందుల సామెల్ నివాసంలో వారిని కలిసి నూతనకల్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ముఖ్యంగా సూర్యాపేట దంతాలపల్లి ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించాలని, నూతనకల్ సెంటర్ లో బస్టాండ్ నిర్మించి ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి, మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను, తెలంగాణ మోడల్ స్కూల్ ను ఏర్పాటు చేయాలి. పై అభివృద్ధి పనులను మంజూరు చేసి మా గ్రామ అభివృద్ధికి సహకరించగలరని ఎమ్మెల్యేని వినయ పూర్వకంగా కోరారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు శాలువాతో ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి, పూజల సైదులు, జటంగి గణేష్ యాదవ్, బండపెల్లి చంద్రు, మహేష్ సతీష్ మధు కళ్యాణ్ రవి సంతోష్ జలంధర్ పాల్గొన్నారు.

## దుర్గాదేవికి పూజలు



**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 14:**
చౌటుప్పల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి నవరాత్రొత్సవాల సందర్భంగా బుధవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మెన్ వెన్ రెడ్డి సంధ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ బొబ్బిళ్ల మురళి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల ప్రతినిధులు పోలోజు శ్రీలత,నీరజ,చింతల కరుణ,మమత,రేవతి,అండాలు,రాణి తదితరులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు అలాగే ఆలయ కమిటీ సభ్యులు ఆవుల ఏసు,వర్కాల రవి,అరుణ పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 14:**
విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఆ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని సిటిజెన్ కో–ఆపరేటివ్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్ర కుమార్ విద్యార్థులకు సూచించారు. చౌటుప్పల్ లోని సిటిజన్ కోపరేటివ్ సొసైటీ బ్రాంచ్ లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 8 మంది విద్యార్థులకు ప్రతిభా అవార్డులను ఆయన చేతుల మీదుగా అందజేసి మాట్లాడారు. విద్యా ఉద్యోగాన్ని గౌరవాన్ని ఆత్మవిశ్వాసాన్ని సమాజంలో గుర్తింపును ఇస్తుందని తెలిపారు. సమాజంలో ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నందుకు అభినందించారు. కార్యక్రమంలో సిటిజన్ సొసైటీ మేనేజర్ పూర్ణయ్య, సిబ్బంది మహేష్, కళ్యాణి, కృష్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## అంగడిపేటలో ఘనంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి 8వ వార్షికోత్సవం

**అమ్మవారిని దర్శించుకున్న బీసీ నేతలు**

**చండూర్ వెలుతురు అక్టోబర్ 14:**
దేవి నవరాత్రుల శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట 5వ వార్డులో శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మవారి 8వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. ఈ పవిత్ర వేడుకల్లో భాగంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ మరియు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బూడిద మల్లికార్జున్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించి, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారి ఆశీస్సులు కోరారు. అనంతరం శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ కార్యనిర్వాహకులు అనంత చంద్రశేఖర్ గౌడ్ తమ ఉద్యమ సహచరులైన పానుగంటి విజయ్ మరియు బూడిద మల్లికార్జున్‌లను ఘనంగా శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, యూత్ అసోసియేషన్ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారి నామస్మరణతో అంగడిపేట ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.



## శ్రీదుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- గట్టుప్పల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమల్ల శ్రీశైలం గౌడ్
- భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమల్ల శ్రీశైలంగౌడ్
- శ్రీ దుర్గా దేవి నవరాత్రు ఉత్సవాలు వైభవంగా జరుపుకోవాలి: వీరమల్ల శ్రీశైలంగౌడ్

**గట్టుప్పల్ వెలుతురు అక్టోబర్ 14:**
శ్రీదుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని గట్టుప్పల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరమల్ల. శ్రీశైలంగౌడ్ ఆకాంక్షించారు బుధవారం మండల పరిధిలోని తెరటిపల్లి గ్రామంలో దుర్గాదేవి వద్ద ఆయన ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ఆయన అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ దుర్గాదేవి ఆశీస్సులతో గ్రామంలో ఉన్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రజలందరూ వైభవంగా జరుపుకోవాలని కోరారు.. గట్టుప్పల మండలం వ్యాప్తంగా ఉన్న ప్రజలందరు కూడా సుఖ సంతోషాల కోసం నా వంతుగా గణేష్ నవరాత్రి. శ్రీ దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు

## స్వచ్ఛ ఇంధనమే సుస్థిర అభివృద్ధికి మార్గం

### మంత్రి వివేక్ వెంకటస్వామి

అందరికీ అందుబాటు ధరలో స్వచ్ఛమైన ఇంధనం అందించడం, పునరుత్పాదక వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడమే సుస్థిర అభివృద్ధికి కీలకమని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ది మనోహర్ హోటల్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'వరల్డ్ స్టాండర్డ్స్ డే-2026' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి లక్ష్యం-7లో భాగంగా 'అందరికీ అందుబాటులో, స్వచ్ఛమైన ఇంధనం' అనే థీమ్‌తో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో బొగ్గు లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇతర పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని తప్పనిసరిగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇళ్లు, పరిశ్రమల పైకప్పులపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ స్వచ్ఛ ఇంధన పరిష్కారాలు నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలన్నారు. పరిశ్రమల అభివృద్ధికి, ఉత్పత్తుల నాణ్యతకు బీఐఎస్ ప్రమాణాలు ఎంతో కీలకమన్న మంత్రి.. తాను విశాఖ ఇండస్ట్రీస్ స్థాపించిన సమయంలో బీఐఎస్ ధ్రువీకరణ ఎంతగానో ఉపయోగపడిందని, అన్ని యూనిట్లలో ఒకే నాణ్యతను పాటించడానికి అది దోహదపడిందని తన అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. పారిశ్రామిక రంగంలో ఉత్పత్తుల నాణ్యతతో పాటే కార్మికుల భద్రతకు, సురక్షిత పని వాతావరణానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పరిశ్రమలకు సూచించారు. రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉపాధి కల్పిస్తున్న 'టామ్‌కామ్' (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, నియామక ప్రక్రియలకు సంబంధించి ధ్రువీకరణ విధానాన్ని రూపొందించే అవకాశాన్ని పరిశీలించాలని బీఐఎస్‌ను మంత్రి కోరారు. దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో సంస్థకు మరింత విశ్వసనీయత, పారదర్శకత పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్లు శ్రీకాంత్, పాల్గొన్నారు.

## చెర్లపల్లి కారాగారాన్ని సందర్శించిన సివిల్ సర్వీసెస్ అధికారులు



డాక్టర్ ఎం.సి.ఆర్. మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న అఖిల భారత, కేంద్ర సివిల్ సర్వీసుల అధికారుల బృందం బుధవారం చెర్లపల్లి కేంద్ర కారాగారాన్ని ఖైదీల వ్యవసాయ కాలనీ ని సందర్శించింది. ప్రత్యేక ఫౌండేషన్ కోర్సులో భాగంగా నిర్వహించిన ఈ పర్యటనలో 175 మంది అధికార శిక్షణార్థులు 60 మంది మహిళలు, 115 మంది పురుషులు 15 మంది అధ్యాపకులు కలిపి మొత్తం 190 మంది పాల్గొన్నారు. ఈ బృందంలో ఐఎఫ్ఓఎస్ 44, ఐపీఎస్ 20, ఐఆర్ఎస్ 39, ఐఎస్ఎస్ 34, ఐఈఎస్ 12, ఐఏ అండ్ ఏఎస్ 5, ఐఐఎస్ 5, ఐసీఏఎస్ 3, ఐఆర్ఎంఎస్ 4 ఇతర కేంద్ర సర్వీసులకు చెందిన ప్రతినిధులు ఉన్నారు. జైళ్ల పరిపాలన, భద్రతా ఏర్పాట్లు, ఖైదీల నిర్వహణ, దిద్దుబాటు చర్యలు సంస్కరణ కార్యక్రమాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. శిక్షణార్థులకు స్వాగతం పలికిన తెలంగాణ జైళ్ల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడారు. జైళ్లు కేవలం ఖైదీలను బంధించే వేదికలు మాత్రమే కాదని, వారిలో మానసిక మార్పు తీసుకువచ్చి సమాజంలో గౌరవప్రదమైన జీవితం గడిపేలా తీర్చిదిద్దే సంస్కరణ కేంద్రాలని స్పష్టం చేశారు. ఖైదీలకు ఎన్ఐఓఎస్ ద్వారా విద్య, జైలు ప్రాంగణంలో ఐటీఐ కళాశాల, పరిశ్రమల ద్వారా స్టీల్ ఫర్నిచర్, సబ్బులు, శానిటైజర్ల తయారీ, వడ్రంగం, పాడి పరిశ్రమ, ఇంధన విక్రయ కేంద్రాలలో ఉపాధి శిక్షణ ఇస్తున్న తీరును అధికారులకు వివరించారు. అనంతరం శిక్షణార్థులు ఖైదీల వ్యవసాయ కాలనీని సందర్శించి అక్కడ అమలవుతున్న ఓపెన్ జైలు వధానంపై అవగాహన పంచుకున్నారు. కారాగారాల్లో అమలవుతున్న విద్యా, వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను, మానవ హక్కులు సంస్కరణలకు ఇస్తున్న ప్రాధాన్యతను అధికారులు విశేషంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్డీ సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ కె. సుకుమార్, జైళ్ల శాఖ డిఐజి డాక్టర్ డి. శ్రీనివాస్, చెర్లపల్లి జైలు సూపరింటెండెంట్ జి. ప్రమోద్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు



**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 14:**
లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా ఆధ్వర్యంలో, బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది, లైన్స్ కుటుంబ సభ్యులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని , బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు, మహిళలకు చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగదాల రమేష్ పావని చేతుల మీదుగా మహిళలకు బహుమతులు అందించడం జరిగింది, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎయిట లయన్ ఎండి అతహర్ పాషా, చార్టెడ్ ప్రెసిడెంట్ mjf లయన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా గారు, సెక్రటరీ ఎయిట లయన్ దాచేపల్లి రాజుగారు, ట్రెజరర్ ఎయిట లయన్ బత్తిని రఘు గారు, ఫాస్ట్ ప్రెసిడెంట్ ఎయిట లయన్ మోగదాల రమేష్ గారు, పాస్ట్ ప్రెసిడెంట్ ఎయిట లయన్ కొసనం రామ్ రెడ్డి గారు, ఎయిట లయన్ చింతల ప్రభాకర్ రెడ్డి గారు, ఎయిట లయన్ వనం రాజుగారు, ఎయిట లయన్ పోలోజు రాజుగారు, పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదములు.



## బీఎల్ఓలకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి

- బతుకమ్మ పండుగ వేళ కూడా బీఎల్ఓలకు ఇబ్బందులా
- అధికారుల తీరుపై చిరంజీవి ఆగ్రహం

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 14 :**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ డబ్బులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ కోఆర్డినేషన్ సెంటర్ (టి యు సి సి) నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. బీఎల్ఓలతో పని చేయించుకుంటూ వారికి చెల్లించాల్సిన డబ్బులను సకాలంలో చెల్లించకపోవడం వల్ల వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ సమయంలోనైనా ఆడపడుచులు సంతోషంగా పండుగ జరుపుకునే పరిస్థితులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పని చేయించుకున్న తర్వాత పారితోషికాలు చెల్లించకుండా బీఎల్ఓలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు .బీఎల్ఓలు తమ విధులను నిర్వహిస్తున్నప్పటికీ, వారికి రావాల్సిన డబ్బుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడటం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బీఎల్ఓలకు న్యాయం చేయాలి. లేనిపక్షంలో వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేపట్టాల్సి వస్తుందని చిరంజీవి హెచ్చరించారు. ఇట్లు: చిరంజీవి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ కోఆర్డినేషన్ సెంటర్ (టి యు సి సి)

## ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శిగా ఆడప లలిత

- జహీరాబాద్‌లో నియామక పత్రం అందజేసిన జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి
- కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా: ఆడప లలిత.



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**
ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన సంస్థాగత నియామకాల్లో భాగంగా హైదరాబాద్ జిల్లాకు చెందిన ఆడప లలితను జాతీయ కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన ఆడప లలిత మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, జాతీయ ఉపాధ్యక్షుడు మ్యాతారి ప్రవీణ్, న్యాయ సలహాదారు జంబుల నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తూనే, అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కార్మికులతో కలిసి పనిచేస్తూ ఐఎన్‌టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షుడు మ్యాతారి ప్రవీణ్ మాట్లాడుతూ యూనియన్‌ను మరింత పటిష్టం చేసేందుకు భవిష్యత్తులో మరిన్ని నియామకాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూర్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయాల సోయగం.. దాండియా నృత్యాల సందడి!

- మహిళల ఉత్సాహంతో పీవీఆర్ గార్డెన్‌లో పండుగ శోభ
- రాక్ డ్యాన్స్ స్టూడియో ఈవెంట్స్ టీమ్ నిర్వహణపై ప్రముఖుల ప్రశంసలు

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్, 14:**
సంప్రదాయ నృత్యాలు.. ఉత్సాహభరితమైన అడుగులు.. మహిళల కేరింతలు.. ఆటపాటలతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని పీవీఆర్ గార్డెన్ కళకళలాడింది. దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని రాక్ డ్యాన్స్ స్టూడియో ఈవెంట్స్ టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా దాండియా కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని దాండియా నృత్యాలతో సందడి చేయడంతో ప్రాంగణమంతా పండుగ వాతావరణం నెలకొంది.

**మహిళల భాగస్వామ్యంతో విజయవంతం**
మెగా దాండియా కార్యక్రమానికి మహిళలు, యువతుల నుంచి విశేష స్పందన లభించింది. సంప్రదాయ దుస్తులు ధరించి దాండియా నృత్యాల్లో పాల్గొన్న మహిళలు తమ ఉత్సాహంతో వేడుకలకు మరింత కళ తీసుకొచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించిన మహిళా సోదరీమణులందరికీ రాక్ డ్యాన్స్ స్టూడియో ఈవెంట్స్ టీమ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

**నిర్వాహకుల కృషికి అభినందనలు**
ఈ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాథోడ్ సుభాష్ మాట్లాడుతూ.. మెగా దాండియా కార్యక్రమాన్ని ఎంతో అద్భుతంగా నిర్వహించిన రాక్ డ్యాన్స్ స్టూడియో ఈవెంట్స్ టీమ్‌ను అభినందించారు. డ్యాన్స్ మాస్టర్స్ వినోద్, పూల్ సింగ్ ప్రత్యేక



శ్రద్ధతో కార్యక్రమాన్ని విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు, యువతులకు ఆహ్లాదాన్ని అందించే కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు.

**మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం**
ప్రముఖ సంఘసేవకులు బండి సుధాకర్ మాట్లాడుతూ.. మెగా దాండియా కార్యక్రమానికి మహిళా సోదరీమణుల నుంచి లభించిన ఆదరణ ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. వారి సహకారం, ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరిన్ని వైవిధ్యభరితమైన కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇలాంటి సాంస్కృతిక వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు



సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని అన్నారు.

**ప్రముఖుల హాజరుతో ప్రత్యేక ఆకర్షణ**
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెంకటేశ్వర షాపింగ్ మాల్ అధినేత నీల వెంకటేశం గుప్తా, ఎస్ఐ వినయ్ కుమార్, పీవీఆర్ గార్డెన్ అధినేత పురుషోత్తం రెడ్డి, డాక్టర్ సీతారామరాజు, నారాయణ, డాక్టర్ రాజ్ కుమార్ (ఎండీ), బండి సుధాకర్ తదితరులు హాజరయ్యారు. వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, మహిళా ప్రతినిధులు, డ్యాన్స్ మాస్టర్లు పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు. మహిళల ఉత్సాహభరితమైన భాగస్వామ్యం, నిర్వాహకుల సమన్వయం, ప్రముఖుల హాజరుతో మెగా దాండియా కార్యక్రమం విజయవంతమైంది. ఈ వేడుకలు జహీరాబాద్ పట్టణంలో నవరాత్రి సంబరాలకు మరింత శోభను తీసుకొచ్చాయి.

# గుంతలమయంగా ప్రధాన రహదారులు

- ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్న వైనం!
- తాండూర్, మొగుడంపల్లి, కోహీర్ రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి
- బీజేపీ 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రవణ్ డిమాండ్

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని తాండూర్, మొగుడంపల్లి, కోహీర్ ప్రధాన రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని బీజేపీ 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రవణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ సమస్యపై ఆర్ అండ్ బీ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించిన ఆయన.. ఆయా రహదారుల దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలతో నిండిన రహదారులపై ప్రయాణం ప్రజలకు నిత్య సమస్యగా మారిందని పేర్కొన్నారు. వాహనదారులు ఇబ్బందులు పడటమే కాకుండా, రోడ్డు ప్రమాదాలు జరిగే ముప్పు కూడా పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రజల భద్రత అధికారులకు పట్టదా?**



ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారుల మరమ్మతులపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని అప్పం శ్రవణ్ కోరారు. తాండూర్, మొగుడంపల్లి, కోహీర్ రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలని, మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను జాప్యం చేయకుండా పరిష్కరించి, వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

### సర్పంచ్ అర్షద్ జమా పటేల్ కృషి

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**
గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటు లోకి తీసుకురావడమే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం మొగుడంపల్లి మండలం మాడిగి గ్రామ సర్పంచ్ అర్షద్ జమా పటేల్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలోని బోరు నుంచి నేరుగా నీటి కనెక్షన్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ప్రజలకు ఇబ్బందులు కలిగించే ప్రధాన సమస్యల్లో ఒకటి. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల అవసరాలను గుర్తించిన సర్పంచ్ అర్షద్ జమా పటేల్, ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ముందడుగు వేశారు. బోరు నుంచి నీటిని సరఫరా చేసేందుకు కనెక్షన్లు ఏర్పాటు చేయడంతో గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడనుంది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో భాగంగా తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ తీసుకున్న చొరవపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వడంఅభినందనీయమని పేర్కొంటు న్నారు. గ్రామాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని గ్రామస్తులు అభిప్రా యపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో జహీరాబాద్ కీర్తి..

- యూసుఫ్ షరీఫ్‌కు కలాం అవార్డు!
- కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**
జాతీయ స్థాయిలో జహీరాబాద్‌కు గుర్తింపు లభించింది. పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు, వరల్డ్ హ్యూమన్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఆల్ ఇండియా అధ్యక్షుడు (మీడియా విభాగం) మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎంటర్‌ప్రెన్యూర్స్ అండ్ అచీవ్‌మెంట్ అవార్డు--2026కు ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

**మానవ హక్కుల పరిరక్షణకు గుర్తింపు**
మానవ హక్కుల పరిరక్షణ, బాధితులకు న్యాయం అందించడం, అణగారిన వర్గాలకు అండగా నిలవడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి యూసుఫ్ షరీఫ్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం విశేషం. ఆయన జహీరాబాద్ ఫ్రూట్ మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పురస్కార ప్రదానం**



భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని అబ్దుల్ కలాం గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులను ఈ సందర్భంగా సత్కరించారు.

**జహీరాబాద్‌లో హర్షాతిరేకం**
యూసుఫ్ షరీఫ్‌కు జాతీయ స్థాయి పురస్కారం లభించడంపై జహీరాబాద్, సంగారెడ్డి జిల్లాతో పాటు తెలంగాణలోని పలువురు సామాజిక సంస్థల ప్రతినిధులు, మానవ హక్కుల కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.

## దుర్గా భవాని మండపం వద్ద అన్న ప్రసాద వితరణ

### అన్న ప్రసాద వితరణ దాత పోల నవీన్ కుమార్



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 14**
: కౌడిపల్లి మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయం వద్ద భవాని యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గ భవాని మండపం వద్ద ఈరోజు పోల నవీన్ కుమార్ అన్న ప్రసాద వితరణ చేశాడు. పోల నవీన్ కుమార్ మాట్లాడుతూ మొన్నటి వరకు వినాయకుడి ఆశీస్సులతో వినాయకుడి మండపాల వద్ద అన్న ప్రసాద వితరణ చేశానని ఇప్పుడు దుర్గ భవాని ఆశీస్సులతో ఇక్కడ అన్న ప్రసాద వితరణ చేయడం నా పూర్వజన్మ సుకృతం అని అది నా అదృష్టంగా భావిస్తానని తెలిపారు. మన ఊరిలో దుర్గా భవాని మాత విగ్రహాన్ని పెట్టి తొమ్మిది రోజులు చాలా నిష్టతో పూజించి 9వ రోజు నిమజ్జనం చేయడం జరుగుతుందని ఇంత నిష్టతో తొమ్మిది రోజులు దుర్గామాత మాల ధరించి పూజలు చేస్తున్న భవాని యూత్ సభ్యులను అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవులపల్లి ఉప సర్పంచ్ మంగళపర్తి శ్రీకాంత్, మాసన్నగారి హరీష్, గిరి, దశరథ్ గౌడ్ మరియు భవాని యూత్ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలిగా పాలడుగు సునీత

**గుండాల, సెప్టెంబర్ 14(వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో బుధవారం నూతన మహిళా సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సంఘ బంధాల లీడర్లు, సభ్యులు కలిసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలిగా పాలడుగు సునీత, జనరల్ సెక్రటరీగా చంద్రగిరి మంజుల, ఉపాధ్యక్షురాలిగా పాలడుగు మంజుల, సహాయ కార్యదర్శిగా మహంకాళి దానమ్మ, కోశాధికారిగా లగ్గాని రేణుక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ, మహిళల ఐక్యతకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని సూచించారు.ంఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంగ జయసుధ సతీష్‌రెడ్డి, గ్రామ సంఘ బంధాల లీడర్లు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.80 వేల అప్పు వివాదం.. వ్యక్తి దారుణ హత్య !

కరకగూడెం : ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో తలెత్తిన వివాదం ఓ వ్యక్తి హత్యకు దారితీసింది. తనకు రావాల్సిన అప్పు విషయంలో గత కొంతకాలంగా కొనసాగుతున్న గొడవల నేపథ్యంలో ఓ వ్యక్తిని హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి, న్యాయస్థానానికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలవాల నగరం గ్రామానికి చెందిన బాదావత్ విజయ తన కుమారుడు బాదావత్ రవిచంద్రను కరకగూడెంకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య చేశాడని ఆరోపిస్తూ ఈ నెల 12న కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మృతుడు రవిచంద్ర నిందితుడు ఇమ్రాన్‌కు రూ. 80 వేలు అప్పుగా ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో నిందితుడు ఇమ్రాన్ పథకం ప్రకారం రవిచంద్రను మోటార్‌సైకిల్ పై ఎక్కించుకొని కలువల నాగారం గ్రామ శివారుకు తీసుకెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అక్కడ రవిచంద్ర పై దాడి చేసి, బెల్టుతో మెడకు బిగించి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 12న నిందితుడు మహమ్మద్ ఇమ్రాన్‌ను అతని ఇంటి వద్ద పోలీసులు అరెస్ట్ చేసి కేసును దర్యాప్తు చేసి కేసును చేధించారు. అలాగే హత్యకు ఉపయోగించిన మోటార్‌సైకిల్‌తో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచి, జ్యుడీషియల్ రిమాండ్ తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

# ఫీడర్ కాలువ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేస్తాం..

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి
- చొల్లేరు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

**యాదగిరిగుట్ట ,అక్టోబర్ 14 వెలుతురు**
చెరువులకు నీటి సరఫరా పునరుద్ధరించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించడమే తమ లక్ష్యమని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం, చోల్లేరు గ్రామ పరిధిలోని కాన్లకుంట చెరువుకు నీటిని అందించే ఫీడర్ కాలువను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను, గ్రామంలోని చెరువు, ఫీడర్ ఛానల్ కు సంబంధించిన పలు అంశాలను గ్రామ సర్పంచ్ చిన్నం మమత శ్రీనివాస్ కలెక్టర్ కు వివరించారు. ఫీడర్ కాలువకు గండి పడటంతో చెక్‌డ్యామ్ నుంచి వచ్చే నీరు చెరువులకు చేరకుండా వృథాగా వాగులోకి వెళ్లిపోతున్న పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. కాలువ పునరుద్ధరణకు అవసరమైన రూ. 125.45 లక్షల నిధులను డి ఎం ఎఫ్ టి కింద మంజూరు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. యాదగిరిగుట్ట నుంచి వాగు ద్వారా ప్రవహించే నీరు చోల్లేరు గ్రామంలోని చెక్‌డ్యామ్ నుంచి ఫీడర్ కాలువ ద్వారా ఐదు గొలుసుకట్టు చెరువులకు చేరాల్సి ఉంది. చోల్లేరు గ్రామంలోని కాన్లకుంట, మల్లిగూడెం గ్రామంలోని దేవతల చెరువు, మహబూబపేట గ్రామంలోని పటేల్ చెరువు, మోటకొండూరు గ్రామంలోని ఊర చెరువు, చింతల చెరువులకు ఈ కాలువ ద్వారా నీరు అందాల్సి ఉంది. అయితే, ఫీడర్ కాలువ దెబ్బతినడంతో నీరు చెరువులకు చేరకుండా తిరిగి వాగులో కలుస్తూ వృథా అవుతోంది. ఈ ఫీడర్ కాలువ పునరుద్ధరణ ద్వారా చోల్లేరు, మల్లిగూడెం, మహబూబపేట, మోటకొండూరు గ్రామాల పరిధిలోని ఐదు గొలుసుకట్టు చెరువులకు నీటి సరఫరా మెరుగుపడటంతో పాటు మొత్తం సుమారు 292.20 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం



కలగనుంది.
ఈ సందర్భంగా అక్కడికి పెద్ద సంఖ్యలో హాజరైన రైతులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి, ఫీడర్ కాలువ పునరుద్ధరణ పనులను త్వరితగతిన చేపట్టాలని కోరారు. రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, కాలువ పునరుద్ధరణకు అవసరమైన నిధులను డి ఎం ఎఫ్ టి కింద మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఫీడర్ కాలువ పునరుద్ధరణ పనులు పూర్తయితే ఐదు గొలుసుకట్టు చెరువులకు నీరు చేరి, ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగడంతో పాటు భూగర్భ జలమట్టాలు పెరిగే అవకాశం ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్‌కు రైతులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిన్నం మమతా శ్రీనివాస్ ఉపసర్పంచ్ గవ్వల భాస్కర్, మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య , మాజీ జెడ్పిటిసి తోటకూరి అనురాధ బీరయ్య , మాజీ ఎంపీటీసీ కోక్కలకొండ అరుణ, మహబూబ్ పేట సర్పంచ్ ఆరె రమేష్ గౌడ్ , మాజీ సర్పంచ్ ఆరె మల్లేష్ గౌడ్, తోటకూరి యాదయ్య, కౌకుంట్ల రామచంద్రారెడ్డి, కోక్కలకొండ దేవేందర్, చిన్నం శ్రీకాంత్, బాలరాజు , దేవదాసు, ప్రవీణ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మహిళా రైతుకు జాతీయ స్థాయి గుర్తింపు

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన మహిళా రైతు విజయ సేంద్రీయ వ్యవసాయంతో సత్తా చాటుతున్నారు. కేవలం ఎకరం భూమిలోనే 14 రకాల కూరగాయలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ పలువురు రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి అనుకూల సాగు పద్ధతులతో విజయ సాధిస్తున్న విజయకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే మహిళా కిసాన్ దివస్ అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. ఈ నెల 15న నిర్వహించనున్న కార్యక్రమంలో విజయకు అవార్డును అందజేయనున్నారు. పరిమిత భూమిలో విభిన్న రకాల కూరగాయలను సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేస్తూ విజయ సాధించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

**-రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**- రైతులకు శాస్త్రీయ సూచనలు, సలహాలు అందించాలి**

**పంటలు ఎండి పోకుండా విద్యుత్ సరఫరా చేయాలి**





**జగిత్యాల, వెలుతురు అక్టోబర్ 14 :** జగిత్యాల జిల్లాలో వ్యవసాయ శాఖ ఆత్మ అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ సౌజన్యంతో నిర్వహించిన కిసాన్ మేళా--2026 కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రైతులకు అందించాల్సిన సహాయ సహకారాల పై వారు వివరించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ రంగంలో ఎదురయ్యే పరిస్థితులను రైతులు ముందుగానే అంచనా వేసుకొని పంటల సాగుపై ప్రణాళిక రూపొందించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా ఉన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే ప్రత్యామ్నాయ పంటలను కూడా పరిశీలించాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని పేర్కొన్నారు. నీటి లభ్యత, నేల స్వభావం, పంటకు అయ్యే పెట్టుబడి, మార్కెట్ లో ఉన్న డిమాండ్ ను పరిగణనలోకి తీసుకొని పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా రైతులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.

రైతులకు సాగు సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి తగిన పరిష్కార మార్గాలను సూచించడం లో వ్యవసాయ శాఖ అధికారులు చురుకైన పాత్ర పోషించాలని మంత్రి సూచించారు. రైతులకు అందుబాటులో ఉండి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వివరించాలని, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన పద్ధతులపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో వస్తున్న ఆధునిక మార్పులను అందిపుచ్చుకొని, శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా, వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాల మేరకు ప్రత్యామ్నాయ పంటల సాగును పరిశీలించాలని తెలిపారు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు పంటల సాగులో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన పద్ధతులను అనుసరించడం ద్వారా పంట నష్టాల ముప్పును తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణకు సంబంధించిన సూచనలు అందించాలని తెలిపారు. రైతులు తమ భూముల స్వభావం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటలను సాగు చేయాలని పేర్కొన్నారు. పంటలు ఎండిపోకుండా, రైతులకు సాగు సమయంలో ఇబ్బందులు కలగకుండా అవసరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయానికి అవసరమైన సేవలు సకాలంలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని తెలిపారు. కిసాన్ మేళాల ద్వారా రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనల ఫలితాలు, ఆధునిక సాగు విధానాలపై అవగాహన కల్పించడం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకొని, వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఉత్తమ రైతులకు మరియు ఉత్తమ వ్యవసాయ అధికారులకు సన్మానం చేశారు. అనంతరం అధికారులు ప్రజా ప్రతినిధులు రైతులు ప్రతిజ్ఞ చేశారు.

**కిసాన్ మేళాలో వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన**

కిసాన్ మేళాలో భాగంగా వ్యవసాయ రంగంలో చేపడుతున్న పరిశోధనలు, నూతన సాగు పద్ధతులు, ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన వివిధ స్టాళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఆయా స్టాళ్లలో ప్రదర్శించిన వ్యవసాయ పద్ధతులు, పంటల నిర్వహణ విధానాలు, రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానం గురించి సంబంధిత నిపుణులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివిధ పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాల్సిన విధానం, నీటి వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల సంరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను నిపుణులను అడిగి తెలుసుకొని, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టాలని సూచించారు. కిసాన్ మేళా ద్వారా రైతులకు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై అవగాహన పెంపొందించడంతో పాటు, వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సమాచారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### సభ్యులతో కలిసి

# బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క

**బతుకమ్మ పాటలకు స్టెప్పులేసిన మహిళా పోలీసులు**

**విధి నిర్వహణలో ఉంటూనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వేడుకలో భాగస్వామ్యం**

**మహిళా పోలీసుల ఉత్సాహం.. బతుకమ్మ సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణ**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉత్సాహంగా సాగాయి. భగీరథ కమ్యూనిటీ సభ్యులతో కలిసి రాష్ట్ర మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మహిళా పోలీసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విధి నిర్వహణలో భాగంగా ఖాకీ యూనిఫాంలో ఉన్న మహిళా పోలీసులు మంత్రి సీతక్కతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా స్టెప్పులేస్తూ సంబరాల్లో సందడి చేశారు. విధి నిర్వహణలో ఉంటూనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమకున్న మమకారాన్ని చాటుకున్నారు. ఖాకీ యూనిఫాంలో మహిళా పోలీసులు బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ వేడుకల్లో పాల్గొన్న దృశ్యాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ మహిళలు పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంలో మహిళా పోలీసులు భాగస్వాములు కావడం ఈ వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. మంత్రి సీతక్క మహిళలతో కలిసి బతుకమ్మ ఆడటంతో లోయర్ ట్యాంక్‌బండ్‌లో పండుగ వాతావరణం మరింత సందడిగా మారింది. పాటలు, ఆటలు, పూల పరిమళాల మధ్య బతుకమ్మ సంబరాలు ఆహ్లాదకరంగా సాగాయి.

### దసరా తర్వాత రెండు లక్షల

# మందితో భారీ బహిరంగ సభ

- **దక్షిణాదిలో రెండు రాష్ట్రాల్లో సభలకు అధిష్ఠానం నిర్ణయం**
- **బీజేపీ పాలనలో సంపన్నులకే మేలు.. సామాన్యులకు ఒరిగిందేమీ లేదు : పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్**



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:** దసరా తర్వాత రెండు లక్షల మందితో భారీ మార్చ్‌తోపాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. దక్షిణాదిలోని రెండు రాష్ట్రాల్లో భారీ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించిందన్నారు. రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ సభ నిర్వహణకు సూచించారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన ఆయన పలు రాజకీయ అంశాలపై స్పందించారు. మహిళా జర్నలిస్టులను అవమానించారంటూ రాహుల్ గాంధీపై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాహుల్ గాంధీ షూ లేస్ కట్టారని గుర్తుచేశారు. బీజేపీ మొలకెత్తడానికి వాజ్‌పేయి, సుష్మా స్వరాజ్ కారణమని, వారు లేకుంటే ఆ పార్టీ మొలకెత్తేదా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాస్తామంటే ఎలా అని నిలదీశారు. బీజేపీ మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎవరు పోరాడినా తమ మద్దతు ఉంటుందన్నారు. సీజేపీ, ఇండియా కూటమి ఎవరి పోరాటం వారు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో భాషకు గౌరవం ఉండాలని సూచించారు.

**23న పట్టభద్రుల ఎన్నికలపై కీలక సమావేశం**

15 ఏళ్లుగా ఆర్టీసీలో ఎన్నికలు జరగకపోవడంతోనే నిర్వహించామని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. గెలుపోటములతో సంబంధం లేకుండా కార్మికుల శ్రేయస్సుకు కట్టుబడి ఉన్నామన్నారు. పట్టభద్రుల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఎంసీహెచ్‌ఆర్‌డీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్పొరేషన్ పదవుల విషయంలో కష్టపడిన వారికి న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే ఆలస్యమవుతోందన్నారు. దసరా నాటికి పదవుల భర్తీ జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఫామ్‌హౌస్‌లపై దాడులు మా అభిమతం కాదు**

ఎర్రవల్లిలోని 45 ఎకరాలు ఎవరి కబ్జాలో ఉన్నాయనే అంశంపై విచారణ జరుగుతోందని మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. కవిత తన కుటుంబం గురించి ఎక్కువగా వాస్తవాలు మాట్లాడుతున్నారని, ఆమె చెబుతున్న విషయాలన్నీ ప్రజలకు అర్థమవుతున్నా యని వ్యాఖ్యానించారు. ఫామ్‌హౌస్‌లపై దాడులు చేయడం తమ అభిమతం కాదని స్పష్టం చేశారు. నీతిమంతులమని చెప్పుకొంటున్న వారి గురించి అసలు విషయాలు ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతోనే ఫామ్‌హౌస్ సందర్శన చేపట్టామన్నారు. అయోధ్య రామమందిరానికి భూమిపూజ చేసింది రాజీవ్ గాంధీయేనని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. రాముడికి, రాజకీయాలకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు.

**బీజేపీ పాలనలో దేశం ప్రమాదంలో పడింది**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ చేసిన తప్పిదాలు ఆధారాలతో సహా బయటపడుతున్నాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. 2029 ఎన్నికల్లో ఎవరు ఓడిపోబోతున్నారో ప్రజలే చెబుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దేశం ప్రమాదంలో పడిందని విమర్శించారు. ఆ పార్టీ పాలనలో సామాన్యులకు ఒరిగిందేమీ లేదని, సంపన్నులకు మాత్రం లక్షల కోట్ల రూపాయల రుణాలు మాఫీ చేశారని ఆరోపించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ మంచి మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నిర్వహిస్తున్న సింగరేణి గర్జనకు అర్థం లేదన్నారు. సింగరేణి కార్మికులకు ఫలాలు అందిస్తున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఎల్‌నినో అనేది ప్రకృతి ప్రభావమని, దానిపైనా రాజకీయాలు చేయడం సరికాదన్నారు. పదేళ్లపాటు కేసీఆర్ ప్రతి అంశాన్నీ రాజకీయం చేశారని విమర్శించారు.

# విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- **అచ్చంపేట అభివృద్ధికి రూ.128 కోట్లతో విద్యుత్ పనులు**
- **ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి అవసరాలపై అప్రమత్తంగా ఉండాలి**
- **విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912, పవర్ అంబులెన్స్ సేవలు**
- **అచ్చంపేటలో విద్యుత్ ఉద్యోగుల సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**అచ్చంపేట, వెలుతురు అక్టోబర్ 14 :** విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ శాఖలో పనిచేసే ఉద్యోగి నుంచి సీఎండీ వరకు ప్రతి ఒక్కరినీ ఒక కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకుం టోందని చెప్పారు. ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు దేశంలోనే తొలిసారిగా విద్యుత్ శాఖ ఉద్యోగులందరికీ రూ.కోటి ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించినట్లు వెల్లడించారు. బుధవారం అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన విద్యుత్ ఉద్యోగుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.78 కోట్ల విలువైన పనులు చేపట్టామని, తాజాగా మరో రూ.75 కోట్ల విలువైన పనులకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. విద్యుత్ శాఖ పరిధిలోనే సుమారు రూ.128 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయని వివరించారు. విద్య, వైద్యం, రహదారులు, వసతి గృహాలు, వ్యవసాయం, సంక్షేమ రంగాల్లోనూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్ర మాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ప్రజల అవసరాలను గుర్తించి, ఆయా శాఖల మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా రని ప్రశంసించారు. నియోజకవర్గంలో మరో పెద్ద సబ్‌స్టేషన్‌తోపాటు 132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై సంబంధిత అధికారులను పరిశీలన చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అధికారుల నివేదిక ఆధారంగా అవసరాన్ని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**విద్యుత్ ఉద్యోగులకు కోటి రూపాయల ప్రమాద బీమా**

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. విధులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ లైన్‌మన్ కుటుంబానికి కోటి రూపాయల బీమా పరిహారం అందించిన విషయాన్ని గుర్తుచేశారు. గతంలో ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలకు పరిమిత స్థాయిలోనే ఆర్థిక సహాయం అందేదని, ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకూడదనే ఉద్దేశంతో కోటి రూపాయల ప్రమాద బీమా సదుపాయాన్ని ప్రవేశపెట్టామని వివరించారు. మొదట విద్యుత్ శాఖలో ఈ విధానాన్ని అమలు చేసి, అనంతరం రాష్ట్రంలోని ఇతర శాఖల ఉద్యోగులకూ ప్రమాద బీమా సదుపాయాన్ని వర్తింపజేసినట్లు తెలిపారు. ఉద్యోగుల ప్రమోషన్లు, ఇతర సంక్షేమ అంశాలపైనా ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. ఉద్యోగులు కూడా అదే నిబద్ధతతో పనిచేస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్తు మనిషికి ప్రాణవాయువుతో సమానమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, సేవారంగం.. ఇలా ప్రతి రంగం విద్యుత్తుపైనే ఆధారపడి ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని, వారు అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలుస్తున్నారని కొనియాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటంతోపాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎక్కడైనా చిన్నపాటి నిర్లక్ష్యం జరిగినా అది ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తుందని అన్నారు. ఉద్యోగుల పనితీరును ప్రభుత్వం గుర్తిస్తుందని, అదే సమయంలో బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోదని స్పష్టం చేశారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి**

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో తాగునీరు, వ్యవసాయ అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల విద్యుత్ వినియోగం పెరిగే అవకాశం ఉందని, మరోవైపు వ్యవసాయం, తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడవచ్చని తెలిపారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కార్యాచరణ రూపొందించాలన్నారు. తెలంగాణలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని, భవిష్యత్తులోనూ అవసరాలు మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నిరంతర విద్యుత్ సరఫరా చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత ఏడాది కాలంగా ట్రాన్స్‌మిషన్ లైన్లను ఆధునికీకరించడం, సామర్థ్యాన్ని పెంచడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా విద్యుత్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేశామని వివరించారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడటంలో ఈ చర్యలు కీలకంగా నిలిచాయని తెలిపారు. భవిష్యత్తులోనూ ఎల్‌నినో ప్రభావం కొనసాగినంతకాలం అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సరఫరా వ్యవస్థపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

**1912కు ఫోన్ చేస్తే తక్షణ స్పందన**

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రజలు 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా పవర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ వాహనాల్లో అవసరమైన సాంకేతిక సిబ్బంది, పనిముట్లు, ఇతర సామగ్రిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించిన సమస్యలు సహా అత్యవసర విద్యుత్ అంతరాయాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ఈ వాహనాలు ఉపయోగపడుతున్నాయని వివరించారు. ప్రజలకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వానికి, విద్యుత్ శాఖకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఉద్యోగులు నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే విమర్శలకు సరైన సమాధానమని పేర్కొన్నారు.

**ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం**

విద్యుత్ ఉద్యోగులకు ఏవైనా సమస్యలు ఉంటే ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని భట్టి విక్రమార్క సూచించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఉద్యోగుల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, వ్యవసాయం, తాగునీటి సరఫరా, విద్యుత్ వ్యవస్థ పటిష్ఠత వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, విద్యుత్ శాఖ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియా స్కిల్స్ 2026-27 రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

- **షాంఘై వరల్డ్ స్కిల్స్ 2026 పోటీల్లో టాప్-10లో నిలిచిన భారత్...**
- **ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మన జట్టు సభ్యుల సమావేశంపై నెలకొన్న ఆసక్తి**




**న్యూఢిల్లీ, వెలుతురు 14 అక్టోబర్ 2026 :** సంస్థల నుంచి, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి వచ్చిన అనేక అభ్యర్థనల దృష్ట్యా ఇండియా స్కిల్స్ పోటీ 2026-27 రిజిస్ట్రేషన్ గడువును కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన మంత్రిత్వశాఖ (ఎంఎస్‌డీఈ) అక్టోబర్ 19, 2026 వరకు పొడిగించింది. షాంఘైలో జరిగిన వరల్డ్ స్కిల్స్ పోటీల్లో టీమిండియా అద్భుతమైన ప్రతిభను కనబరిచి, ఆరు రజత పతకాలు, 20 ఎక్సలెన్స్ పతకాలను గెలుచుకుని ప్రపంచవ్యాప్తంగా 10వ స్థానాన్ని దక్కించుకుంది. స్కిల్ పోటీలపై మళ్లీ ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఫలితం వచ్చింది. దీన్ని మరింత బలోపేతం చేస్తూ... అక్టోబర్ 9, 2026న న్యూఢిల్లీలోని అధికారిక నివాసం 7-లోక్ కల్యాణ్ మార్గ్‌లో వరల్డ్ స్కిల్స్ షాంఘై-2026 పోటీల్లో పాల్గొన్న టీమిండియా సభ్యులకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆతిథ్యమిచ్చి సత్కరించారు. భారతదేశ నైపుణ్య యువత సాధించిన విజయాలను అభినందించటమే కాక, దేశాభివృద్ధిలో వృత్తిపరమైన నైపుణ్యాల ప్రాముఖ్యతను ఈ సమావేశం స్పష్టం చేసింది. ఈ సమావేశం అనంతరం ఇండియా స్కిల్స్ 2026-27 రిజిస్ట్రేషన్లను మళ్లీ ప్రారంభించాలని విద్యాసంస్థలు, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి మంత్రిత్వశాఖకు అభ్యర్థనలు అందాయి. యువత నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, జాతీయ స్థాయిలో పోటీ పడటానికి, ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు అవకాశం కల్పించేలా రిజిస్ట్రేషన్ గడువును అక్టోబర్ 19, 2026 వరకు పెంచారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో పోటీపడేందుకు, నైపుణ్యాలను ప్రదర్శించటానికి, యువతలో ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తూ... ఇండియా స్కిల్స్ 2026-27 కోసం ఇప్పటివరకు సుమారు 4.0 లక్షల రిజిస్ట్రేషన్లు అయ్యాయి. ఇంతకుముందు రిజిస్టర్ చేసుకోలేకపోయిన అర్హులైన అభ్యర్థులు ఇప్పుడు స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ (ఎస్ఐడీహెచ్) ద్వారా అక్టోబర్ 19, 2026లోపు దరఖాస్తులను పూర్తి చేసుకునే అవకాశం ఉంది. ఎంఎస్‌డీఈ ఆధ్వర్యంలో జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) అమలు భాగస్వామిగా తయారీ, ఇంజనీరింగ్, నిర్మాణం, డిజిటల్ టెక్నాలజీలు, సృజనాత్మక పరిశ్రమలు, సేవా రంగాలకు సంబంధించి మొత్తం 63 పరిశ్రమ-ఆధారిత నైపుణ్య విభాగాలను ఇండియా స్కిల్స్ 2026-27 కవర్ చేస్తుంది. జిల్లా, జోనల్, రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ స్థాయిల ద్వారా సుస్థిర మార్గాన్ని ఈ పోటీ అందిస్తుంది. పునః ప్రారంభించిన దరఖాస్తు గడువుకు సంబంధించిన సమాచారాన్ని ప్రచారం చేయాలని, రిజిస్ట్రేషన్లను సులభతరం చేయాలని... రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాం తాల పరిపాలనా వ్యవస్థలు, పారిశ్రామిక శిక్షణ సం స్థలు, పాలిటెక్నిక్స్, కళాశాలలు, నైపుణ్య శిక్షణ సంస్థలు, పరిశ్రమల భాగస్వాములను మంత్రిత్వ శాఖ కోరింది. షాంఘైలో జరిగిన వరల్డ్ స్కిల్స్ - 2026 పోటీల్లో టీమిండియా 10వ స్థానాన్ని సాధించింది. ఈ పోటీల్లో ఆరు రజత పతకాలు, 20 ఎక్సలెన్స్ పతకాలను గెలుచుకుంది. ఈ పోటీల్లో భారత్ నుంచి అత్యధికంగా 70 మంది పోటీదారులు, మొత్తం 63 నైపుణ్య విభాగాల్లో ప్రతిభను చాటారు. గతంలో 2024లో ఫ్రాన్స్‌లోని లియాన్ వేదికగా జరిగిన వరల్డ్ స్కిల్స్ పోటీల్లో భారత్ 13వ స్థానంలో ఉండగా... ఈసారి మెరుగైన ప్రదర్శనతో 10వ స్థానంలో నిలిచింది. వీరి అద్భుతమైన ప్రదర్శన... నైపుణ్యాలు, ప్రత్యేక శిక్షణ, నిరంతర సన్నద్ధత యువ భారతీయులకు అద్భుతమైన అవకాశాలను సృష్టిస్తుందనే అంశంపై దేశవ్యాప్తంగా దృష్టిని ఆకర్షించింది.

# తెలంగాణ అస్తిత్వానికి బతుకమ్మ ప్రతీక

- **కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు**
- **కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 14 :** తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, సాంస్కృతిక వైభవానికి బతుకమ్మ ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ ప్రాంగణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీత పాల్గొని బతుకమ్మకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు బతుకమ్మను ఇంటి మహాలక్ష్మిగా భావించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారని పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ విశిష్టతను చాటిచెప్పేలా వేడుకలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో అక్టోబర్ 14 నుంచి 17వ తేదీ వరకు ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి బతుకమ్మ సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలు, యువత, మహిళా ఉద్యోగులు, మహిళలు, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లోని కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలని కోరారు. వివిధ శాఖల వారీగా బతుకమ్మ సంబరాల నిర్వహణకు రోజువారీ షెడ్యూల్ రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.





## ఇండో-జపాన్ స్నేహబంధానికి

# కళలు వారధిగా నిలవాలి

- వెంకట్ గడ్డం, హిరోకో తకయామా కళాకృతులు అద్భుతం
- స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇండో-జపాన్ కళా ప్రదర్శనను సందర్శించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:** కళలు, సంస్కృతి రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. హైదరాబాద్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ కళాకారుడు వెంకట్ గడ్డం, జపాన్‌కు చెందిన ప్రముఖ కళాకారిణి హిరోకో తకయామా సాన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కళా ప్రదర్శనను బుధవారం మంత్రి సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన పెయింటింగ్స్, వస్త్రాలపై రూపొందించిన కళాకృతులు, ఇతర కళారూపాలను ఆసక్తిగా వీక్షించి, కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. వెంకట్ గడ్డం, హిరోకో తకయామా సంయుక్తంగా ఇండో--జపాన్ స్నేహబంధాన్ని కళల ద్వారా చాటిచెప్పడం అభినందనీయమన్నారు. భారతీయ, జపనీస్ కళలు, సంస్కృతులను ఒకే వేదికపై పరిచయం చేస్తూ రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. ఇటీవల జపాన్‌లోని హిరోషిమా, మియోషి నగరాల్లోనూ ఇలాంటి కళా ప్రదర్శనలు నిర్వహించి ఇండో--జపనీస్ కళా సంస్కృతిని ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. వెంకట్ గడ్డం చిన్నప్పటి నుంచే కళలపై అసాధారణ ప్రతిభ కనబరిచారని మంత్రి కొనియాడారు. కేవలం ఆరేళ్ల వయసులోనే గిన్నిస్ బుక్‌లో రికార్డులు నమోదు చేయడం ఆయన ప్రతిభకు నిదర్శనమన్నారు. పదేళ్ల వయసులోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కళాభవన్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం విశేషమన్నారు. వెంకట్ తన చిత్రాల్లో సంతోషం, బాధ సహా విభిన్న భావోద్వేగాలను అద్భుతంగా ప్రతిబింబిస్తున్నారని, ప్రజల మనసులను ఆకట్టుకునేలా కళాకృతులను రూపొందిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఐదేళ్ల కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన ఆయన సృజనాత్మక ప్రయాణానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. జపాన్‌కు చెందిన కళాకారిణి హిరోకో తకయామా భారతీయ కళాకారులతో కలిసి కళా ప్రదర్శనలో భాగస్వామి కావడం ఇరు దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడికి దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు. బుద్ధుడి ఆలోచనలు, స్ఫూర్తితో రూపొందించిన కళాకృ తులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని తెలిపారు. కళలకు భాష, దేశాల సరిహద్దులు అడ్డుకావని, భావోద్వేగాలు, సృజనాత్మకత ద్వారా ప్రజలను అనుసంధానించవచ్చని అన్నారు. ఈ ప్రదర్శనలో పెయింటింగ్స్, వస్త్రాలపై రూపొందించిన కళాకృతులు, కవితలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. కళాభిమానులు ఈ ప్రదర్శనను సందర్శించి కళాకారుల సృజనాత్మకత ను ఆస్వాదించాలని మంత్రి అన్నారు. ఈ సందర్భంగా కళాకారులు వెంకట్ గడ్డం, హిరోకో తకయామాతో మంత్రి ముచ్చటించి, వారి సృజనాత్మక ఆలోచనలు, ఇండో-జపాన్ కళా సంబంధాలపై చర్చించారు. కళ లు, సంస్కృతి స్నేహబంధాలను పెంపొందిస్తాయన్నారు





## ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ సందర్భంగా

# బతుకమ్మ, కళారూపాల ప్రదర్శన



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14, 2026:** తెలంగాణ రాష్ట్ర సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని, పర్యాటక ప్రాధాన్యతను విస్తృతంగా ప్రచారం చేసే లక్ష్యంతో, తెలంగాణ రాష్ట్ర పర్యాటక మరియు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 14, 2026న హైదరాబాద్‌లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత్--వెస్టిండీస్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి ప్రతీకగా నిలిచే పూల పండుగ బతుకమ్మ వైభవాన్ని క్రికెట్ స్టేడియంలో ప్రదర్శించారు. బతుకమ్మ సంప్రదాయాలు, వేడుకల ద్వారా రాష్ట్ర ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపును క్రికెట్ అభిమానులకు పరిచయం చేశారు. ప్రకృతితో మానవ సంబంధం, సామూహిక భాగస్వామ్యం, తెలంగాణ ప్రజల జీవన విధానంలో అంతర్భాగమైన సాంస్కృతిక విలువలను బతుకమ్మ పండుగ ప్రతిబింబించింది. స్థానిక కళాకారులు ప్రదర్శించిన సంప్రదాయ జానపద కళారూపాలు ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చాయి. తెలంగాణకు ప్రత్యేకమైన జానపద సంగీతం, నృత్యాలు, సాంప్రదాయ కళాప్రదర్శనలను ఆవిష్కరించారు. క్రీడా ఉత్సాహానికి సాంస్కృతిక వైభవాన్ని జోడిస్తూ, క్రికెట్ అభిమానులకు క్రీడలు, సంస్కృతి, వినోదం కలగలిసిన ప్రత్యేక అనుభూతిని అందించారు. పర్యాటక ప్రచార కార్యక్రమంలో భాగంగా, మ్యాచ్ విరామ సమయంలో తెలంగాణ పర్యాటక శాఖ రూపొందించిన పర్యాటక ప్రచార చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ చిత్రంలో రాష్ట్రంలోని చారిత్రక కోటలు, వారసత్వ కట్టడాలు, ప్రసిద్ధ దేవాలయాలు, ప్రకృతి సౌందర్యంతో అలరించే పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేక సాంస్కృతిక అనుభవాలు, బతుకమ్మ పండుగ వైభవం వంటి విశేషాలను ప్రదర్శించారు. తెలంగాణలోని వైవిధ్యభరితమైన పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, రాష్ట్రాన్ని సందర్శించేలా పర్యాటకులను ప్రోత్సహించడం ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశ్యం. అంతర్జాతీయ స్థాయి క్రీడా వేదికను సాంస్కృతిక మరియు పర్యాటక ప్రచారానికి వినియోగించడం ద్వారా తెలంగాణ రాష్ట్ర సంప్రదాయాలు, వారసత్వ సంపదను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రేక్షకులకు పరిచయం చేయడానికి పర్యాటక శాఖ కృషి చేసింది. పర్యాటక ప్రచారానికి వినూత్న వేదికలను వినియోగిస్తూ రాష్ట్ర పర్యాటక రంగానికి మరింత గుర్తింపు తీసుకురావాలనే శాఖ లక్ష్యాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలంగాణ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ రాష్ట్ర జీవన సంప్రదాయాలను ప్రోత్సహించడం, స్థానిక కళాకారులకు గుర్తింపు కల్పించడం, చరిత్ర, వారసత్వం, ఆధ్యాత్మికత, ప్రకృతి సౌందర్యం, సాంస్కృతిక వైవిధ్యంతో కూడిన పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పడం కొనసాగిస్తోంది.



# నెట్‌ఫ్లిక్స్‌లో భారీ లేఆఫ్స్

- ఒకేసారి 1,000 మంది ఉద్యోగాలకు కోత!
- 2022 తర్వాత ఇదే అతిపెద్ద తొలగింపుల ప్రక్రియ
- మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 6 శాతం మందిపై ప్రభావం
- అమెరికాలో నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ధరలు పెంపు




**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 14 :** ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీగా ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. సుమారు 1,000 మంది ఉద్యోగాలకు కోత పెట్టాలని నిర్ణయించింది. 2022 తర్వాత సంస్థ చేపడుతున్న అతిపెద్ద తొలగింపులు ఇవే. కంపెనీ వృద్ధి వేగం తగ్గడం, ప్రేక్షకుల కోసం ఇతర స్ట్రీమింగ్ సంస్థల నుంచి పోటీ పెరుగుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' కథనం వెల్లడించింది. ఈ తొలగింపులతో నెట్‌ఫ్లిక్స్ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు ఆరు శాతం మంది ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ప్రొడక్ట్, టెక్నాలజీ, న్యాయ, మానవ వనరుల విభాగాల్లో ఎక్కువ కోతలు ఉండనున్నట్లు సమాచారం. సంస్థ సహ-సీఈవోలు టెడ్ సరాండోస్, గ్రెగ్ పీటర్స్ బుధవారం ఉద్యోగులకు ఈ నిర్ణయాన్ని ఈమెయిల్ ద్వారా తెలియజేశారు.

**వృద్ధి వేగం పెంచుకోవడంపై ఒత్తిడి**

సబ్‌స్క్రిప్షన్ల ద్వారా వచ్చే ఆదాయానికే పరిమితం కాకుండా ప్రకటనలు, లైవ్ కార్యక్రమాలు, గేమింగ్ రంగాల్లోకి విస్తరించాలని నెట్‌ఫ్లిక్స్ ప్రయత్నిస్తోంది. అయితే ఆశించిన స్థాయిలో వృద్ధి సాధించలేకపోతున్నట్లు సంస్థ యాజమాన్యం అంగీకరించింది. సెప్టెంబర్ చివర్లో బ్లూమ్‌బెర్గ్ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన టెడ్ సరాండోస్.. కంపెనీ వృద్ధి తాను కోరుకున్నంత వేగంగా లేదని వ్యాఖ్యానించారు. వృద్ధి వేగాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**ఏడాదిలో 40 శాతానికి పైగా పడిపోయిన షేరు**

నెట్‌ఫ్లిక్స్ షేర్ల పనితీరు కూడా ఒత్తిడికి గురవుతోంది. బిజినెస్ ఇన్‌సైడర్ కథనం ప్రకారం.. గత ఆరు నెలల్లో కంపెనీ షేర్లు 30 శాతానికి పైగా, ఏడాది కాలంలో 40 శాతానికి పైగా పడిపోయాయి. మరోవైపు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించేందుకు స్ట్రీమింగ్ సంస్థల మధ్య పోటీ తీవ్రమవుతోంది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను ప్రేక్షకులు మొత్తం 97 బిలియన్ గంటలపాటు వీక్షించారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 2 శాతం ఎక్కువ. అయినప్పటికీ, వీక్షణ గణాంకాలను ఏడాదికి ఒకసారి మాత్రమే వెల్లడించాలని సంస్థ ఇటీవల నిర్ణయించింది. గతంలో ఈ వివరాలను ఏడాదికి రెండుసార్లు ప్రకటించేది.

**అమెరికాలో పెరిగిన సబ్‌స్క్రిప్షన్ ధరలు**

మరోవైపు, అమెరికాలో నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్ ధరలను కూడా పెంచింది. మార్చిలో ప్రకటనలు లేని స్టాండర్డ్ ప్లాన్ నెలవారీ ధరను 17.99 డాలర్ల నుంచి 19.99 డాలర్లకు పెంచింది. ప్రకటనలతో కూడిన ప్లాన్ ధరను 7.99 డాలర్ల నుంచి 8.99 డాలర్లకు సవరించింది. 2022లో తొలిసారిగా దశాబ్దానికి పైగా కాలంలో సబ్‌స్క్రైబర్ల సంఖ్య తగ్గడంతో నెట్‌ఫ్లిక్స్ ఉద్యోగాల కోత చేపట్టింది. ఆ తర్వాత మళ్లీ ఇంత పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. గత ఏడాది చివరి నాటికి సంస్థలో సుమారు 16,000 మంది పూర్తికాల ఉద్యోగులు ఉన్నారు.

## తెలంగాణ జౌళి రంగానికి

# అంతర్జాతీయ సాంకేతిక సహకారం

- యూకే సంస్థలతో రెండు కీలక ఒప్పందాలు -- మంత్రి తుమ్మల
- యూకేలోని హడర్స్ ఫీల్డ్ విశ్వవిద్యాలయం, టెక్స్ టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు
- ప్రపంచస్థాయి సాంకేతికతతో తెలంగాణ జౌళి రంగానికి కొత్త దిశ -మంత్రి తుమ్మల



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:** తెలంగాణ రాష్ట్రంలో చేనేత, జౌళి రంగాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానిస్తూ, టెక్నికల్ టెక్స్ టైల్స్ రంగాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ప్రముఖ విద్యా, పరిశ్రమ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం రెండుకీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా తెలంగాణలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం, నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయడం, పరిశ్రమలకు అవసరమైన శిక్షణను అందించడం, ఈ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

**హడర్స్‌ఫీల్డ్ విశ్వవిద్యాలయంతో తొలి అవగాహన ఒప్పందం...**

యునైటెడ్ కింగ్‌డమ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హడర్స్‌ఫీల్డ్, తెలంగాణ ప్రభుత్వ చేనేత, జౌళి శాఖ మధ్య కుదిరిన తొలి అవగాహన ఒప్పందం ద్వారా రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పరిశోధన, అభివృద్ధికి సహకారం అందించనున్నారు. ఉమ్మడి విద్యా కార్యక్రమాల నిర్వహణకు అవకాశాలను అన్వేషించడం, విజిటింగ్ అకడమిక్ సిబ్బంది నియామకం, అధ్యాపకులు, విద్యార్థుల పరస్పర మార్పిడిని ప్రోత్సహించడం వంటివి ఈ ఒప్పందం యొక్క ముఖ్యోద్దేశం అని మంత్రి పేర్కొన్నారు. అలాగే, టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పురోగతికి అవసరమైన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదపడనుందని అన్నారు.

**టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో రెండో ఒప్పందం...**

యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన టెక్స్‌టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (౧జశీజు)తో తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని చేనేత, జౌళి, హస్తకళల విభాగం రెండో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 2026 అక్టోబర్ 14న కుదిరిన ఈ ఒప్పందం ద్వారా టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో వృత్తి విద్య, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయనున్నారని మంత్రి తెలిపారు. ప్రత్యేకంగా 3ఐ వీవింగ్, కాంపోజిట్ మెటీరియల్స్ వంటి ఆధునిక సాంకేతిక వస్త్రాల తయారీ, పరిశోధన, శిక్షణపై దృష్టి సారించనున్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను గుర్తించి, వాటికి అనుగుణంగా శిక్షణ కార్యక్రమాలను రూపొందించడం, అంతర్జాతీయ నైపుణ్య ప్రమాణాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం అన్నారు.

**అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్యాభివృద్ధి...**

టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగంలో ప్రపంచస్థాయి నైపుణ్య ప్రమాణాలను తెలంగాణలో అమలు చేసే అవకాశాలను పరిశీలించడంతో పాటు, పరిశ్రమలు, శిక్షణ సంస్థల మధ్య సమన్వయాన్ని పెంపొందించనున్నారు. తద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ పొందిన నిపుణులను తయారు చేయడం, భారతదేశానికి అంతర్జాతీయంగా పోటీతత్వం కలిగిన టెక్స్‌టైల్ కార్మిక శక్తిని అభివృద్ధి చేయడం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. తెలంగాణలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, అంతర్జాతీయ విద్యా సంస్థలు, పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యాలను సమర్థంగా వినియోగించుకుని రాష్ట్రంలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, జౌళిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సభ్యసాచి ఘోష్, యార్క్ షైర్ మేయర్ యొక్క బిజినెస్ అడ్వైసర్ టెక్నికల్ టెక్స్ టైల్స్ ప్రొఫెసర్ గోస్వామి, టెక్స్ టైల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎండి అజీజ్ మరియు జౌళిశాఖ అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఇంధనమే సుస్థిర అభివృద్ధికి మార్గం

- నాణ్యతా ప్రమాణాలతోనే పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక ప్రగతి
- సౌర విద్యుత్, పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలి
- పరిశ్రమల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి
- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:** అందరికీ అందుబాటు ధరలో స్వచ్ఛమైన ఇంధనాన్ని అందించడంతోపాటు పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడం సుస్థిర అభివృద్ధికి కీలకమని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి అన్నారు. సౌర విద్యుత్ వంటి స్వచ్ఛ ఇంధన పరిష్కారాలు నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని ది మనోహర్ హోటల్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ స్టాండర్డ్స్ డే--2026 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం--7లో భాగంగా అందరికీ అందుబాటు ధరలో స్వచ్ఛమైన ఇంధనాన్ని అందించడంపై దృష్టి సారించినట్లు మంత్రి తెలిపారు. పరిశ్రమలు, ప్రభుత్వాలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ఇంధన సామర్థ్యాన్ని పెంచడం, పర్యావరణహిత సాంకేతికతలను ప్రోత్సహించడం ద్వారా మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. తమ పరిశ్రమల్లోనూ సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. భవనాల పైకప్పులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇళ్లలో, తోటల్లోనూ సోలార్ దీపాలను వినియోగించాలని సూచించారు. భవిష్యత్తులో బొగ్గు లభ్యత తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్, ఇతర పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛ ఇంధన పరిష్కారాలు అందుబాటు ధరలో ఉండటంతోపాటు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు. పరిశ్రమల అభివృద్ధి, ఉత్పత్తుల నాణ్యత, వినియోగదారుల విశ్వాసాన్ని పెంపొందించడంలో బీఐఎస్ ప్రమాణాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. వైద్య వృత్తి నుంచి పరిశ్రమల రంగంలోకి వచ్చిన తర్వాత విశాఖ ఇండస్ట్రీస్ స్థాపన సమయంలో బీఐఎస్ ధ్రువీకరణ పొందిన అనుభవాన్ని గుర్తుచేశారు. ఉత్పత్తులకు ధ్రువీకరణ ఇచ్చే ముందు బీఐఎస్ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు సంస్థకు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. కొత్తగా కర్మాగారాలను ఏర్పాటు చేసిన ప్రతిసారీ ధ్రువీకరణ పొందడం ద్వారా అన్ని యూనిట్లలో ఒకే రకమైన నాణ్యతను కొనసాగించగలిగామని వివరించారు. తెలంగాణలో తయారైన ఉత్పత్తి, పశ్చిమ బెంగాల్‌లో తయారైన ఉత్పత్తి ఒకే నాణ్యతతో ఉండేందుకు ప్రమాణాల అమలు దోహదపడిందని చెప్పారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా బీఐఎస్ ప్రమాణాలను నిరంతరం ఆధునీకరిస్తుండటం అభినందనీయమని తెలిపారు. నాణ్యతను సంస్థల సంస్కృతిగా, ప్రమాణాలను బలంగా భావించి ప్రతి పరిశ్రమ ముందుకు సాగాలని సూచించారు. పారిశ్రామిక రంగంలో నాణ్యతతోపాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి అన్నారు. సురక్షితమైన పని వాతావరణం, నాణ్యమైన పరికరాలు, బాధ్యతాయుతమైన ఉత్పత్తి విధానాలు కార్మికుల రక్షణకు, ఉత్పాదకత పెంపునకు దోహదపడతాయని అన్నారు. నాణ్యతా ప్రమాణాలు, భద్రతా నిబంధనలను పరిశ్రమలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనను అభినందించిన మంత్రి.. బీఐఎస్ ధ్రువీకరణ గుర్తుల ప్రాధాన్యం, నాణ్యమైన ఉత్పత్తుల ఎంపికపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా రాష్ట్ర యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. అంతర్జాతీయ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య, భాషా శిక్షణ అందించి యువతను ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని వివరించారు. టామ్‌కామ్ శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, విదేశీ నియామక ప్రక్రియలకు సంబంధించి ధ్రువీకరణ విధానాన్ని రూపొందించే అవకాశాలను బీఐఎస్ పరిశీలించాలని కోరారు. దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో సంస్థ విశ్వసనీయత పెరగడంతోపాటు నియామక ప్రక్రియల్లో నాణ్యత, పారదర్శకతకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రమాణాల సంస్థలు సమష్టిగా కృషి చేసి నాణ్యతను సంస్కృతిగా, ప్రమాణాలను బలంగా, సుస్థిరతను ఉమ్మడి బాధ్యతగా మార్చుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఐఎస్ హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్లు శ్రీకాంత్, సవిత, జాయింట్ డైరెక్టర్ వివేక్ ప్రకాశ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బి.పి. పాండు రంగారావుతో పాటు పలువురు పరిశ్రమల ప్రతినిధులు, విద్యావేత్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## భగీరథ కమ్యూనిటీ సభ్యులతో
# బతుకమ్మ ఆడిన మంత్రి సీతక్క

- బతుకమ్మ పాటలకు స్టెప్పులేసిన మహిళా పోలీసులు
- విధి నిర్వహణలో ఉంటూనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వేడుకల్లో భాగస్వామ్యం
- మహిళా పోలీసుల ఉత్సాహం.. బతుకమ్మ సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణ



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 14:**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్‌బండ్‌లో ఉత్సాహంగా సాగాయి. భగీరథ కమ్యూనిటీ సభ్యులతో కలిసి రాష్ట్ర మంత్రి సీతక్క బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ పండుగ ఆనందాన్ని పంచుకున్నారు.

ఈ వేడుకల్లో మహిళా పోలీసులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విధి నిర్వహణలో భాగంగా ఖాకీ యూనిఫాంలో ఉన్న మహిళా పోలీసులు మంత్రి సీతక్కతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలకు ఉత్సాహంగా స్టెప్పులేస్తూ సంబరాల్లో సందడి చేశారు. విధి నిర్వహణలో ఉంటూనే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల తమకున్న మమకారాన్ని చాటుకున్నారు.

ఖాకీ యూనిఫాంలో మహిళా పోలీసులు బతుకమ్మ పాటలకు నృత్యం చేస్తూ వేడుకల్లో పాల్గొన్న దృశ్యాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ మహిళలు పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మహిళలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. సంప్రదాయాలను కాపాడుకుంటూ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంలో మహిళా పోలీసులు భాగస్వాములు కావడం ఈ వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది.

మంత్రి సీతక్క మహిళలతో కలిసి బతుకమ్మ ఆడటంతో లోయర్ ట్యాంక్‌బండ్‌లో పండుగ వాతావరణం మరింత సందడిగా మారింది. పాటలు, ఆటలు, పూల పరిమళాల మధ్య బతుకమ్మ సంబరాలు ఆహ్లాదకరంగా సాగాయి.




# ముక్కోణపు సమరం!

### హామీల అమలు.. ఆర్థిక సవాళ్ల మధ్య అధికార కాంగ్రెస్
### ప్రభుత్వ వైఫల్యాలే అస్త్రంగా బీఆర్ఎస్ పోరుబాట
### ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు బీజేపీ వ్యూహాలు
### స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా మూడు పార్టీల ఎత్తులు పైఎత్తులు

**హైదరాబాద్, వెలుతురు:**

తెలంగాణ రాజకీయాల్లో ముక్కోణపు పోరు రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. అధికారాన్ని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్, కోల్పోయిన పట్టును తిరిగి సాధించేందుకు బీఆర్ఎస్, రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు బీజేపీ వ్యూహ ప్రతివ్యూహాలతో ముందుకు సాగుతున్నాయి.ఓవైపు పాలనాపరమైన సవాళ్లు, ఎన్నికల హామీల అమలు అధికార కాంగ్రెస్‌కు పరీక్షగా మారగా.. మరోవైపు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. సంక్షేమం, అభివృద్ధి, ప్రజా సమస్యలే ప్రధాన అస్త్రాలుగా మూడు పార్టీలు రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తున్నాయి. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో బలాన్ని నిరూపించుకునేందుకు ఎవరికి వారు సన్నద్ధమవుతున్నారు.

### హామీల అమలే కాంగ్రెస్‌కు అసలు పరీక్ష

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంపై దృష్టి సారించింది. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి హామీలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తోంది. అయితే గత ప్రభుత్వం చేసిన అప్పులు, వాటిపై వడ్డీల భారం నడుమ కొత్త సంక్షేమ పథకాలకు నిధులు సమీకరించడం సవాలుగా మారింది. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యత సాధించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికితోడు పార్టీలో అంతర్గత విమర్శలు, విపక్షాల నుంచి ఎదురవుతున్న రాజకీయ దాడులను తిప్పికొట్టాల్సి ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాల నేపథ్యంలో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.

### పట్టు కోసం బీఆర్ఎస్ పునరుజ్జీవన యత్నాలు

అధికారం కోల్పోయిన తర్వాత క్షేత్రస్థాయిలో తిరిగి పట్టు సాధించడమే లక్ష్యంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ముందుకు సాగుతోంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో జాప్యం, రైతు సమస్యలు, భూ పంచాయతీలను ప్రధాన అంశాలుగా చేసుకుని ప్రభుత్వాన్ని నిలదీస్తోంది. శాసనసభలోనూ, వీధుల్లోనూ వరుస నిరసనలతో అధికార పక్షంపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలో నిరుద్యోగం, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. మరోవైపు పార్టీ నేతల వలసలను అడ్డుకోవడం, శ్రేణుల్లో మనోధైర్యం నింపడం, పార్టీని క్షేత్రస్థాయి నుంచి పునర్నిర్మించుకోవడం బీఆర్ఎస్ ముందున్న ప్రధాన సవాళ్లుగా మారాయి.

### ప్రత్యామ్నాయ స్థానం కోసం బీజేపీ ప్రయత్నాలు

రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు బీజేపీ సొంత కార్యాచరణతో ముందుకెళ్తోంది. ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేస్తూ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించేందుకు ప్రయత్నిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, నిరుద్యోగ సమస్యలపై శాసనసభ ముట్టడి వంటి ఆందోళనలతో క్షేత్రస్థాయిలో నిరసనలకు దిగుతోంది. హిందూత్వ, అభివృద్ధి అంశాలను తన రాజకీయ వ్యూహంలో భాగంగా చేసుకుంటోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బలాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా కేంద్ర నేతల పర్యటనలు, సంస్థాగత కార్యక్రమాలపై దృష్టి సారించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించడం ఆ పార్టీ ముందున్న ప్రధాన సవాలుగా కనిపిస్తోంది.

### స్థానిక పోరుతో సత్తాకు పరీక్ష

మూడు ప్రధాన పార్టీల రాజకీయ వ్యూహాలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కీలకంగా మారనున్నాయి. ఆరు గ్యారెంటీల అమలు, అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తుండగా.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరోవైపు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదిగి గ్రామీణ ప్రాంతాల్లోనూ బలాన్ని విస్తరించుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. పాలనాపరమైన సవాళు„ హామీల అమలు, విపక్షాల నిరసనలు, పార్టీల అంతర్గత సమీకరణల మధ్య తెలంగాణ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు, పార్లమెంట్ పరిణామాల నేపథ్యంలో మూడు పార్టీల మధ్య రాజకీయ పోరు మరింత ఉధృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై
# పోస్టుకార్డు ఉద్యమం

### హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు వెంటనే మంజూరు చేయాలి
### ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమం కొనసాగిస్తాం: అవ్వారి భాస్కర్



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 14:**

జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, సంక్షేమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు, టీయూడబ్ల్యూజే ఢిల్లీ యూనిట్ ఇన్‌చార్జి అవ్వారి భాస్కర్ డిమాండ్ చేశారు.

బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గల గురజాడ హాలులో నిర్వహించిన టీయూడబ్ల్యూజే ఢిల్లీ యూనిట్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులందరూ పోస్టుకార్డుల ద్వారా తమ సమస్యలను, డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహించడం బాధాకరమని ఆయన అన్నారు. సొంత రాష్ట్రాన్ని విడిచి ఢిల్లీ కేంద్రంగా ఎండ, వాన, కాలుష్యాన్ని లెక్కచేయకుండా రాత్రింబవళ్లు విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు.

జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం తక్షణమే హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు. గౌరవ వేతనాలు సహా జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి జర్నలిస్టులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం లభించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, సంక్షేమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే పోస్టుకార్డు ఉద్యమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అవ్వారి భాస్కర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) ఢిల్లీ అధ్యక్షులు నాగిల్ల వెంకట్, ప్రధాన కార్యదర్శి మేక గోపికృష్ణ, కోశాధికారి కొన్నోజు రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, అశోక్ రెడ్డి, సలహాదారులు ముక్కామల సతీష్, కార్యదర్శి నాగరాజు, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

# పంట వ్యర్థాలను కాల్చొద్దు.. పశుగ్రాసంగా వాడాలి

- అవసరమైతే కలెక్టర్లు వానాకాలం పశుగ్రాసాన్ని కొనుగోలు చేయాలి
- శాటిలైట్ డేటాతో ఒకేసారి 70లక్షల మంది రైతులకు మట్టి నమూనా పరీక్షల ఫలితాలు అందించే విషయంపై జర్మనీ ప్రతినిధులతో సమాలోచనలు
- ప్రతి 12 రోజులకు రైతులందరికి ఎరువుల వినియోగంపై సమగ్ర సమాచారం
- జర్మనీ ప్రతినిధులు వివరించిన డిజిటల్ వ్యవసాయ సాంకేతికతను అధ్యయనం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం
- కొత్త సాంకేతికత యొక్క కచ్చితత్వం, విశ్వసనీయతను శాస్త్రీయంగా పరిశీలించాలి - మంత్రి తుమ్మల
- వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో సమన్వయానికి ఆదేశం
- ఎల్.నినో నేపథ్యంలో అనుసరించాల్సిన ప్రణాళికపై అధికారులతో మంత్రి సమీక్ష

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:**

సచివాలయంలో బుధవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల పరిధి లోని ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పంటల పరిస్థితి, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద పరికరాల పంపిణీ, గోదాముల నిర్మాణాల



పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎల్.నినో ప్రభావం నేపథ్యంలో రానున్న యాసంగి సీజన్‌లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గే అవకాశం ఉండటంతో పాటు, పశుగ్రాసం కొరత ఏర్పడే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు చేపట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గత రబీ సీజన్‌లో దాదాపు 18 లక్షల ఎకరాల్లో రైతులు పంట వ్యర్థాలను కాల్చినట్లు పేర్కొన్న మంత్రి, ఈ ఖరీఫ్ పంటల కోతల అనంతరం పంట వ్యర్థాలను కాల్చకుండా, వాటిని పశుగ్రాసంగా వినియోగించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని వ్యవసాయశాఖ కార్యదర్శిని ఆదేశించారు. అవసరమైతే ఈ ఖరీఫ్ పశుగ్రాసాన్ని కొనుగోలు చేసి రైతులకు అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించాలని తెలిపారు.

### మంత్రి తుమ్మలతో ACRAT కంపెనీ ప్రతినిధుల సమావేశం ...

అనంతరం సచివాలయంలో ACRAT ప్రతినిధులు, జర్మనీ ప్రతినిధులు మంత్రి తుమ్మలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శాటిలైట్ డేటా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా నేలలోని పోషకాల లభ్యతను అంచనా వేసే సాంకేతికతను జర్మనీ ప్రతినిధులు మంత్రి తుమ్మలకి వివరించారు. ఈ విధానం ద్వారా నేలలో నత్రజని (నీ), భాస్వరం (భా), పొటాషియం (ఖ)తో పాటు ఇతర పోషకాల లభ్యతను విశ్లేషించి, పంట అవసరాలకు అనుగుణంగా రైతులకు ఎరువుల వినియోగంపై సిఫారసులు అందించవచ్చని తెలిపారు.

ఈ సాంకేతికత ద్వారా రైతులు ఏ ఎరువులను అధికంగా వినియోగిస్తున్నారు, ఏ పోషకాలు తక్కువగా అందుతున్నాయి అనే విషయాలను తెలుసుకోవచ్చని ప్రతినిధులు వివరించారు. ప్రతి 12 రోజులకు ఒకసారి ఎరువుల వినియోగానికి సంబంధించిన సమగ్ర నివేదికను 70 లక్షల మంది రైతులకు ఒకేసారి సమాచారం అందించే అవకాశం ఉందని తెలిపారు.

### సమతుల్య ఎరువుల వినియోగమే లక్ష్యం...

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, ప్రస్తుతం రైతులు ప్రధానంగా యూరియా, ఎన్‌పీకే ఎరువుల వినియోగంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నారని పేర్కొన్నారు. పంట అవసరాలకు అనుగుణంగా సమతుల్య ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగాన్ని తగ్గించే దిశగా ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు.

"సాంప్రదాయ పద్ధతుల్లో భౌతికంగా మట్టి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించడానికి సమయం పడుతుంది. సాంకేతికత ద్వారా నేలలోని పోషకాల స్థితిని వేగంగా అంచనా వేసి రైతులకు అవసరమైన సమాచారం అందించే అవకాశం ఉంటే, అటువంటి సాంకేతికతను వినియోగించుకోవాలి. అయితే, దాని కచ్చితత్వం, విశ్వసనీయతను శాస్త్రీయంగా పరిశీలించాలి" అని మంత్రి పేర్కొన్నారు.

ఈ సాంకేతికతను రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ కార్యదర్శిని ఆదేశించారు. రైతులకు సకాలంలో ఎరువుల వినియోగంపై సమగ్ర సమాచారం అందేలా చూడాలని తెలిపారు. దీనివల్ల అవసరానికి మించి ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో పాటు, నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, సాగు వ్యయాన్ని తగ్గించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

### వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో సమన్వయం...

ఈ సాంకేతికత సాధ్యాసాధ్యాలను శాస్త్రీయంగా పరిశీలించేందుకు జర్మనీ ప్రతినిధులతో వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ మేరకు ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి, సాంకేతికత పనితీరు, కచ్చితత్వం, రాష్ట్రంలోని వివిధ నేలలు, పంటలకు దాని అనువర్తనంపై అధ్యయనం చేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి జానయ్యను ఆదేశించారు. డిజిటల్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు శాస్త్రీయ సమాచారాన్ని వేగంగా చేరవేయాలని, సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి తుమ్మల అధికారులకు సూచించారు.

## పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని
# బాహుబలి మోటార్లు ప్రారంభించిన మంత్రి జూపల్లి

- ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతాం
- చివరి ఆయకట్టుకు సాగునీరందిస్తాం
- గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది
- రూ.8 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు?

**నాగర్‌కర్నూల్ జిల్లా, వెలుతురు అక్టోబర్ 14:**

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన రెండు భారీ బాహుబలి మోటార్లను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఈ మోటార్ల ద్వారా నార్లాపూర్ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పూర్తి చేయకుండానే.. దీన్ని జాతికి అకితం చేశారని, కానీ కాలువలు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్, ఇతర పనులను గత ప్రభుత్వం చేపట్టలేదని విమర్శించారు. ప్రాజెక్టును గత పాలకులు పూర్తిచేసి ఉంటే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల ద్వారా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉన్నా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం చేసిందని ధ్వజమెత్తారు.

మహాత్మాగాంధీ-కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.60 లక్షల ఎకరాలు, నెట్టెంపాడు ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, భీమా ప్రాజెక్టు ద్వారా 2 లక్షల ఎకరాలు, కోయిలాసాగర్ ప్రాజెక్టు కింద 50 వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉందని తెలిపారు. ఇన్ని లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాలమూరు రైతాంగం ప్రయోజనాల కంటే రాజకీయ ప్రచారానికే బీఆర్ఎస్ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని అన్నారు.

రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల అప్పుల కుప్పగా మార్చిన గత పాలకులు, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో ప్రజలకు వివరించాలని నిలదీశారు. రైతాంగానికి సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుతం ప్రాజెక్టుల పురోగతిపై అవగాహన లేకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం మేరకు సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల వారీగా సమస్యలను గుర్తించి, పనుల పురోగతిని సమీక్షిస్తూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడం, వ్యవసాయానికి అవసరమైన నీటిని అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యేనారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.





# విదేశీ విద్య కోసం బీసీ, ఈబీసీ విద్యార్థులకు మరో అవకాశం

- దరఖాస్తు గడువు అక్టోబర్ 31 వరకు పొడిగింపు
- మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఉన్నత విద్య అభ్యసించండి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 14:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 2026 ఆగస్టు/సెప్టెంబర్ ఫాల్ సెషన్‌లో విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థుల దరఖాస్తు గడువును అక్టోబర్ 15, 2026 నుంచి అక్టోబర్ 31, 2026 వరకు పొడిగించినట్లు బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బి. బాలామాయాదేవి తెలిపారు. విదేశాల్లో మాస్టర్స్, డాక్టోరల్ కోర్సులు అభ్యసిస్తున్న లేదా అభ్యసించాలనుకునే అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**అర్హత ప్రమాణాలు:**

1. విద్యార్థి కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరుల నుంచి కలిపి రూ.5 లక్షల లోపు ఉండాలి.
2. దరఖాస్తు చేసుకునే తేదీ నాటికి విద్యార్థి వయస్సు 35 సంవత్సరాలకు మించకూడదు.
3. గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి.
4. జీఆర్‌ఈలో 260 లేదా జీమ్యాట్ లో 550 స్కోర్ కలిగి ఉండాలి.
5. టోఫెల్ లో 60 లేదా ఐఈఎల్టీఎస్‌లో 6.0 లేదా పీటీఈలో 50 స్కోర్ కలిగి ఉండాలి.

**దరఖాస్తు చేసుకునే విధానం:**

అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి, ఇతర వివరాలు తెలుసుకోవడానికి తెలంగాణ ఈ-పాస్ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. వెబ్‌సైట్: https://telanganaepass.cgg.gov.in/OverseasLinks.do

**దరఖాస్తులకు చివరి తేదీ:** 31 అక్టోబర్ 2026

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ పొడిగించిన గడువును వినియోగించుకోవాలని బీసీ సంక్షేమ శాఖ కోరింది.





# కాప్రా చెరువు అభివృద్ధిలో హైడ్రా

- వలస పక్షులకు ఆవాసంగా మార్చేందుకు చర్యలు
- స్వచ్ఛందంగా చెరువు అభివృద్ధికి భూములిచ్చిన రైతులు
- రూ.35 కోట్లతో కాప్రా చెరువు పునరుద్ధరణ పనులు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 14:**

కాప్రా చెరువు మళ్లీ కళకళలాడేలా.. పునరుద్ధరణ పనులను హైడ్రా శరవేగంగా చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన వెట్‌ల్యాండ్స్‌లో ఒకటిగా విరాజిల్లి.. వలస పక్షులకు ఆవాసంగా ఉండే ఈ చెరువుకు పూర్వ వైభవం తెచ్చేలా హైడ్రా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. సకల జీవకోటికీ ప్రాణాధరంగా.. జీవ వైవిధ్యం పెంపొందించేలా హైడ్రా పనులు సాగుతున్నాయి. 112 ఎకరాల మేర విస్తరించిన చెరువులో రైతులకు చెందిన భూములున్నాయి. హైడ్రా చెరువుల అభివృద్ధిని చూసిన స్థానిక రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కాప్రా చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని 70 ఎకరాలను చెరువు అభివృద్ధికి అప్పగించారు. నేరుగా హైడ్రా కమిషనర్‌ను కలిసి ఈ మేరకు ఆమోద పత్రాన్ని అందజేశారు. అంతే నిబద్ధతతో కాప్రా చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది. దాదాపు 60 శాతం చెరువు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ చెరువు అభివృద్ధి పనులను చూడడానికి స్థానికులు వస్తున్నారు. ఒకప్పుడు చుట్టుపక్కల ప్రజల జీవనంతో.. పక్షుల కిలకిలరావాలతో మమేకమైన కాప్రా చెరువు హైడ్రా రెండో దశలో అభివృద్ధి చేస్తున్న 14 చెరువుల్లో ఒకటి. 112.80 ఎకరాల ఎఫ్‌టీఎల్ విస్తీర్ణం కలిగిన కాప్రా చెరువు అభివృద్ధికి దాదాపు రూ.35 కోట్లను వెచ్చిస్తున్నారు.

**జీవవైవిధ్యానికి చిరునామా కాప్రా చెరువు**

జీవ వైవిధ్యానికి ప్రతీకగా చరిత్రకెక్కిన కాప్రా చెరువు.. సాధారణ నీటి వనరు మాత్రమే కాదు.. నగర పర్యావరణ సమతుల్యతకు కీలకమైన వెట్ ల్యాండ్ అని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ఈ వెట్‌ల్యాండ్‌కు ఆస్ట్రేలియా, యూరప్‌తో పాటు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 470కుపైగా వలస పక్షులకు ఆవాసంగా కాప్రా చెరువు నిలుస్తోంది. నీటి నిల్వతో పాటు పక్షులు, జలచరాలు, వృక్షజాలానికి అనుకూలమైన సహజ వాతావరణాన్ని అందిస్తున్న ఈ చెరువు జీవవైవిధ్య పరిరక్షణలో కీలకంగా ఉంది. అందువల్ల కాప్రా చెరువు అభివృద్ధి పనుల్లో సుందరీకరణతో పాటు దాని సహజ పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు హైడ్రా ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. చెరువు అభివృద్ధి అంటే కేవలం అందంగా తీర్చిదిద్దడం మాత్రమే కాదు.. చెరువును భవిష్యత్ తరాలకు భద్రంగా అందించడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి.

**ప్రకృతికి పెద్ద పీటవేస్తూ హైడ్రా పనులు**

భారీ వర్షాల సమయంలో వరదల నివారణ, భూగర్భ జలాల పెంపు, చేపలు, పక్షులు, ఉభయచరాలు, ఇతర జలచరాలకు ఆవాసంగా... జీవవైవిధ్య పరిరక్షణ, నీటిలోని కాలుష్య పదార్థాలు, మలినాలను సహజసిద్ధంగా వడపోతకు అనువుగా పూడిక తొలగింపు, వాతావరణ సమతుల్యత, పర్యావరణ పరిరక్షణ ఇలా వెట్ ల్యాండ్(చిత్తడి నేలల) ప్రాధాన్యతలన్నీ కలగలిపేలా చెరువును హైడ్రా అభివృద్ధి చేస్తోంది. అంతే కాకుండా..ప్రజలందరికీ అన్ని విధాలా ఉపయోగపడేల.. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన ఫెన్సింగ్, ఇన్‌లెట్, ఔట్‌లెట్ వ్యవస్థల అభివృద్ధి చేస్తోంది. పెద్దమొత్తం లో వరద నీరు నిలిచేలా లోతును పెంచుతున్నారు. ఉదయం వాకింగ్‌కు వచ్చే వారు..సాయంత్రం చెరువు గాలిని ఆస్వాదించే కుటుంబాలు.. పిల్లలతో ప్రశాంతంగా గడిపే స్థానికులు.. ఇలా కాప్రా చెరువు మళ్లీ ప్రజల జీవితంలో ఒక భాగంగా మారేలా పనులు కొనసాగుతున్నాయి. చెరువు చుట్టూ పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నారు.

చెరువు పరిధి పరిరక్షణతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు చెరువు పరిరక్షణ.. మరోవైపు వర్షపు నీటిని చెరువులోకి చేర్చేలా మెరుగైన నీటి ప్రవాహ వ్యవస్థ.. ఇంకోవైపు ప్రజలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం.. ఈ మూడు లక్ష్యాలతో కాప్రా చెరువు రూపుదిద్దుకుంటోంది.



# పురుగుల అన్నం పెడుతున్నారు..

## పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేరు!

**హరీశ్‌రావు వాహనాన్ని అడ్డుకుని విద్యార్థుల ఆవేదన**

**కరువుతో చదువులు మానేసి వలస వెళ్లాల్సి వస్తోందని వినతి**

**జోగులాంబ గద్వాల, వెలుతురు అక్టోబర్ 14 :**

మధ్యాహ్న భోజనంలో నాసిరకం అన్నం పెడుతున్నారని, సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక చదువులు సాగడం లేదని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఇందువాసి గ్రామంలో హరీశ్‌రావు వాహనాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అడ్డుకుని తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో ప్రతిరోజూ పురుగులతో కూడిన నాసిరకం అన్నం, వంకాయ కూర పెడుతున్నారని వాపోయారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు లేక చదువులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని, కనీస వసతులు కరువవడంతో బడి మానేస్తున్న వారి సంఖ్య పెరుగుతోందని తెలిపారు. మరోవైపు గ్రామంలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులతో చదువులు మధ్యలోనే మానేసి తల్లిదండ్రులతో కలిసి కూలీ పనుల కోసం వలస వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను ఓపికగా విన్న హరీశ్‌రావు.. పాఠశాల దుస్థితిని, విద్యార్థుల ఇబ్బందులను స్వయంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

# మహాచండీ దేవిగా అమ్మవారు

- మహాశక్తి ఆలయంలో పసుపు కొమ్ములతో చండీదేవి అలంకరణ
- ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- రేపు మహాశక్తి ఆలయంలో సరస్వతి పూజ... సాయంత్రం పల్లకీ సేవ
- రతన్ కుమార్ బృందంతో డ్యాన్సులు
- రెడ్ కలర్ డ్రెస్ కోడ్‌తో దాండియాలో పాల్గొనాలని నిర్వహకుల విజ్ఞప్తి



**కరీంనగర్, వెలుతురు:**

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో మహాచండీ దేవి(కుష్మాండ) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అలయ నిర్వాహకులు అమ్మవారిని పసుపు కుంకుమలతో అలంకరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మహాచండీ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దసరా నవరాత్రి ఉత్సవాల్లో చండీదేవి అవతారానికి విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఆదిశక్తి స్వరూపిణిగా పూజలందుకునే చండీదేవి దుష్టశక్తులను సంహరించి ధర్మాన్ని కాపాడే శక్తికి ప్రతీకగా నిలుస్తోంది. దేవీ మహాత్మ్యం ప్రకారం, మహిషాసురుడు, శుంభనిశుంభులు వంటి రాక్షసులను సంహరించిన జగన్మాత పరాక్రమం అమ్మవారి శక్తిసామర్థ్యాలను చాటిచెబుతుంది. ఆయుధధారిణిగా, సింహవాహనంపై కొలువుదీరిన చండీదేవి రూపం ధైర్యం, సాహసం, విజయానికి ప్రతీక. చండీదేవిని ఆరాధించడం వల్ల భయం తొలగి, ఆత్మ విశ్వాసం పెరిగి, జీవితంలోని అడ్డంకులను అధిగమించే శక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించే విజయానికి చండీదేవి అవతారం ప్రతీకగా నిలుస్తుంది. మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాశక్తి ఆలయంలో సరస్వతి పూజ నిర్వహించనున్నారు. సాయంత్రం పల్లకీ సేవ ఉంటుంది. అట్లాగే రతన్ కుమార్ బృందంతో డ్యాన్స్ కార్యక్రమం కొనసాగనుంది. అట్లాగే రేపు (శుక్రవారం) రాత్రి 9 గంటలకు నిర్వహించే దాండియాలో పాల్గొనే భక్తులంతా రెడ్ కలర్ డ్రెస్ కోడ్‌తో రావాలని ఆలయ నిర్వహకులు విజ్ఞప్తి చేశారు.



# సింగరేణిని దోచుకుంటున్నారు

- రేవంత్ ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్
- సింగరేణి అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని వెల్లడి



**హైదరాబాద్, వెలుతురు:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల కోసం సింగరేణి సంస్థను పంచుకొని దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు (కేటీఆర్) ఆరోపించారు. సింగరేణిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం శ్రద్ధ లేదని, ఆయన పాలనలో సంస్థ భ్రష్టుపట్టిపోతోందని విమర్శించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో అక్టోబర్ 14న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సింగరేణి కార్మిక గర్జన' సభలో ఆయన ప్రసంగించారు. కమిషన్ల లెక్కలు తేలకపోవడం వల్లే నైని టెండర్లను ప్రభుత్వం రద్దు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. నైని కుంభకోణాన్ని ఆపి రూ.30,000 కోట్లు ఆదా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పడాన్ని ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ పెద్దల మధ్య వాటాలు తేలనప్పుడే ఇలాంటి కుంభకోణాలు బయటకు వస్తాయని ఎద్దేవా చేశారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే కొత్త నిబంధన పేరుతో సింగరేణిలో సుమారు రూ. 10,000 కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని కేటీఆర్ సంచలన ఆరోపణ చేశారు. దీనితో పాటు సోలార్, జిలెటిన్ స్టిక్స్ కొనుగోళ్లు, మరో నాలుగైదు అంశాల్లోనూ పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని దుయ్యబట్టారు. సింగరేణి కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ అక్రమాలపై ఆధారాలతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశామని కేటీఆర్ వెల్లడించారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలపై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటంలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# అధికార పక్షమైనా.. ప్రతిపక్షమైనా అభివృద్ధిలో వివక్ష లేదు

- ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో రాజకీయాలకు తావులేదు.. అర్హతే ప్రామాణికం
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు:**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆ కుటుంబం ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలకే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పరిమితమైతే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పార్టీల తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గాన్ని సమానంగా చూస్తోందని అధికార పార్టీ ఎమ్మెల్యే ఉన్నా.. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నా.. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో ఎలాంటి వివక్షకు తావులేదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

బుధవారం నాడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా. పోచారంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి రాష్ట్ర పరిశ్రమలు ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ, పేదలు నివసించే ప్రాంతాల్లోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. క్యూర్ పరిధిలో మొదటి విడతగా లక్ష ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 23 నియోజకవర్గాల్లో పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశామని వెల్లడించారు. ఇప్పటికే ఆరు చోట్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశామని వివరించారు. మేడ్చల్ నియోజకవర్గంలో తొలి విడతగా 480 మంది లబ్ధిదారులను పారదర్శకమైన బహిరంగ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 2.20 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. త్వరలో రెండవ విడత ఇందిరమ్మ టవర్స్ కోసం మరోసారి దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ప్రతి అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన భూమిలో వాటాను కూడా రిజిస్ట్రేషన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. వచ్చే బతుకమ్మ పండుగ నాటికి తొలి విడత లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి, వారి చేతుల మీదుగా తాళాలు అందించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి వెల్లడించారు. తొలి విడతలో అవకాశం దక్కని అర్హులు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, తదుపరి విడతల్లో కొత్త దరఖాస్తుదారులతో సహా అర్హులందరినీ పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి,హౌసింగ్ శాఖ ఎండీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూచౌదరి తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో లబ్దిదారులు స్నేహ,శివకుమారి, రెహ్మోతి తదితరులు మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని, ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అనంతరం ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు జరిగింది.

# రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే జంతర్ మంతర్‌ను పునరుద్ధరిస్తాం!

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు:**

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలు, ఓటు చోరీకి వ్యతిరేకంగా శాంతియుతంగా పోరాడుతున్న వివిధ వర్గాల ప్రజలకు నిరసన తెలిపే అవకాశం కూడా లేకుండా చేయాలనే దురుద్దేశంతో జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమాలను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది ఎన్డీఏ పాలకుల పిరికితనానికి నిదర్శనం.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ధర్నా చౌక్‌ను ఎలా పునరుద్ధరించామో, అలాగే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన వెంటనే జంతర్ మంతర్‌ను పునరుద్ధరిస్తాం. జంతర్ మంతర్... జనం కోసం!

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com